ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital

మూడోసారి పోటీకి ఇష్టమే: ట్రంప్

భారత్, పాక్ సరిహద్దులు మళ్లీ ఉద్రిక్తం 5లో

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

29-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 267 పేజీలు:10+4 వెల: 6.50

# అల కల్లోలం



# 'మొంథా' టెర్రర్

## అంతర్వేది సమీపంలో తీరాన్ని తాకిన తుఫాన్

## గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో ఈదురుగాలులు



విశాఖలో పెనుగాలులకు చెట్టు కూలిపడిన దృశ్యం

### భారీగా ఆస్తి, పంట నష్టం

### వణికిన తీరప్రాంత జనం..

### లోతట్టు ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలింపు

### కోనసీమలో మహిళ మృతి

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను తీరాన్ని తాకింది. కాకినాడ మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకింది. పూర్తిగా తీరం దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో గాలులు వీచినట్లు అంచనా తీరం దాటే ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాల్లో భారీగా గాలులు వీస్తున్నాయి. తుపాను ప్రభావంతో కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రానున్న 24 గంటల్లో తీరప్రాంతంలో 15 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అంతర్వేదిపాలెంలో తీరం తాకిన మొంథా తుపాను గడిచిన దాదాపు 12 గంటల్లో గంటకు 17 కి.మీ. వేగంతో కదిలిన తుపాను మచిలీపట్నానికి 20 కి.మీ.దూరంలో తుపాను >>2



కాకినాడ తీరంలో సముద్ర అలల ధాటికి ఛిద్రమైన రహదారి

# తుఫాన్‌పై పూర్తి అప్రమత్తం



మంగళవారం మొంథా తుఫానుపై డిప్యూటీ సిఎం పవన్‌తో కలిసి సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

### క్షేత్రస్థాయిలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

### ప్రజలకు అండగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు

### తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ

### నష్టాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుఫాను ప్రభావం నుంచి ప్రజల ప్రాణాలు కాపాడి నష్టాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. సంక్షోభ సమయాల్లో ప్రజల చెంతనే ప్రభుత్వం ఉంటుందన్నారు. ప్రకృతి పరీక్షిస్తే, పరిపాలన రక్షణ కోసం ప్రయత్నిస్తోంది. రాష్ట్రంపై మొంథా తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ నుంచి సమీక్షించారు. ప్రస్తుతం తుపాను తీరానికి దగ్గరగా వస్తోందని, కోస్తాంధ్ర జిల్లాలపై దీని ప్రభావం ప్రారంభమైందని అధికారులు వెల్లడించారు. కాకినాడ, మచిలీపట్నం, విశాఖ తదితర తీరప్రాంతాల్లో వర్షాలు, గాలుల తీవ్రత ఉందని చెప్పారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. గతంలో వచ్చిన తుపానుల నష్టాన్ని బేరీజు వేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను తీరం దాటే కాకినాడ, ఆ పరిసర ప్రాంతాలకు రెస్క్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశాలు జారీ చేశారు. విశాఖ, ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. ఇప్పటికే తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశామని సీఎస్ విజయానంద్ వెల్లడించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎన్డీయే కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నేడు, రేపు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. తిత్లీ, హుద్‌హుద్ తుపాను వచ్చినప్పుడు కూడా సమర్ధవంతంగా ఎదుర్కొన్నామని సీఎం గుర్తు చేశారు. చెట్లు,స్తంభాలు వంటివి కూలినా యుద్ధప్రాతిపదికన తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తుపాను ప్రభావంతో కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందన్న సమాచారంతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని క్షేత్రస్థాయిలో మోహరించామని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను వెనక్కి రప్పించామని, వారితోనూ ఎన్డీయే శ్రేణులు సమన్వయంతో ఉండాలని సూచించారు. ప్రతి గంటకు బులిటెన్ కూడా విడుదల చేస్తామన్నారు. దాదాపు 39 నియోజకవర్గాలకు వర్ష ప్రభావం ఎక్కువగా చూపిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. సీఎం ఆదేశాల మేరకు కోస్తా జిల్లాల్లోని 26 తీరప్రాంత గ్రామాల్లో ప్రయోగాత్మకంగా మొంథా తుపాన్ హెచ్చరికలు పంపే వ్యవస్థను ఏర్పాటు చేశారు. రియల్ టైమ్ వాయిస్ అలర్ట్‌లను క్షణాల్లో అందిస్తున్నారు. విద్యుత్ అంతరాయం జరిగినా 360 డిగ్రీల్లో హార్న్ స్పీకర్ వ్యవస్థ, ఒక >>2



# 8వ వేతనసంఘం ఏర్పాటు

### 50 లక్షల ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి

### 18 నెలల్లో నివేదిక తయారు

### రూ. 36,792 కోట్ల ఎరువుల సబ్సిడీ

### కేబినెట్ కీలక నిర్ణయాలు

### వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మోడీసర్కార్ శుభవార్త చెప్పింది. లక్షలాదిమంది ఉద్యోగుల జీతాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు పెంచేందుకు 8వ వేతన సంఘం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ కమిషన్‌కు జస్టిస్ రంజనప్రకాశ్ దేశాయ్ సారథ్యం వహించనుండగా ఐఐఎం బెంగ >>2

# తెలంగాణలో హై అలర్ట్

### రాష్ట్ర వ్యాప్తంగా 3 రోజులు భారీ వర్షాలు

### పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ

### కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు28:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొథా ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు పడటం ప్రారంభించాయి. రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఈ మూడు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరం లేకుండా బయటకు వెళ్లరాదని సూచించింది. 24 గంటల్లో మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, జనగాం, సిద్దిపేట,యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. గడిచిన 24గంటల్లో ఆసిఫాబాద్, సంగారెడ్డి, మెదక్, మంచిర్యాల, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండతో పాటు పలు చోట్ల మోస్తరు >>2

## 'అద్విక' ఛీటింగ్ కేసు ప్రధాన నిందితుల అరెస్ట్

### 139 మంది డిపాజిటర్లకు రూ.143 కోట్ల మేర టోకరా

### రూ.23లక్షలు, బంగారం స్వాధీనం

**విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 28,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన అద్విక ట్రేడింగ్ మార్కెటింగ్ కంపెనీ ప్రజల నుండి డిపాజిట్‌లు సేకరించి బోర్డు తిప్పేసిన ఘటనలో ఫిర్యాది అయిన వీరమల్లు గణేష్ చంద్ర ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి సిపి రాజశేఖర బాబు ఆదేశాల మేరకు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. వివరాల ప్రకారం గణేష్‌చంద్ర తమ కుటుంబ సభ్యులు సదరు ట్రేడింగ్ కంపెనీ అధినేత తాడేపల్లి ఆదిత్యకు చెందిన కంపెనీలో రూ.53 లక్షలు డిపాజిట్ చేశారు. దానికి గాను >>2

# 40లక్షల మంది ప్రభావితం



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

### కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తుఫాన్ తీవ్రత

### మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలోనే..

### రెండుగంటలకోసారి పరిస్థితి సమీక్షిస్తున్న సిఎం: మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుపాను వల్ల రాష్ట్రంలో సుమారు 40లక్షల మంది ప్రజలు ప్రభావితమవుతున్నారు. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు అత్యధిక తీవ్రత కలిగిన ప్రాంతాలుగా గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఆ జిల్లాలు రెడ్ అలర్ట్‌లో ఉన్నాయి. ప్రజాప్రభుత్వం లక్ష్యం ఒక్కటే, ఎటువంటి ప్రాణ నష్టంఉండకూడదు, ముఖ్యమంత్రి ఆదేశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హోంమంత్రి అనితతో కలిసి మంగళవారం సాయంత్రం మంత్రి లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ తుపాను సహాయ చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ఒకపక్క డిజాస్టర్ మేనేజర్ మెంట్ మంత్రి అనిత, మరోవైపు ఆర్టీజీఎస్ మంత్రిగా నేను సమన్వయంతో గత 24గంటలుగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామన్నారు. మంగళవారంరాత్రి 11.30 గం.లకు అమలాపురం సమీపంలో తుపాను తీరం దాటబోతోంది. ఈ సందర్భంగా 90 నుంచి 100 కి.మీల వేగంతో అక్కడ ఈదురు గాలులు వీచే అవకాశం పరిసర ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

**1906 తాత్కాలిక షెల్టర్ల ఏర్పాటు.:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఈ నెల 23వ తేదీ నుంచి నేరుగా పర్యవేక్షిస్తున్నారు. యుఏఈకి వెళ్లే ముందు, అక్కడ నుంచి వచ్చిన తర్వాత 12 రివ్యూ మీటింగ్‌లు, టెలీ కాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా తుపాను >>2

## తిరుమలలో వైకుంఠద్వార దర్శనం

# 10 రోజులు యథాతథం



మంగళవారం టిటిడి బోర్డు సమావేశంలో చైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ సింఘాల్, అదనపు ఇఒ చౌదరి

### టిటిడి అన్ని ఆస్పత్రులకు ఒకే డైరెక్టర్‌గా డా.జగదీశ్

### రూ.30కోట్లతో కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం

### ప్రొక్యూర్‌మెంట్ సెల్ అవకతవకలపై ఎసిబితో విచారణ

### టిటిడి బోర్డు కీలక నిర్ణయాలు

**తిరుమల,అక్టోబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా పూజలు జరిగే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది డిసెంబర్‌లో కూడా పదిరోజులపాటు వైకుంఠద్వారాలు తెరిచి భక్తులకు దర్శనం కల్పించేలా టిటిడి నిర్ణయించింది. వైకుంఠద్వార దర్శనాల టోకెన్లు జారీ విధానం అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో 30కోట్లరూపాయలతో టిటిడి ఆలయాన్ని నిర్మించేందుకు నిర్ణయించారు. మంగళవారం తిరుమల అన్నమయ్య భవనం లో టిటిడి ధర్మకర్తలమండలి సమావేశం జరిగింది. >>2



## హైదరాబాద్ నుంచి 18 విమానాలు నిలిపివేత

'మొంథా' ఎఫెక్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు28:** మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో శంషాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిన 18 విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. వాతావరణం అనుకూలించని కారణంగా హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్టణం, రాజమహేంద్రవరానికి వెళ్లాల్సిన విమానాలను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. విజయవాడ, విశాఖ, రాజమహేంద్రవరం నుంచి శంషాబాద్‌కు రావాల్సిన 17 విమాన సర్వీసులను కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. రద్దయిన వాటిలో విశాఖపట్టణం నుంచి 9, రాజమహేంద్రవరం నుంచి 5, విజయవాడ నుంచి 5 విమానాలు ఉన్నాయి. మొంథా తుపాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో ఏపీ రాష్ట్రంలోనిఇ కోస్తా ప్రాంత జిల్లాలకు వెళ్లే పలు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. 107 రైళ్లను రద్దు చేసింది. బుధవారం,గురువారం కూడా రైళ్ల రద్దు ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. మంగళవారం 70, బుధవారం 36, గురువారం ఒక రైలును రద్దు చేసినట్లు వెల్లడించింది.



## 107 రైళ్ల రద్దు.. 10 దారి మళ్లింపు

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 28 ప్రభాతవార్త :** మొంథా తుఫాన్ నేపథ్యంలో 107 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు వెల్లడించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది. కొన్ని రైళ్లను ఇప్పటికే దారి మళ్లించింది. మరికొన్ని రైళ్ల గమ్యం కుదించింది. ఎపి నుంచి హైదరాబాద్ వైపు వచ్చే పలు రైళ్ల రద్దుచేసినట్లు దక్షిణ మధ్యరైల్వే పేర్కొంది. సోమవారంతో పాటు రేపు, ఎల్లుండి బయలుదేరే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, రైళ్లు రద్దు చేశారు. అదేవిధంగా పార్సిల్ రైళును, మరో 10 రైళ్లను దారి మళ్లించారు. మరో 28 రైళ్లను రీషెడ్యూల్ చేశారు. మరో రైలును రిస్టోరేషన్ చేయడంజరిగింది. తుఫాన్ తీవ్రతను బట్టి రైల్వే సర్వీసులను పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గోదావరి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్, విశాఖపట్నం.. తిరుపతి ఎక్స్‌ప్రెస్,చెన్నై సెంట్రల్ వీక్లి ఎక్స్‌ప్రెస్, ఎల్టిటీతో పాటు పలు ప్రధాన రైళ్లు, పలు పాసింజర్ రైళ్లు ఉన్నాయి. విశాఖ మీదుగా సాగే రెల్వే సర్వీసుల జాబితాను రైల్వే శాఖ ఇప్పటికే విడుదల చేసింది. స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసింది. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు జిఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.



కాకినాడ తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు

# 10 రోజులు యధాతథం

>> ఉదయం 10గంటలకు మొదలైన సమావేశం సాయంత్రం 6గంటల వరకు సుదీర్ఘంగా కొనసాగింది. ధర్మకర్తలమండలి ఛైర్మన్ బీఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలను టీటీడీ ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్,అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, నర్సిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవితో కలిసి మీడియాకు వెల్లడించారు. తిరుమల ఆలయంలో అత్యంత పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించిన పదిరోజులా,రెండురోజులా అనే అనుమానాలకు చెక్‌పెడుతూ సామాన్యభక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా పదిరోజులపాటు వైకుంఠ దర్శనాలకు మొగ్గుచూపారు. డిసెంబర్ 30వతేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినం మొదలవుతాయి. 31వతేదీ ద్వాదశితో పాటు 2026 నూతన సంవత్సరం జనవరి 8వతేదీ వరకు వైకుంఠద్వారాలు తెరచి ఉంచుతారు. పదిరోజులపాటు పవిత్రమైన వైకుంఠద్వారాలను తెరచి ఉంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ఐదువేల ఆలయాల నిర్మాణాలకు ఆమోదం తెలిపారు.దేశంలోని అన్ని టీటీడీ ఆలయాల్లో అన్నప్రసాద వితరణ ప్రారంభిస్తారు.కడపజిల్లా ఒంటిమిట్టలో 37కోట్ల రూపాయలతో వసతి సముదాయం నిర్మాణానికి ఆమోదం. మరో 3కోట్ల రూపాయలతో ఒంటిమిట్టపవిత్ర వనం నిర్మాణానికి ఆమోదించారు.టీటీడీ గోశాల నిర్వహణను గోసంరక్షకులకు అప్పగించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేశారు. చిత్తూరుజిల్లా కాణిపాకం వరసిద్దివినాయకస్వామి కొలువైన చోట 25కోట్ల రూపాయలతో టీటీడీ అతిథిగృహం, కళ్యాణమండపాల నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. సాధ్యమైనంతమంది ఎక్కువమంది భక్తులకు పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలు చేయించేందుకు ఇదివరకు లాగే పదిరోజులు వైకుంఠద్వార దర్శనాలకే ఆమోదం తెలిపారు. టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ సెల్‌లో భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించడంతో ఏసీబీతో విచారణ చేయించాలని బోర్డు నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ కొనుగోలుచేసిన అన్ని వస్తువుల్లోనూ భారీగా అవినీతి అక్రమాలు జరిగాయనేది బోర్డు నిర్ధారించింది. ఈ అక్రమాలపై సిబీఐతో సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించేలాచూస్తామన్నారు. టీటీడీ వైద్యవిభాగంలో అన్ని ఆసుపత్రులను మరింతగా పారదర్శకంగా నిర్వహించేందుకు ఒకే డైరెక్టర్‌క్రింద తీసుకురానున్నామన్నారు. ప్రస్తుతం బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్‌ను అన్ని ఆసుపత్రుల డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ అనుమతికి సిఫార్సు చేశారు. అంతకుముందు నవంబర్ 17నుండి 25వరకు జరిగే తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

### తెలంగాణలో హై అలర్ట్

>> నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో 6.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ చెప్పింది.వాతావరణ హెచ్చరికలు బుధవారం 9 గంటల వరకు కొనసాగుతాయని ఐఎండీ తెలిపింది. మెదక్ జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం వల్ల పలు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది.

# 8వ వేతనసంఘం ఏర్పాటు

>> ఊరు ఆచార్యుడు పాలుక్ ఘోష్ తాత్కాలిక సభ్యుడిగా, పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ సభ్య కార్యదర్శిగా ఉంటారు. జస్టిస్ దేశాయ్ కమిషన్ 18నెలల్లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. 8వ వేతన సంఘం సిఫారుసులు జనవరి ఒకటి నుంచి అమలయ్యే అవకాశం ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపడుతుంది. ఈ కమిషన్ సిఫార్స్‌లతో 50లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69లక్షల మంది పింఛనుదారులకు ప్రయోజనం కలుగనుందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

**ఎరువుల రాయితీకి ఆమోదం:** మరోవైపు రూ.37,952 కోట్ల ఎరువుల రాయితీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి ఫాస్పేట్ అండ్ పొటాషియం ఎరువులపై సబ్సిడీ రేట్లను నిర్ణయించే ప్రతిపాదనను కేంద్రం ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఎరువుల రాయితీకి రూ.37,952 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఇది 2025 ఖరీఫ్ సీజన్ కంటే రూ.736 కోట్లు ఎక్కువ అని చెప్పారు. డై అమ్మోనియం ఫాస్ఫేట్, నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్, సల్ఫర్ వంటి ఎరువులపై ఆమోదించిన రేట్ల ప్రకారం సబ్సిడీలు అందించనున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు సబ్సిడీతో, సరసమైన ధరలకు ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

# తుఫాన్‌పై పూర్తి అప్రమత్తం

>> కిలోమీటరు పరిధిలో కూడా స్పష్టమైన హెచ్చరికలను అందిస్తుంది. గడచిన 24 గంటల్లో విశాఖ, కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. మొంథా తుపాను ప్రభావం కారణంగా వర్ష ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి భారీ వర్ష సూచనలకు సంబంధించిన సమాచారాన్ని మొబైల్ ఫోన్లకు పంపామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా 2,703 జనరేటర్లను కూడా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎంకు తెలిపారు. సచివాలయాల వారీగా నిత్యావసర వస్తువులను కూడా సిద్ధం చేసుకున్నట్టు వివరించారు. అత్యవసర సమయంలో కమ్యూనికేషన్ కోసం పోలీసు విభాగం 81 టవర్లతో వైర్ లెస్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. జేసీబీలు, యంత్ర పరికరాలను కూడా యాప్ ద్వారా పర్యవేక్షి స్తున్నట్టు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పశువులకు కావాల్సిన గ్రాసం కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని, చెట్లు, టవర్లు, హోర్డింగ్ లు పడిపోయిన ప్రాంతాలను గుర్తించి తక్షణం పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్ష ప్రభావంతో ఇప్పటి వరకూ 43 వేల హెక్టార్ల పంట నీట మునిగిందని అధికారులు తెలిపారు. కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నీటమునిగిందని సీఎంకు వివరించారు. అయితే పంట నష్టం వివరాలను రైతులు కూడా పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో మార్పు చేర్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తుఫాను కారణంగా రోడ్లపై చెట్లు, విద్యుత్ స్తంభాలు, రోడ్ల ధ్వంసం వంటివి జరిగితే ఊళ్ల మధ్య రాకపోకలకు ఇబ్బంది అవుతుందని అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్ర స్థాయి యంత్రాంగంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని, అందరూ ఫీల్డులో ఉన్నారని మంత్రి నారా లోకేష్ సీఎంకు వివరించారు. సమీక్షకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్ , అనిత, నారాయణ, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులు హాజరైయ్యారు. ఇక ఎన్డీయే కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలికాన్ఫరెన్స్‌లో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం కాకినాడకు 270 కి.మీ దూరం నుంచి 15 కి.మీ వేగంతో రాష్ట్రం వైపు వస్తోంది. మంగళవారం రాత్రికి సివియర్ సైక్లోన్ గా మారి మచిలీపట్నంకళింగపట్నం మధ్య తీరం దాటుతుంది.కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. పరిస్థితి తీవ్రతను బట్టి రియల్ టైంలోనే మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నామన్నారు.

# 40లక్షల మంది ప్రభావితం

>> పరిస్థితులపై సమీక్ష చేశారు. ప్రధాని నరేంద్రమోడీ సీఎంతో మాట్లాడి ముందస్తు ఏర్పాట్లపై వాకబు చేశారు. తుపాను ప్రభావం, ముంపు తీవ్రత అధికంగా ఉండే 1,328 గ్రామాల్లోని ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించాం. 3,465 గర్భిణీలను తరలించి, వారికి కావాల్సిన పౌష్టికాహారం, నిత్యావసరాలను అందజేస్తున్నాం. 1,906 తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటుచేసి పునరావాసానికి అవసరమైన సామగ్రి అంతా పంపించామన్నారు.

**ఎన్ డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం:** 14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించాం, 364 స్కూళ్లను పునరావాస కేంద్రాలుగా మార్చాం. ఈ నెల 29వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీచేసి, నిషేధాజ్ఞలు విధించాం. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం 11 ఎన్ డీఆర్‌ఎఫ్, 12 ఎస్ డీఆర్ ఎఫ్ టీమ్ లు, రిజర్వ్ టీమ్ లు కూడా సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే రావడానికి ఆర్మీ కూడా హైదరాబాద్ లో సిద్ధంగా ఉన్నారు. 145 ఉడ్ కటింగ్ టీమ్స్ సిద్ధంగా ఉన్నారు, ఇప్పటికే విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో చెట్లు పడిపోయిన చోట వారు సేవలందిస్తున్నారు. మెడికల్ అండ్ హెల్త్ కు సంబంధించి 325 శిబిరాలు సిద్ధం చేశాం, 876 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ కూడా రెడీగా ఉన్నాయి.

**సహాయ చర్యలపై ముందస్తు ఏర్పాట్లు:**

తుపాను తీరం దాటిన తర్వాత పునరుద్ధరణ కార్యక్రమాలు చాలా కీలకం. ముఖ్యంగా విద్యుత్ శాఖకు సంబంధించి 11,347 స్తంభాలు, 1210 ట్రాన్స్ ఫార్మర్లు రెడీ చేశాం. సైక్లోన్ డైరెక్షన్ ను బట్టి సేవలందించేందుకు 772 రిస్టోరేషన్ టీమ్స్ ను కూడా సిద్ధంగా ఉంచాం. ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 7,289 జేసీబీ, క్రేన్స్, వాహనాలు సిద్ధంగా ఉంచాం. ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో పక్కాగా చర్యలు చేపట్టి 1,037 డీజిల్ జనరేటర్లను ఆయా ప్రాంతాలకు పంపించాం. ఎయిర్ టెల్, జియో, ఇతర సర్వీసు ప్రొవైడర్లు సెల్ ఫోన్ టవర్లకు అవసరమైన డీజి సెట్లు సిద్ధం చేశారు, డీజిల్ కూడా అందుబాటులో ఉంచాం.

**రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తున్నాం:** డ్రోన్స్, లోలెవల్ ఫ్లయింగ్ వెహికల్స్ తో పంట నష్టం, ఇళ్లు, ఆస్తి నష్టంపై రియల్ టైమ్ ట్రాకింగ్ పెట్టి యుద్ధప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు ప్రారంభిస్తాం తీరం దాటాక కూడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. గోపాలపురం ఎమ్మెల్యే ఎర్రకాలువ సమస్య ఉందన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టాం. తుపాను తీరం దాటాక క్షేత్రస్థాయిలో గ్రామాలు, పంటపొలాలకు వెళ్లి సహాయ, పునరావాస చర్యల్లో పాల్గొనాల్సిందిగా ప్రజాప్రతినిధులకు సూచించాం. ఇప్పుడు మా దృష్టి అంతా ప్రజలను చైతన్యవంతం చేసి, అప్రమత్తం చేయడమే. ప్రభుత్వం ఈ నెల 23నుంచే అప్రమత్తంగా ఉంది. ముఖ్యమంత్రిగారు ఇప్పటికి 12సార్లు సమీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులంతా ఫీల్డ్‌లోనే ఉన్నారన్నారు.

# 'మొంథా' టెర్రర్

>> విశాఖకు 220 కి.మీ. దూరంలో తుపాను కేంద్రీకృతమైంది.ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడకు సమీపంలో మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని అమరావతి వాతావరణ కేంద్రం . పూర్తిగా తీరాన్ని దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటలు సమయం పట్టే అవకాశం ఉందని వాతావరణ అధికార యంత్రాంగం పేర్కొంది. తీరాన్ని దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని స్పష్టం చేసింది. ఉహించినట్లు మంగళవారం రాత్రి పరిస్దితుల్లో అనుహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. దాదాపు 10 జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిస్తే, ఏడు జిల్లాల్లో పంటనష్టంతో రహదారి వ్యవస్ద దెబ్బతింది. కాకినాడ-మచిలీపట్నం మధ్య మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడిం చారు. గడిచిన 12 గంటల్లో గంటకు 17 కి.మీ వేగంతో తుపాన్ కదిలిందని పేర్కొన్నారు. ప్రస్తు తానికి మచిలీపట్నానికి 120 కిమీ, కాకినాడకి 110 కిమీ, విశాఖపట్నానికి 220 కిమీ దూ రంలో కేంద్రీకృతమైందని తెలిపారు. పూర్తిగా తీరం దాటడానికి 34 గంటల సమయం పడుతోందన్నారు. దీని ప్రభావంతో కోస్తా వెంబడి గంటకు 90-100 కిమీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వివరించారు. ప్రజలు సురక్షితంగా ఇంట్లోనే ఉండాలన్నారు, కృష్ణా జిల్లాలోని గుడివాడలో తుఫాను ప్రభావంతో భారీ గాలులతో పలుచోట్ల ప్రధాన రహదారుల్లో చెట్లు నేలకూలాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, గుడివాడ ముదినేపల్లి ప్రధాన రహదారిలో వృక్షాలు నేలకూలాయి. దీంతో రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్ నిలిచి పోయింది. హుటాహుటిన విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. చిమ్మ చీకటిలో ఆధునిక యంత్ర సామాగ్రితో రోడ్లపై కూలిన చెట్లను బృందాలు తొలగిస్తున్నాయి. అధికార యంత్రాంగం మొత్తం సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో 222 పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించి వాటిలో అవసరమైన 177 కేంద్రాలను ప్రారంభించింది. ఇప్పటివరకు మొత్తం 11317 మందిని పునరావాస కేంద్రాలకు చేరవేసింది. అంతేకాకుండా ఉచితంగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరము, జలుబు, దగ్గు,వాంతులు, విరోచనాల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరిగింది. సముద్ర తీర ప్రాంతంలో ఎలాంటి ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి కాపాడుటకు ఎక్కడికక్కడ మొత్తం 196 పడవలు, 296 గజఈతగాళ్లను లైఫ్ జాకెట్లతో సిద్ధంగా ఉంచారు. నాగాయలంకలోనీ శ్రీపాద క్షేత్రం నుండి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుటుంబాలు దెబ్బలో చిక్కుకుపోయిన నలుగురు గొర్రెల కాపరులను మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది ఎంతగానో కృషి చేసి సురక్షి తంగా ఒడ్డుకు చేర్చారు. మచిలీపట్నం నగరంలోని సాయిబాబా గుడి దగ్గర ఉన్న మురికి కాలువలో ఆవు దూడ ఇరుక్కుపోగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 1962 వాహన సిబ్బంది ఆ పశువులను సురక్షి తంగా బయటకు తీసి కాపాడారు. జిల్లాలో ప్రమాదాలను ప్రమాదాలు జరిగితే కాపాడేందుకు వీలుగా రెండు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను జిల్లాకు రప్పించి మచిలీపట్నం గుడివాడ డివి జన్లలో ఉంచడం జరిగింది. కృత్తివెన్ను మండలం వాలంక గ్రామానికి చెందిన కోయ సుబ్బా రావు (55) పై చెట్టు విరిగిపడటంతో కాలు పెరిగింది. 108 వాహనంలో ఎక్కించి చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చేర్చారు. తుఫాను ప్రభావానికి జిల్లాలో 12 మండలాల్లోని 68 గ్రామాలు, 5 పట్టన ఆవాసాలల్లో 41,729 మంది ప్రజలు ప్రభావితం అవుతున్నారని, ఇప్పటి వరకూ 35,114 మందిని సురక్షిత ప్రదేశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. మొత్తం 401 పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధం చేసి ఇప్పటి వరకూ 81 కేంద్రాలను తెరిచామని, లోతట్టు ప్రాంతాలలోని 9901 పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని, 52 మంది పశువైద్యులతో 30 పశువైద్య శిభిరాలు ఏర్పాటు చేసి 200 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం, 17 వేల వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచామన్నారు. సముద్ర వేటవలో ఉన్న బోట్లన్నిటినీ తీరానికి రప్పించామని, 4,573 బోట్లు కొట్టుకుపోకుండా ఉప్పుటేరు, క్రీక్ లలో ఉంచుకోవాలని మత్స్యకారులకు సూచించామని తెలియజేసారు. విజయవాడ డివిజన్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లుఅధికారులు తెలిపారు.ప్రధాన రైల్వేస్టేషన్ల హెల్ప్‌డెస్క్‌ల నంబర్లు ఇలా ఉన్నాయి.

విజయవాడ - 0866 2575167
గూడూరు - 08624 250795
నెల్లూరు - 90633 47961
ఒంగోలు - 78159 09489
బాపట్ల - 78159 09329
తెనాలి - 78159 09463
ఏలూరు - 75693 05268
రాజమండ్రి - 83319 87657
సామర్లకోట - 73823 83188
తుని - 78159 09479
అనకాపల్లి - 75693 05669
భీమవరం - 78159 09402
గుడివాడ - 78159 09462 .ఇక మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో రైలు సర్వీసులను రైల్వే శాఖ రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం నుంచి నడిచే దాదాపు 100 మేర విమాన సర్వీసులు రద్దయ్యాయి. కోస్తా జిల్లాల మీదుగా నడిచే మొత్తం 95 రైళ్ల సర్వీసులను రద్దు చేసినట్లు విజయవాడ డివిజనల్ రైల్వే తెలిపింది.

### వారం - వర్జ్యం

29-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
సప్తమి ఉ.9.21
ఉత్తరాషాఢ సాం.5.25
వర్జ్యం : రా.9.35-11.15
దు.ఉ.11.29-12.15
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం :** పెద్దల సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**వృషభం:** బంధు, మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఉద్యోగయత్నాలు.

**మిథునం:** షేర్లు, భూముల క్రయవిక్రయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** సంఘోద్ధరణకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు.

**సింహం:** కారణం లేని చికాకులు మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి.

**కన్య :** ముఖ్యమైన విషయాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం.

**తుల :** స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తులు పాటించండి. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడిందని గుర్తించి కొత్త వ్యూహాలను అనుసరిస్తారు.

**ధనుస్సు:** వృత్తి, ఉద్యోగాలలో ఏర్పడిన చికాకులను కుటుంబసభ్యులపై ప్రదర్శిస్తారు.

**మకరం:** సేవక బృందము యొక్క బాగోగులు పరిశీలించి వారికి సహాయం అందిస్తారు.

**కుంభం:** ప్రతి చిన్న పనికి శ్రమించి చివరకు పూర్తి చేస్తారు. ప్రయాణాలు.

**మీనం :** సంతానం విద్యా విషయంలో బాధ్యతతో వ్యవహరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



స్వాధీనం చేసుకున్న చరాస్థులను ప్రదర్శిస్తున్న దృశ్యం

# 'అద్విక' ఛీటింగ్ కేసు: ప్రధాన నిందితుల అరెస్ట్

>> రూ.13 లక్షలు ఇచ్చి కంపెనీ క్లోజ్ చేసి పారిపోయినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు వివరాలు బయటకు రావడంతో సుమారు 1355 మంది మోసపోయినట్లు వెల్లడైంది. దీంతో ఈ కేసును తీవ్రంగా పరిగణించిన సిపి రాజశేఖరబాబు ఆదేశాలతో క్రైం డిసిపి తిరుమలేశ్వరరెడ్డి,అధ్వర్యంలో సెంట్రల్ ఎసిపి దర్యాప్తులో టాస్క్‌ఫోర్స్ ఎసిపి లతకుమారి, వారి సిబ్బంది,10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు కొనసాగించారు. ప్రధాన నిందితుడైన ఆదిత్య,మిగిలిన నిందితుల బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను, టెక్నికల్ సాక్షాలను సేకరించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక బృందాల సమాచారం మేరకు సెంట్రల్ ఏసిపి దామోదరరావు వారి సిబ్బందితో కలిసి బల్లెం వారి వీధిలోని శ్రీ లక్ష్మిఎంక్లేవ్ అపార్ట్‌మెంట్ వద్ద నలుగురు నిందితులు, ఏజెంట్లైన తాడేపల్లి వెంకట ఆదిత్య, తాడేపల్లి అలియాస్ గంట సుజాత,గాదంశెట్టి బాలకృష్ణమూర్తి,(బృందావన్‌కాలని), గాదెంశెట్టి నాగలక్ష్మి(బృందావన్ కాలనీ)అను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో ప్రధాన నిందితుడైన ఆదిత్య అతని భార్య అయిన రెండవ నిందితురాలు సుజాత 2022లో అద్విక ట్రేడింగ్ కంపెనీ స్థాపించి రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టి,దుబాయిలో ఉన్న 'కబానా అకౌంట్' ద్వారా ట్రేడింగ్ ప్రారంభించారు. మొదట్లో పెద్దగా లాభాలు రాకపోయిన డబ్బులు సంపాదించాలన్న ఆశతో అధిక లాభాల పేరుతో ప్రధాన నిందితుడైన ఆదిత్య,అతని భార్య సుజాత,ఏజెంట్లు అయిన బాలకృష్ణమూర్తి, నాగలక్షీ శ్రీకుమారి,ఇతర ఏజెంట్ల సహాయంతో నెలకు 5% వడ్డీ ఏజెంట్లకు 3-4% మోసపూరిత హామినిచ్చి ప్రజలనుండి అధిక మొత్తంలో డిపాజిట్‌లు సేకరించారు. ట్రేడింగ్‌లో లాభాలు లేకపోయినా కొత్త డిపాజిటర్స్ కట్టిన డబ్బులతో పాత డిపాజిటర్స్‌కు వడ్డీ చెల్లించారు. 2023లో వార్షికోత్సవం నిర్వహించి మరిన్ని డిపాజిట్లు సేకరించారు. విచారణలో 2022 నుండి ఇప్పటి వరకు సుమారు 1450 మంది వద్ద నుండి సుమారు 400 కోట్లు డిపాజిట్‌లు సేకరించి దానిలో కొంత భాగాన్ని దుబాయిలో ఉన్న కబానా ట్రేడింగ్ మల్టీ బ్యాంకింగ్ ఫోరెక్స్ వంటి విదేశీ ప్లాట్‌ఫారంలకు బదిలీ చేసినట్లు వెల్లడైంది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో సుమారు 14 కోట్లు లాస్ వచ్చినా కొత్తగాసేకరించిన డిపాజిట్స్‌నే పాత వారికి వడ్డీ కింద ఇచ్చారు. డిపాజిట్‌లలో సుమారు 4కోట్లతో ఆదిత్య చరాస్తులు కొనుగోలు చేశాడు. డిపాజిట్స్ దారులకు వడ్డీ కట్టలేని స్థితికి వచ్చేసరికి పలాయనం చిత్తగించాడు. అద్విక ట్రేడింగ్ కంపెనీలో మూసివేసే సమయానికి సుమారు 1450 మంది డిపాజిటర్స్,60 మంది ఏజెంట్లు ఉండగా వారిలో 1150 మంది డిపాజిటర్ స్ల నష్టపోయిన డబ్బులు సుమారు 135కోట్లు. సుమారు 25 ఏజెంట్లు నష్టపోయింది 9 కోట్లు. మొత్తం 144 కోట్లు. ఈ కేసులో నిందితులకు సంబంధించి రూ.100 కోట్ల విలువైన చరాస్థులను పోలీసులు గుర్తించి, వారినుండి రూ.23 లక్షల నగదు,580 గ్రాముల బంగారపు వస్తువులు,8.3 కిలోల వెండి వస్తువులు,టాటా సఫారి కారు,కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.కేసు విచారణలో కృషి చేసిన సెంట్రల్ ఏసిపి దామోదరరావు,టాస్క్‌ఫోర్స్ ఎసిసి లతకుమారి,సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, సిహెచ్ ప్రకాష్,వాసిరెడ్డి శ్రీను,ఎ.పవన్ కిషోర్,ఎన్. రాజశేఖర్, డి.చవాన్, బి.చంద్రశేఖర్, కె.కిషోర్‌బాబులను,క్రైం డిసిపి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డిని సిపి రాజశేఖర బాబు ప్రత్యేకంగా అభినందించారు.


# 9 జిల్లాల్లో 544 క్యాంపుల ఏర్పాటు

## కోనసీమ జిల్లావాసులు బయటకు రావొద్దు: స్పెషల్ సిఎస్ అజయ్‌జైన్

**విశాఖపట్టణం, అక్టోబరు 28 :** మొంథా తుపాను మంగళవారం సాయంత్రం 5.00 గంటల సమయానికి కాకినాడ తీరానికి 120 కి.మీ. దూరంలో ఉందని, రాత్రి 10 నుంచి 12 గంటల మధ్యలో రాజోలు వద్ద తీరం దాటే అవకాశం ఉందని కోస్తాంధ్ర 9 జిల్లాల తుపాను ప్రత్యేకాధికారి, రాష్ట్ర స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ పేర్కొన్నారు. 9 జిల్లాల్లో 554 క్యాంపులు ఏర్పాటు చేశామని, 31,600 మందిని తరలించామన్నారు. కోనసీమ జిల్లా వాసులు బైటకు రావద్దని హెచ్చరికలు చేస్తున్నామన్నారు. కొబ్బరి, పామ్ ట్రీలు విరిగిపడే ప్రమాదం ఉందని, కోనసీమలో పవర్ సప్లైకి విఘాతం కలిగే అవకాశం ఉందని అజయ్ జైన్ పేర్కొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా 18 వేల విద్యుత్ స్తంభాలను సిద్ధంగా ఉంచామని వివరించారు. కోనసీమ జిల్లా మామిడికుదురులో చెట్టుపడి 48 ఏళ్ల మహిళ దురదృష్టవశాత్తు మృత్యువాత పడిందని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన మినహా ఎక్కడా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. మరీ అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.ప్రతి చోటా తక్షణ సహాయక బృందాలను అందుబాటులో ఉంచాం : జిల్లా కలెక్టర్27వ తేదీ ఉదయం నుంచి 28వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు విశాఖపట్టణం జిల్లాలో 147 మి.మీ. వర్షపాతం నమోదైందని, 28వ తేదీ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 3.00 గంటల వరకు 1.3 సెం.మీ. వర్షపాతం నమోదైందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. సోమవారంతో పోల్చితే మంగళవారం జిల్లాలో వర్షపాతం తగ్గిందని స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, జీవీఎంసీ పరిధిలోని 10 జోన్లలో జోన్ కు రెండేసి చొప్పున క్యూ.ఆర్.టి. బృందాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఎప్పటికప్పుడు చెట్ల కొమ్మలను, డ్రెయిన్లలో పూడికను తొలగిస్తున్నామని వివరించారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు. ప్రస్తుతం 8 క్యాంపుల్లో 144 మంది పునరావాసం పొందారని వివరించారు. ములగాడ, సీతకొండ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయని, ఇతర చోట్ల రాళ్లు జారాయని పేర్కొన్నారు. మేఘాద్రి గెడ్డలో 6,000 క్యూసెక్కులు ఇన్ ఫ్లో, 7,000 క్యూసెక్కులు ఔట్ ఫ్లో ఉందని చెప్పారు. జిల్లాలోని 14 చెరువులు ప్రమాదరకర స్థితిలో ఉన్నాయని, ప్రజలను అప్రమత్తం చేయటంతో పాటు పునరావాస కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు. 119 చెట్లు కూలిపోగా 60 తొలగించామన్నారు. 9 విద్యుత్ స్తంభాలు పడిపోగాఏడింటిని పునరుద్ధరించామన్నారు. 16 యూజీడీ డ్రెయిన్లు పొంగిపొర్లగా మంగళవారం సాయంత్రం నాటికి తొమ్మిదింటిని సరి చేశామని, పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. 29 చోట్ల నీరు నిలిచిపోగా 22చోట్ల పునరుద్ధరణ చర్యలు చేపట్టామన్నారు. 8 గోడలు కూలిపోగా 4 చోట్ల చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా 35 ట్యాంకులను అందుబాటులో ఉంచామని కలెక్టర్ వివరించారు.

### చెట్టుకూలి కోనసీమలో
# మహిళ మృతి

**అమలాపురం, అక్టోబరు 28:** మొంథా తుపాను తీరం తాకే సమయంలో ప్రకృతి భీభత్సం సృష్టించింది. కోనసీమ జిల్లాలోని మాకనగూడెం గ్రామంలో చెట్టుకూలి మీదపడి ఒక మహిళ చెందినట్లు అధికారులు తెలిపారు. కోస్తాతీరంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ తుపాను భీభత్సానికి ప్రజలు వణికిపోతున్నారు. మొత్తం 19 సహాయ శిబిరాల్లో 700 మందిని చేర్పించామని అధికారులు చెపుతున్నారు. 22 జిల్లాల్లో రాష్ట్రప్రభుత్వం మొత్తం 3174 పునరావాసకేంద్రాలను ఏర్పాటుచేసింది. 3778 మంది అధికారులను నియమించింది. ఒక్క కోనసీమ జిల్లాలోనే అత్యధికంగా 650 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసింది. 110 కిలోమీటర్ల వేగంతో వస్తున్న ఈదురుగాలులకు విద్యుత్‌సరఫరా స్తంభించిపోయింది. అనేక చోట్ల విద్యుత్‌స్తంభాలు కూలి పోవడంతో సరఫరానున నిలిపివేసారు. విశాఖ ఎయిర్‌పోర్టునుంచి మొత్తం 32 విమానసర్వీసులు రద్దయ్యాయి.



కోనసీమ ప్రాంతంలో నీటమునిగిన కాలనీలు

# ప్రజలు ఆందోళన చెందవద్దు



### మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ

### తుఫాన్ ప్రభావిత తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించిన కేంద్రమంత్రి , ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

**నరసాపురం, ప్రభాతవార్త :** మొంథా తుఫానును సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేసిందని, తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందవద్దని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం నరసాపురం నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో ఆయనతోపాటు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ గొట్టిపాటి రవికుమార్, నర్సాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాలలో పర్యటించి పునరావాస కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాల్లో వసతి సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న తుఫాన్ బాధితులతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుందని, ఆందోళన పడవద్దని మంత్రులు శ్రీనివాస వర్మ, గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. అనంతరం నర్సాపురం మండలం పెద్దమైనవానిలంకలోని పునరావాస కేంద్రాన్ని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, జిల్లా ఇన్చార్జి మంత్రి రవికుమార్, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సందర్శించారు. పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లపై తుఫాన్ బాధితులతో మాట్లాడి తెలుసుకున్నారు. జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని, ప్రజలు ధైర్యంగా ఉండాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ కోరారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన వారికి మంచి భోజనం, అల్పాహారం అందించాలని, ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అధికారులను ఆదేశించారు. సముద్రపు కోత నుండి పెద్దమైనవాని లంక గ్రామానికి పూర్తి రక్షణ కల్పిస్తాం.. సముద్రపు కోతకి గురవుతున్న పెద్దమైనవానిలంక తీర ప్రాంతాన్ని పరిశీలించారు. సముద్రపు కోత నివారణకు జరుగుతున్న అడ్డుకట్ట పనుల పురోగతిని నరసాపురం ఆర్డీవో దాసిరాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని, జిల్లాలో మొగల్తూరు మండలంలో 8, నరసాపురం మండలంలో 8 చొప్పున మొత్తం 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం కూడా నరసాపురం ప్రాంతానికి చేరుకుందని తెలిపారు. రాష్ట్రంలో తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోడీకి ఫోన్లో తెలిపారని, తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కావలసిన అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చారని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తెలిపారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లలో నుంచి బయటికి రావద్దని ఆయన సూచించారు. అనంతరం వేములదీవి వెస్ట్, ఈస్ట్ గ్రామాలలో పర్యటించి పునరావాస కేంద్రాలను సందర్శించారు. పర్యటనలో మంత్రుల వెంట ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిలు కలిదిండి వినోద్ వర్మ, తోట గంగరాజు పాల్గొన్నారు.



# తిరుమలపై 'మొంథా'!

### - కూలిన భారీ చెట్టు, కారు ధ్వంసం
### - ఎడతెరపిలేకుండా కురుస్తున్న వాన

**తిరుమల,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** 'మొంథా"తుఫాన్ ప్రభావం తిరుమలపై తీవ్రంగా చూపుతోంది. మంగళవారం ఉదయం నుండి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు తిరుమల బాలాజీనగర్లో భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో దానిక్రింద పార్కుచేసిన కారుపై పడటంతో ధ్వంసమైంది. అదే ప్రాంతంలో భక్తులు, స్థానికులు కూడా లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. కూలిన చెట్టును టిటిడి అటవీశాఖ అధికారులు గంటలోపే తొలగించారు. ఇటీవల వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు తిరుమల జలమయంగా మారింది. కొండపై ఐదు ప్రధాన జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. మంగళవారం ఉదయం నుండి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తోంది. ఓ వైపు ఎడతెరపిలేని వర్షం మరోవైపు విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా కురుస్తున్న వానలతో వాతావరణం మారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు. మంగళవారం ఉదయం కూడా భారీ వర్షం కురవడంతో భక్తులు ఆలయంలోపలకు శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపలకు వర్షంలో తడిసి లడ్డూవితరణ శాలకు చేరుకోవాల్సి వస్తోంది. భారీ వర్షాల కారణంగా తిరుమల ఘాట్రోడ్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని, వాహనదారులు ,భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజిలెన్స్ హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు పడుతుండటంతో ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు తలదాచుకునేందుకు షెడ్లవద్దకు పరుగులు తీస్తున్నారు. భారీ వర్షాలకు భక్తులు జాగ్రత్తలు పాటించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది. వర్షం తగ్గుముఖం పట్టేవరకు భక్తులు తిరుమలలో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరుతున్నారు. తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే, తిరుగుప్రయాణమయ్యే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు కొండల్లోంచి జలపాతాలు జోరున పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్నాయి. తిరుమలకొండలను తెల్లటిపొగమంచు కమ్మేసి ఆహ్లాదకరంగా ఊటీని తలపింపజేస్తోంది.

# తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం, అధికారులు అప్రమత్తం

### ఉప్పుటేరు వద్ద ప్రమాదకరంగా లేదు - పునరావాస కేంద్రాల వద్ద ఆహారం, వైద్య సౌకర్యాలు - జోరువానలో తుఫాన్ ప్రాంతాల్లో ఎంపి పర్యటన

**ఏలూరు, ప్రభాతవార్త అక్టోబర్ 28:** ఏలూరు జిల్లాలోన తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పర్యటించారు. ఉదయం జోరువానలోనే కొల్లేరు బయలుదేరిన ఎంపీ, కైకలూరు సమీపంలో మాదేపల్లి గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడారు. కొల్లేరు సమీపంలో చెరువుల వద్ద ఆక్వా రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కైకలూరు నుంచి ఉప్పుటేరు బ్రిడ్జి వద్దకు చేరుకున్న ఎంపీ ఉప్పుటేరు నీటి ఉధృతిని పరిశీలించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఉండి ఎమ్మెల్యే, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తో కలిసి ఉప్పుటేరు ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఎంపీ పుట్టా మహేష్ మీడియాతో మాట్లాడారు. తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం, అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, ఎటువంటి ప్రాణ నష్టం జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుగారు, నారా లోకేష్ గారు నిరంతరం పరిస్థితులను సమీక్షి స్తున్నారని, ప్రజా ప్రతినిధులంతా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఆహారం, అత్యవసర వైద్యం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతరం అక్కడినుంచి కైకలూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పునరావాసం పొందుతున్న వ్యక్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సాయంత్రం ముదినేపల్లి మండలం పెనుమల్లి గ్రామంలో కూటమి పార్టీల కార్యకర్తలతో భేటీలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తుఫాను సహాయ చర్యల్లో పాల్గొనాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరం అయితే ఏలూరు కలెక్టరేట్ వద్ద కంట్రోల్ రూమ్ నెంబర్ 1800233 1077, 94910 41419 ఫోన్ నెంబర్ల లేదా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయ నంబర్స్ +91 96181 94377, +91 98855 19299 కు ఎవరైనా కాల్ చేయవచ్చని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.

# ప్రాజెక్టులను పరిశీలించిన కడప, అన్నమయ్య జిల్లా కలెక్టర్లు

### పించా ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత



**రాజంపేట, అక్టోబర్28 ప్రభాతవార్త** రాజంపేట, అక్టోబర్ 28: కడప, అన్నమయ్య జిల్లాలలో "మొంథా" తుఫాను ప్రభావంతో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రెండు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తమయ్యారు. అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. స్వయంగా వారే ప్రాజెక్టులను, ప్రమాదకరమైన ప్రాంతాల్లో పరిశీలించారు. పెనగలూరుమండలం లోని పల్లంపాడు గ్రామాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన,రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే తో కలసి పరిశీలించారు. గ్రామాన్ని నీరు చుట్టుపడటంతో నదిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎస్డిఎఫ్ బృందాన్ని అక్కడే మకాం వేసేలా ఆదేశించారు. మరోవైపు కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి బుగ్గ వంక ప్రాజెక్టు ను పరిశీలించారు. రెండు జిల్లాలలో దాదాపు అన్ని ప్రాజెక్టులు నిండిపోయాయి. దీంతో వీటిని లోతట్టు ప్రాంతాలకు విడుదల చేశారు. గండికోట, మైలవరం, బుగ్గ వంక, వెలుగల్లు, పింఛ ప్రాజెక్టులు నిండిపోవడంతో నీటిని విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు చెయ్యరు నది వరద ప్రవాహాన్ని స్వయంగా వెళ్లి పరిశీలించారు. మందపల్లి గ్రామాన్ని పరిశీలించారు ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండు జిల్లాలలో తుఫాన్ ప్రభావంతో ఎక్కడా భారీ వర్ష వర్షపాతం నమోదు కాలేదు. కడప జిల్లాలో అత్యధికంగా కాసినాయన మండలంలో 6 సెంటీమీటర్లు, అన్నమయ్య జిల్లాలో పెన గలూరులో 3 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది.

# తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు

### పునరావాస కేంద్రాలను పరిశీలించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (ప్రభాతవార్త):** మొంథా తుఫాను నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఇతర అధికారులతో కలిసి కాకినాడ పట్టణం ఏటిమొగ, దుమ్ములుపేట; పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, తాళ్ళరేవు మండలం గాడిమొగ ఇతర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. కాకినాడ పట్టణంలో పునరావాసక కేంద్రాలకు తరలించిన ప్రజల కోసం కాకినాడ సూర్యకళామందిరం ప్రక్కన సిద్ధం చేసిన భోజన పదార్థాలను జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం కాకినాడ పట్టణం దుమ్ములుపేట తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజల కోసం పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ప్రజలకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు స్వయం గా మధ్యాహ్నం భోజనం వడ్డించారు. అనంతరం కాకినాడ జిల్లా తాళ్ళరేవు గాడిమొగ ధీరుబాయ్ అంబానీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను అడిగి తెలుసు కున్నారు. ప్రజలకు భోజన పదార్థాలు వడ్డించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ మొంథా తుఫాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో 18 మండలాల్లో 67 గ్రామాలు, 5 పట్టణ ప్రాంతాల్లో తుఫాను ప్రభావం ఉంద న్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలను సుంక్షి త ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసేమన్నారు. జిల్లా వ్యాప్తంగా 401 పునరావాస కేంద్రాలు సిద్ధం చేయగా, ఇప్పటికే 76 కేంద్రాలు ప్రారం భించామన్నారు. కాకినాడ పట్టణంలో 16 పునరావాస కేంద్రాల్లోకి లోతట్టు ప్రాంత ప్రజలను తరలించడం జరి గిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికాం యంత్రాంగ ం పునరా

# అవసరమైతే తప్ప.. ప్రజలు బయటకు రావొద్దు

### - మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి సూచన



**ఒంగోలు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 28:** తీవ్ర తుఫాను ప్రభావరీత్యా మంగళవారం రాత్రికి ప్రజలు ఎట్టి పరి స్థితుల్లో సాధ్యమైనంత వరకు బయటకు రావద్దని ఏదైనా అత్యవసర పరిస్థితుల దృష్ట్యా పోలీస్ శాఖ వారిని గాని, రెవిన్యూ శాఖ వారిని గాని, తెలుగుదేశం నాయకులనుసంప్రదించగలరని మార్కా పురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గ అధికారలతో చరవాణి ద్వారా సమీక్ష నిర్వహించామని, నియోజక వర్గంలోని తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో, వార్డుల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# రాజధానిలో ప్రత్యేక ప్రాజెక్టులకు ఎస్పీవి ఏర్పాటు

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికారిక సంస్థ (సీఆర్డీఏ) పరిధిలో ప్రత్యేక ప్రాజెక్టులు చేపట్టేందుకు 'అమరావతి గ్రోత్,ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్' పేరుతో ప్రత్యేక వాహక సంస్థ(ఎస్పీవీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రత్యేక ప్రాజెక్టులు గడువులోగా పూర్తి చేసేందుకు ఎస్పీవీ అవసరమన్న సీఆర్డీఏ కమీషనర్ ప్రతిపాదనలు ఆమోదిస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 'అమరావతి గ్రోత్,ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్'కు రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్గా వ్యవహరిస్తారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఇంధన,రోడ్లు,భవనాల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు,పరిశ్రమల శాఖ కార్యదర్శి,సీఆర్డీఏ కమీషనర్ డైరెక్టర్లుగా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది.

# గ్రామీణ స్థానికసంస్థలకు రూ. 410 కోట్లు విడుదల

### గ్రామీణాభివృద్ధి సంస్థ ఉత్తర్వులు

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ స్థానికసంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.410 కోట్లు విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్త ర్వులు జారీచేసింది. 202526 సంవత్స రానికి సంబంధించి మొదటి విడత అన్ టైడ్ గ్రాంట్ కింద రూ.365 కోట్లు,

అదనపు నిధులు మరో రూ.45 కోట్లు కలిపి మొత్తం రూ.410 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం వేరు వేరుగా ఆదేశాలిచ్చింది.

# ర్యాంప్ ప్రోగ్రాం పర్యవేక్షణకు కమిటీ

**వి.యవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** పరిశ్రమల శాఖ కార్యదర్శి చైర్మన్గా వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళిక అమలు ల క్ష్యం(ఎస్ఐపీ-ఐపీ) కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్ఎంఈ సీఈవో కమిటీ మెంబర్ కన్వీనర్గా...వివిధ శాఖలకు చెందిన 7 మంది సభ్యులుగా... జిల్లా నోడల్ అధికారులు ప్రత్యేక ఆహ్వానితులుగా కమిటీలో ఉంటారని పేర్కొంది. ర్యాంప్ జిల్లా నోడల్ అధికారులు కమిటీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. నిర్ధేశించిన లక్ష్యాల మేరకు ర్యాంప్ ప్రోగ్రాంలో తీసుకున్న నిర్ణయాల పురోగతిని నెలకోసారి కమిటీ సమీక్షించాలి. వ్యూహాత్మక పెట్టుబడి కార్యాచరణకు అనుగుణంగా సమావేశం ఉండాలిభాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయ ప్రోగ్రాం లక్ష్యాలను నిర్ధేశిత వ్యవధిలో సాధించేలా పర్యవేక్షించాలి పెట్టుబడుల పురోగతిపై నివేదిక పంపాలి.

# తిరుమల సమాచారం

## కార్తికమాస హోమాల్లో వేదోక్తంగా నవగ్రహహోమం



**తిరుమల,అక్టోబర్ 28ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యం లోని ప్రముఖ శైవాలయం తిరుపతి కపిలేశ్వర ఆలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా మంగళవారం నవగ్రహహోమం నిర్వహించారు. ఆలయ అర్చ కులు ఉదయం శాస్త్రోక్తం గా యాగశాలలో పూజ, హోమం, లఘుపూర్ణాహుతి, నివేదన హారతి చేపట్టారు. సాయంత్రం హోమం, సహస్రనామార్చన, విశేషదీపారాధన జరిపించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు. కార్తీకమాసాన నెలరోజులపాటు హోమాలను ఏకాంతంగా జరిపించడం సంప్రదాయం.

## అంతా మంచి జరగాలి

### - శ్రీవారి సుప్రభాతసేవలో తమిళనటుడు అజిత్కుమార్



**తిరుమల,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడు...తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తమిళనాడు అజిత్కుమార్ తెలిపారు. మంగళవారం వేకువజామున ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి సుప్రభాతసేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకుని దేవుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రం బహుకరించారు.ఆలయం వెలుపలకు వచ్చిన అజిత్ను చూడటానికి ఆయనతో చేతులు కలిపి సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు. అందరినీ ఆప్యాయంగా పలకరించి అభిమానులతో సెల్ఫీలు దిగారు.అందరి కోరికతో ఆయన స్వయంగా సెల్ఫీలు దిగడమేగాక తీశాడు. అభిమానులతో ఆనందంగా గడిపారు. ఓ అభిమానితో స్వయంగా ఆయన సెల్ఫీ దిగడం అక్కడివారిని ఔరా అనిపించింది. కొందరు అభిమానులు తల.. తల అనే నినాదాలు చేయగా ఆలయంముందు అలాంటి నినాదాలు వద్దని ఆయన సైగలతో సూచించారు.

## శ్రీవారి సేవలో జయ్అన్మోల్అంబానీ



**తిరుమల,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** కలి యుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్అంబానీ కుటుంబసభ్యుడు జయ్అన్మోల్అంబానీ దర్శించు కున్నారు. కుటుంబంతో కలసి వచ్చిన ఆయన ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఆలయంలో తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన అన్మోల్అంబానీ ఆనందనిలయం లోని శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన జయ్అన్మోల్అంబానీని చూడటానికి భక్తులు ఆసక్తిచూపారు. సెల్ఫీలు తీసుకున్నారు. భక్తులతో ఆయన కూడా ఆప్యాయంగా పలకరించారు. తదేకంగా ఆధ్యాత్మికభావంతోనే కనిపించారు.

# 'ఆరంజ్ అలర్ట్'తో తిరుపతిలో ముంచెత్తుతున్న వానలు

### - తీరప్రాంత మండలాలపై ప్రత్యేక ఫోకస్



**తిరుపతి,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** "మొంథా"తుఫాన్ తో తిరుపతి జిల్లాలో ప్రభుత్వం ఆరంజెఅలర్ట్ ప్రకటించినా జిల్లావ్యాప్తంగా వానలు ముంచెత్తుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం వరకు తిరుపతి,తిరుపతి రూరల్,చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, చిల్లకూరు ,సత్యవేడు, పుత్తూరు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2గంటల నుండి విపరీతమైనగాలులు వీస్తున్నాయి. తుఫాన్ తీరం దాటే అవకాశం ఉండటంతో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికార యంత్రాంగం హెచ్చరికలు చేసింది. మంగళవారం తిరుపతి కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కంట్రోల్రూమ్లో తుఫాన్ పరిస్థితుల అంచనా ప్రత్యేక అధికారి అరుణ్బాబు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, ఇన్ఛార్జి సంయుక్తకలెక్టర్ మౌర్య రెవెన్యూయంత్రాంగంతో సమీక్షించారు. తిరుపతి జిల్లాలో తుఫాన్ను తేలికగా తీసుకోవద్దని, వర్షాల తీవ్రత దృష్ట్యా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.


**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**

NIWAS HOUSING FINANCE

(పూర్వపు ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం-కార్యాలయం : యూనిట్ నం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ అంధేరి ఘట్కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093

**సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన**

NHFPL ఈ క్రింది రుణగ్రహీతలకు [illegible] గృహ రుణం/తనఖా రుణం/నిర్మాణ రుణం మంజూరు చేసింది. నేషనల్ హౌసింగ్ బ్యాంక్/RBI యొక్క మార్గదర్శకాలు మరియు ఆదేశాలను అనుసరించి సదరు రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో వారి ఖాతాలను [illegible] అందువలన NHFPL సర్ఫాసి చట్టం 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద [illegible] డిమాండ్ నోటీస్ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా [illegible] 60 రోజులలోగా [illegible] NHFPL [illegible]

| క్ర. సం. | స్థానం/రుణ ఖాతా నంబర్ | రుణగ్రహీత పేరు/ సహ రుణగ్రహీతలు/ హామీదారు | డిమాండ్ నోటీస్ పంపిన తేది | డిమాండ్ నోటీస్ప్రకారం మొత్తం |
|---|---|---|---|---|
| 1. | ఏలూరు LNELRLAP-01240039587 | 1. వెంకటేష్ బోడుల (ఋణగ్రహీత) 2. బోడుల గౌతమి (సహ- ఋణగ్రహీత) | 14-అక్టోబర్-2025 | రూ.714967/- (రూపాయలు ఏడు లక్షల పధ్నాలుగు వేల తొమ్మిది వందల అరవై ఏడు మాత్రమే) |
| | ఆస్తి వివరణ : ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, దేవులపల్లి రెవిన్యూ గ్రామం, దేవులపల్లి గ్రామ పంచాయత్, ఆర్ఎస్. నం. 249, జంగారెడ్డిగూడెం సబ్రిజిస్ట్రీ ఏలూరు జిల్లా కలిగిన ఆస్తి యొక్క మొత్తం ఆదంతా. ఈజిమెంట్ హక్కులతో సహా 525 చ.గ. విస్తీర్ణంలోని ఇల్లు, స్థలం ఇల్లు వివరింపబడింది. సరిహద్దులచే : తూర్పు: సిసి రోడ్ 48అ. దక్షిణం : [illegible] చెందిన ఆస్తి 99అ. పడమర : కాలువగట్టు 47అ. ఉత్తరం : [illegible] చెందిన ఆస్తి. | | | |
| 2. | తాడేపల్లిగూడెం LNTPDLAP-02240040235 | 1. రవికుమార్ పెనుమాక (ఋణగ్రహీత) 2. జయ పెనుమాక (సహ- ఋణగ్రహీత) | 14-అక్టోబర్-2025 | రూ. 775924/- (రూపాయలు ఏడు లక్షల డెబ్బై ఐదు వేల తొమ్మిది వందల ఇరవై నాలుగు మాత్రమే) |
| | ఆస్తి వివరణ : ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, అనంతపల్లి రెవిన్యూ గ్రామం, కవులూరు గ్రామ పంచాయత్, అసెట్ నం. 427, ఇం.నం. 3-127, ఆర్ఎస్. నం. 116, అనంతపల్లి సబ్ రిజిస్ట్రీ, తూర్పు గోదావరి జిల్లా, కలిగివున్న ఆస్తి యొక్క మొత్తం ఆదంతా. వివరింపబడిన స్థలం మరియు ఇల్లు 143.0చ.గ విస్తీర్ణంలో ఈజిమెంట్ హక్కులతో సహా. సరిహద్దులచే: తూర్పు పెనుమాక [illegible] చెందిన ఇల్లు మరియు స్థలం. దక్షిణం: పెనుమాక [illegible] చెందిన ఇల్లు మరియు స్థలం. పడమర: పంచాయత్ రోడ్. ఉత్తరం: పంచాయత్ రోడ్. | | | |

ప్రదేశం : ఏలూరు, తాడేపల్లిగూడెం, ఆంధ్రప్రదేశ్
తేదీ : 29.10.2025

సం/- అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున

మంచి మాటయే గొప్ప అలంకారం. ఆభరణాలన్ని నశిస్తాయి కాని, వాక్కు అనే ఆభరణం ఎన్నటికీ నశించదు.

-భర్తృహరి

# రసకందాయంలో రాజకీయం!


దేశమంతటా బీహార్ శాసనసభ ఎన్నికల గురించే పెద్ద చర్చ జరుగుతోంది. రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయనే చెప్పాలి. విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రచారం వేడెక్కింది. ఈ మధ్యనే ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచార సభలో ఆర్‌జెడి పరిపాలన గురించి చెణుకులు విసరడంతో ప్రచారం వేడెక్కినట్లేవుంది. అలనాటి అవినీతి గురించి వందేళ్లయినా చర్చించుకుంటారని ప్రధాని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల బీహారుకు ఒరిగిందేమీ లేదని ఇండియా బ్లాక్ మహా ఘట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్ జెడి నేత తేజస్వీ యాదవ్ ఘాటుగా స్పందించారు. ఈ కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం మాత్రం కుదరకపోవడం చెప్పుకోదగిన అంశం. అయినా కూటమి భాగస్వాముల మధ్య ఏదో తెలియని శంక వెన్నాడుతూనేవుంది. అక్కడ పోటీ చేస్తున్న సీట్లను బట్టి ఎవరి పరువు వారు కాపాడుకొని ఎక్కువ స్థానాల్లో తమ అభ్యర్థుల్ని గెలిచి తీసుకురావడం తప్ప వేరే ప్రత్యామ్నయమూ కనపడదు కొన్ని చోట్ల పరస్పర పోటీలో ఉండడం వారికి వ్యతిరేకఅంశం. దీనికితోడు ప్రచార పోస్టర్లలో రాహుల్ బొమ్మ లేకుండా ఆర్జెడి ముందుకు వెళ్తుండడం కాంగ్రెస్ శ్రేణులకు రుచించడం లేదు. సహజంగానే ఇలాంటి అంశాలను ఎన్డీఎ కూటమి తమకు అనుకూల ప్రచార అస్త్రాలుగా చేసుకుంటోంది. ఎత్తిచూపుతోంది. ఆర్‌జెడి కాంగ్రెస్‌ల మధ్య పొత్తు లేదనేందుకు ఇదే ఉదాహరణంటూ ఓటర్ల ముందుకు ఎన్డీఏ తెస్తోంది. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ పాత్ర ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది ఎన్నికల ఫలితాల నాడు కానీ తెలియదు. బీహార్‌లో పాలనపై కన్నేసి నితీష్ కుమార్ చెంతన చేరడం విభేదించి బయటకువచ్చి జన సురాజ్‌పార్టీ పెట్టడం, ఆపై జనంలోకి బాగా చొచ్చుకెళ్లిన ప్రశాంత కిషోర్ ఎలాంటి వ్యూహాలు లేకుండా ఎన్నికల గోదాలోకి దిగి వుంటారని ఎవరూఅనుకోలేరు. ఎంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారెండు ప్రధాన కూటములను నిలవరించి ముందుకు రాగలరని ఎవరూ అనుకోవడం లేదు. రావడం కష్టమే. అలాగని హంగ్ ఏర్పడుతుందని ఎక్కడా చెప్పడం లేదు. ఏదో ఆశయం ఉండబట్టే దింపుడు కళ్లాల ఆశతో ప్రశాంతంగా తన పనేదో తాను చేసుకుపోతున్నారు. బీహార్లో ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ ఎత్తుగడ ద్వారా ఎన్నికల కమిషన్ ఏదో చేస్తోందనే అనుమానాలు రేకెత్తించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాన్ని ముందుగానే చేసుకోగలిగింది. బీహార్ ప్రజల నోళ్లల్లో ఆ అంశానికి సంబంధించిన విషయాలు బాగా నానాయి. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ పాలనతో జనం విసుగెత్తి ఉన్నారన్న ప్రకంపనలు కూడా ఉన్నాయి. పదవే లక్ష్యంగా కూట ములు ఫిరాయించారని ఆయనపై ఆరోపణలున్నాయి. స్వచ్ఛమైన నేతగా పేరుండి చివరకు పదవి కోసంఅవకాశ వాద రాజకీయాలకు పాల్పడినట్లు జనాభిప్రాయం. 2020అక్టోబరు నవంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బిజెపి పంచన చేరి నితీష్ సిఎం అయ్యారు. ఆ పార్టీ తనను ఇబ్బంది పెడుతోందని పదవికి రాజీనామా చేసి మహా ఘట్ బంధన్ వైపు వచ్చి తిరిగి సిఎం అయ్యారు. రెండేళ్లన్నా గడవక ముందే, సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముంగిట 2024 జనవరిలో ఎన్డీఎ తీర్థం పుచ్చుకొని మరోసారి తన పదవి కాపాడుకున్నారు. ఇలా ఆయన నిలకడలేని రాజకీయాలకు ఆరితేరారని ప్రత్యర్థి పార్టీలు భారీ ప్రచారం చేస్తున్నాయి. ఈ విషయంలో ప్రశాంత్ కిషోర్ తన ర్యాలీలో ఇదే ప్రచారంతో ప్రజల్లోకి వెళ్లి చేసినప్రచారం జనం స్మృతిపథంలో మెదులుతూనేఉంది. నితీష్‌తన సీట్లతో భుజం కాసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారని ప్రతీతి. అందుకే ఎన్డీయే తన తరపున సిఎం అభ్యర్థి ఎవరో చెప్పడానికి జంకుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ పార్టీకి బిజెపి కంటే తక్కువ సీట్లొచ్చినా ఆయన్నే సిఎం కుర్చీలో కూర్చోబెట్టామంటున్న బిజెపి ప్రస్తుత ఎన్నికల్లో తన గొంతును సవరిస్తోంది. మొత్తం 243 సీట్లలో బిజెపి, జెడియు చెరో 101 పోటీ చేసి, తతిమ్మా స్థానాలను తమ భాగస్వామ్య పార్టీలకు కేటాయించాయి. కూటమి విస్తృత ప్రయోజనాల కోసం తాము గతంలో పోటీ చేసిన సీట్ల కంటే ఇరువురం దిగొచ్చి తగ్గించుకున్నామని బిజెపి వాదనలో పసకనిపించదు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ జెడియును మింగేసి ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తోందని కొన్నేళ్ల బీహార్ రాజకీయ పరిణామాలను బట్టి తెలుస్తుంది. ఈ ఎన్నికల్లో ప్రత్యేకత ఏమిటంటే రెండు కూటముల్లోనూ మెజార్టీ సీట్లు సాధించిన ఏ పార్టీ అయినా తన వంతు రాజకీయం తాను చేస్తుం దని విశ్లేషకుల అభిప్రాయం. ఎవరు గెలుస్తారో ఎవరు ఎవరిని పక్కనపెడతారో వంటి అంశాల్లో ఈసారి బీహారు మార్క్ రాజకీయాలోనే తేలుతుంది. బీహార్‌లో దాదాపు 40 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు నిర్ణాయక శక్తిగా ఉండబట్టే వారినాకట్టుకొనే ప్రయత్నంలో భాగంగా ఆర్జేడి తాము అధికారంలోకి వస్తే 'వక్ఫ్' చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించింది. యాదవులు, ముస్లింలు, ఆర్థికం గా వెను కబడిన కులాలుండే బీహార్ రాజకీయ నేతలకు బిసిలు ఎటువైపో తెలియక గాభరా పడ్తున్నారు. ఎవరి ఎన్నికల మేనిఫెస్టోలు వారు రచించుకోలేక కులాల ఆకర్షణ కోసం ఏవేవో చెప్పడమే ఈ ఎన్నికల అవగాహన. నిర్దిష్టమైన పథకాలు కూడా ప్రచారం చేసుకోలేక పోవడం విశేషం. ముస్లింలంతా మూకుమ్మడిగా కాంగ్రెస్ కు ఓటు బ్యాంకుగా మారవచ్చునని మహాఘట్బంధన్ భావిస్తున్నారు. వచ్చే యేడాది అన్ని ఎన్నికలకు బీహార్ ఎన్నికలే దిక్సూచి.

వ్యర్థమైన మాటలు వేలాదిగా చెప్పడం కన్నా శాంతిని, కాంతిని ప్రసాదించే ప్రయోజనకరమైన మాట ఒక్కటి చాలు.



గౌతమ బుద్ధుడు

ప్రపంచాన్ని మార్చదలచినవాడు ముందుగా తనను తాను మార్చుకోవడం నేర్చుకోవాలి.



సోక్రటీస్

# ప్రజావాక్కు



## ప్రాణాలు గాలిలో దీపాలేనా..

అదుపులేని ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రయాణీకుల ప్రాణాల్ని గాలిలో దీపాలుగా చేస్తున్నాయి. కర్నూలు దగ్గరలో జరిగిన అగ్నిప్రమాదంలో బస్సులోనే ఆహుతి అయిన 19 మానవ ప్రాణాలు ఈ దుస్థితికి ఉదాహరణ. ఆ ప్రమాద కారణాలు ప్రత్యక్షంగా ఏవైనప్పటికీ, అలాంటి ప్రమాదం ఏర్పడడానికి పరోక్షంగా దోహదపడిన పరిస్థితుల్ని చక్కదిద్దడానికి పూనుకోకపోతే మళ్లీ మళ్లీ అలాంటి దురదృష్టకర సంఘటనలకు పెచ్చరిల్లుతాయి. ఈ దుర్ఘటన జరిగాక ఆంధ్రప్రదేశ్‌లో సంబంధిత అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. రెండు రోజుల్లో 360కి పైగా అతిక్రమణలు గుర్తించారు. నలభై బస్సుల్ని సీజ్ చేశారు. కళ్లెదుట ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణించే బస్సులు ఒక్క రోజు తనిఖీలోనే పదుల సంఖ్యలో ప్రయాణింప వీలుగాని కండిషన్‌లో ఉన్నాయంటే వ్యవస్థ ఏ స్థితిలో ఉందో అర్థమౌతుంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## ప్రజలకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్రము లోని 12.769 గ్రామ పంచాయతీలల్కోఎస్సి, ఎస్టీ. కాలనీలలో ఇంటి యజమానులు ప్రజలు నడిచే గ్రామ పంచాయతీ రోడ్డు పై నల్లా నీళ్ల ఓడల ట్యాంక్ ప్రభుత్వ స్థలం రోడ్డు పై నిర్మించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోని అట్టి వాటిని గుర్తించి తొలగించడం అవసరం. రోడ్లు అక్రమంగా వాడుకొంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి. నోటీసులు జారీ చేసి అట్టి వాటిని గ్రామ పంచాయతీ సిబ్బంది చేత తొలగించడం అవసరం. ప్రజలకు న్యాయం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

## రైతు సమస్యలను పట్టించుకోండి

వ్యవసాయరంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది. ప్రధానంగా, 2013భూసేకరణ చట్టంప్రకారం, భూమి ని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు. అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షి ంచి, రైతు ఉత్పత్తులకు అనుకూల మైనవిధంగా మార్చాలి. రైతుకు వాస్తవ లాభం చేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

## రోడ్లపైనే పశువుల మందలు

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలు మండలాలు నగరాలు పట్టణ కేంద్రాల్లో రోడ్లపై స్వేచ్ఛగా ఆవులు గేదెలు, సంచరించడంవల్ల నిత్యం రోడ్డు ప్రమాదములు జరుగుతున్నాయి ముఖ్యంగా హన్మకొండ వరంగల్ పరకాల పట్టణం లో ప్రధాన రహదారిలో గుంపులుగా పశువులు ఉండి ప్రమాదాలకు కారకాలుగా నిలుస్తున్నాయి భూపాలపల్లి జిల్లా కేంద్రం లో కాటారం డివిజన్‌లో వివిధ పట్టణాల్లో రోడ్డు మధ్యనే గుంపులు గుంపులుగా ఆవులు సేద తీరడంతో వాహనదారులు నానా యాతన పడుతున్నారు ప్రతిరోజు ఇవి రోడ్లమీద సంచరించడం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది ఇకనైనా అధికారులు స్పందించి ప్రధాన నగరాల్లో రోడ్ల వెంబడి తిరుగుతున్నటువంటి పశువులను పశు శాలకు పంపించి ఆ పశువుల యజమానుల మీద కేసులు పెట్టాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## దేశీయ ఉపాధి మీదే ఆధారపడదాం

భారత ఐటీ రంగంఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బివీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలను పెంచడం, రిమోట్‌డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సంస్థలు తమ స్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభనుపెంపొందించడం అత్యంతప్రాధాన్యం కలిగిన అంశం. భారతీయ యువత, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, తమ ప్రతిభను ప్రదర్శించి స్థానిక స్థాయిలో స్టార్టప్‌స్ ను స్థాపిస్తే, దేశీయఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు, గ్లోబల్ టెక్ రంగంలో మన స్థానం మరింత బలపడుతుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## వ్యవస్థలు బాగా పని చేయాలి

దేశంలోని ముఖ్యమైన వ్యవస్థలు సక్రమంగా పని చేయాలి. పోలీసు, చట్టాలు, చట్ట సభలు, ఇతర రంగాల ఉద్యోగులు, పౌరులు బాగా పని చేయాలి. వ్యవస్థలను నియంత్రించి అణచివేసేది రాజకీయ శక్తులు కాబట్టి వ్యవస్థలు అప్రమత్తంగా ఉంటే సరిపోతుంది. వ్యవస్థలు ఎవరి వత్తిళ్లకు లొంగకూడదు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్క పౌరులు నిజాయితీగా పనిచేయాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వాతావరణ సంక్షోభాన్ని అరికట్టలేమా?

**అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశానికి విద్యుత్, పరిశ్రమల కోసం శక్తిచాలా అవసరం. అందుకే మన మొత్తంకాలుష్యం పెరుగుతోంది. దీనిని తగ్గించడానికి మనం 2030 నాటికి 50 శాతం విద్యుత్తును సోలార్, పవన శక్తి వంటి కాలుష్యం లేని వనరుల నుండి పొందాలని అలాగే 2070 నాటికి పూర్తిగా కాలుష్యం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ ప్రయత్నాలు గొప్పవే. కానీ ప్రపంచ స్థాయిలో కాలుష్యం చాలా వేగంగా పెరుగుతోంది. కాబట్టి ధనిక దేశాలు తమ చారిత్రక తప్పులకు పరిహారంగా, మనకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి నిధులు, కొత్త టెక్నాలజీ వెంటనే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేయాల్సిన సమయం ఇది. ఇకపై భారతదేశం వీటిని ఎదుర్కోడానికి చాలా గట్టిగా చేయాలి. కాలుష్యం లేకుండా వేగంగా కొత్త ఇంధన వనరులకు మారాలి. ప్రజలను కాపాడడానికి కరవును తట్టుకునే విత్తనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు వంటివి నిర్మించాలి. వాతావరణ మార్పులకు ప్రపంచ వేదికపై పోరాడాలి.**

డి జయరాం

ప్రపంచ వాతావరణ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, గాలిలో ఉండే కార్బన్ డయాక్సైడ్ పరిమాణం రికార్డు స్థాయిలో పెరిగింది. ఈ పెరుగుదల భూతాపానికి ప్రధాన కారణాలలో ఒకటిగా మారింది. 2024 సంవత్సరానికి సంబంధించిన ఈ నివేదిక చాలా ఆందోళన కలిగించే విషయాలను వెల్లడించింది. 2023 నుండి 2024 మధ్య ప్రపంచ సగటు కార్బన్ డయాక్సైడ్ స్థాయి 3.5 పీపీఎం పెరిగింది. 1957లో కొలవడం మొదలు పెట్టినప్పటి నుంచి ఒకే ఏడాదిలో ఇంత ఎక్కువ పెరుగుదల నమోదు కావడం ఇదే తొలిసారి. ఈ కారణంగా, 2024లో గాలిలోని కార్బన్ డయాక్సైడ్ వాయువు స్థాయి 423.9 పీపీఎంకు చేరుకుంది. గత 8 లక్షల సంవత్సరాలలో మానవుడు ఇంత స్థాయిని ఎప్పుడూచూడలేదు. అంతేకాకుండా 1960ల నుంచి ఈ కాలుష్యం పెరిగే వేగం దాదాపు మూడు రెట్లు ఎక్కువైంది. గతంలో నెమ్మదిగా పెరిగేది కానీ ఇప్పుడు ఒక్కసారిగా 3.5 పీపీఎంకు పెరగడం మరింత భయాన్ని కలిగిస్తోంది. దీనికితోడు, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి ఇతర వేడిని పెంచే వాయువులు కూడా రికార్డు స్థాయికి చేరాయి. ఈ వాయువులన్నీ కలిసి 1990 నుంచి భూమిపై వేడిని నిల్వ చేసే శక్తిని 54 శాతం పెంచాయి. పెరుగుదలకు కారణాలు -మనిషి తప్పులు, ఈ అతిపెద్ద పెరుగుదలకు ముఖ్యంగా రెండు ప్రమాదకరమైన కారణాలు కలిశాయి. ఒకటి మనం చేసే పనుల వల్ల విడుదలయ్యే కాలుష్యం, రెండు ప్రకృతిలో కాలుష్యాన్ని పీల్చుకునే శక్తి తగ్గడం. ఇది భూమిపై ఉన్న కార్బన్ చక్రంలో ఒక పెద్ద సమస్య ఏర్పడిందని సూచిస్తుంది. మొదటిది బొగ్గు, పెట్రోల్, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను వాడడం తగ్గిస్తామని ప్రపంచ దేశాలు ప్రమాణాలు చేసినప్పటికీ, వాటిని మండించడం ఆగలేదు. కార్బన్ డయాక్సైడ్ వాయువు పెరుగుదలలో ఎక్కువ భాగం ఇంకా ఈ శిలాజ ఇంధనాల నుంచే వస్తుంది. రెండవది సాధారణంగా సముద్రాలు, అడవులు వంటి ప్రకృతి వ్యవస్థలు. వీటిని ఖికార్బన్ సింక్‌లుఖి అంటారు. ప్రతి సంవత్సరం మనం విడుదల చేసే కాలుష్యంలో దాదాపు 50 శాతం వరకు పీల్చుకుంటాయి. అయితే, 2024లో వీటి కాలుష్యాన్ని పీల్చుకునే సామర్థ్యం తగ్గిందని ప్రపంచ వాతావరణ సంస్థ చెబుతోంది. వీటికి తోడుగా తీవ్రమైన వాతావరణ మార్పులు ప్రకృతి వైపరీత్యాలు కూడా ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి. 2024రికార్డు స్థాయి వేడి, ఎల్ నినో ప్రభావం వల్ల అమెజాన్, ఆఫ్రికా వంటి ప్రాంతాల్లో భయంకరమైన కరువులు, పెద్ద అటవీ మంటలు వచ్చాయి. ఈ మంటల ద్వారా అడవుల్లో నిల్వఉన్న భారీ మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ వాయువు తిరిగి గాలిలోకి విడుదలవ్వడం ఈ పెరుగుదలను మరింత వేగవంతం చేసింది. ఈ రికార్డు పెరుగుదల చూస్తుంటే, వాతావరణ సంక్షోభం నెమ్మదిగా జరగడం లేదు, ఇది తనకు తానుగా వేగాన్ని పెంచే ప్రమాదకరమైన వలయం లోకి మారుతోందనే హెచ్చరిక ఇస్తుంది. ముఖ్యంగా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే కాలుష్యాన్ని పీల్చుకునే కార్బన్ సింక్‌లు బలహీనపడటం. ఉష్ణోగ్రత పెరిగిన సముద్రాలు తక్కువ కార్బన్ డయాక్సైడ్ వాయువును పీల్చుకుంటాయి. అదే సమయంలో అవి ఆమ్లంగా మారి సముద్రంలోని జీవులకు



ప్రమాదంగా మారుతాయి. భూమిపై కూడా, విపరీతమైన వేడి, కరువుల వల్ల మొక్కలు ఒత్తిడికి గురై కాలుష్యాన్ని తక్కువగా పీల్చుకుంటాయి. ఈ ఒత్తిడి తీవ్రమైతే భారీగా చెట్లు చనిపోతాయి. అరణ్యాలు కాలిపోతాయి. దీనివల్లనిల్వ ఉన్న కార్బన్ తిరిగి గాలిలో కలిసి, ఆ అటవీ ప్రాంతం కాలుష్యాన్ని పీల్చుకోవడం మానేసి, కాలుష్యాన్ని విడుదల చేసే ప్రాంతంగా మారుతుంది. ఈ వలయం మనకు ఏం చెబుతోందంటే, మనం కాలుష్యాన్ని తగ్గించినా లేదాఆపినా, ప్రకృతి కూడా తన శక్తిని కోల్పోయి నిల్వ ఉన్న కార్బన్‌ను విడుదల చేయడం మొదలుపెడితే మొత్తం వాతావరణ వ్యవస్థ మరింత వేగంగా వేడెక్కుతుంది. కార్బన్ డయాక్సైడ్ వాయువు చాలాకాలం వాతావరణంలో ఉండే కాలుష్య వాయువు. ఇది గాలిలో శతాబ్దాల పాటు ఉంటుంది. అందుకే 423.9 పీపీఎం స్థాయి అనేది తాత్కాలికం కాదు. ఇది రాబోయే తరాలకు కూడా అధిక ప్రపంచ ఉష్ణోగ్రతలకు దీర్ఘకాలిక కట్టుబాటును సూచిస్తుంది. ఈ వాయువులు పట్టి ఉంచే వేడి, మనం ఉద్గారాలను వెంటనే తగ్గించినా కూడా, భవిష్యత్తులో కరువులు, వరదలు లాంటి వాతావరణ మార్పులను, తీవ్రమైన విపత్తులను పెంచుతూనే ఉంటుంది. ఈ డేటా ప్రకారం పారిస్ ఒప్పందంలో నిర్ణయించిన 1.5డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పరిమితిని చేరుకోవడం మరింత కష్టమని తెలుస్తోంది. ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక అంతర్జాతీయ విధానాలకు 'రెడ్ అలర్ట్' గా పనిచేస్తుంది. కాలుష్యాన్ని కేవలం 'తగ్గిస్తాం' అనే మాటలు చాలవు. శిలాజ ఇంధనాలను తక్షణమే పూర్తిగా విడిచిపెట్టాల్సిన అవసరాన్ని ఈ నివేదిక స్పష్టం చేస్తుంది. ప్రపంచ లక్ష్యాలను పెంచడంతో పాటు, కాలుష్యాన్ని పీల్చుకునే అడవులు, సముద్రాలను కాపాడడానికి కూడా ప్రయత్నాలు చేయాలి. ఈ రికార్డు స్థాయి బొగ్గుపులుసు వాయువు పెరుగుదల మన భారతదేశానికి చాలా పెద్ద ప్రమాద ఘంటిక. ప్రపంచ దేశాలు కలిసి కాలుష్యాన్ని తగ్గించడంలో విఫలం కావడం వల్ల, వాతావరణం మరింత వేడెక్కి, తీవ్రమైన వాతావరణ మార్పులు మొదలయ్యాయి. ఈ మార్పుల వల్ల మన దేశంలోనే ఎక్కువ నష్టం జరుగుతుంది. ఊహించని వరదలు, భరించలేని ఎండలు, రుతుపవనాలలో మార్పులు వంటివి పెరిగి మన వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. ఇది పేద ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. వాతావరణ న్యాయం కోణంలో చూస్తే ఈ పెరుగుదల మనకు అన్యాయం. మన దేశంలో ఒక్కొక్క మనిషి చేసే కాలుష్యం అంటే తలసరి కాలుష్యం ధనిక దేశాల కంటే చాలా తక్కువ. కానీ పాత కాలం నుండి ఎక్కువ కాలుష్యం చేసిన ధనిక దేశాల తప్పుల వల్ల, ఇప్పుడు ఈ మార్పుల కష్టాన్ని మాత్రం మనమే ఎక్కువ భరించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మన ముందు ఒక పెద్ద సవాలును ఉంచుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశానికి విద్యుత్, పరిశ్రమల కోసం శక్తిచాలా అవసరం. అందుకే మన మొత్తంకాలుష్యం పెరుగుతోంది. దీనిని తగ్గించడానికి మనం 2030 నాటికి 50 శాతం విద్యుత్తును సోలార్, పవన శక్తి వంటి కాలుష్యం లేని వనరుల నుండి పొందాలని అలాగే 2070 నాటికి పూర్తిగా కాలుష్యం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ ప్రయత్నాలు గొప్పవే. కానీ ప్రపంచ స్థాయిలో కాలుష్యం చాలా వేగంగా పెరుగుతోంది. కాబట్టి ధనిక దేశాలు తమ చారిత్రక తప్పులకు పరిహారంగా, మనకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి నిధులు, కొత్త టెక్నాలజీ వెంటనే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేయాల్సిన సమయం ఇది. ఇకపై భారతదేశం వీటిని ఎదుర్కోడానికి చాలా గట్టిగా చేయాలి. కాలుష్యం లేకుండా వేగంగా కొత్త ఇంధన వనరులకు మారాలి. ప్రజలను కాపాడడానికి కరవును తట్టుకునే విత్తనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు వంటివి నిర్మించాలి. వాతావరణ మార్పులకు ప్రపంచ వేదికపై పోరాడాలి. ధనిక దేశాలను బాధ్యులను చేయాలి. 'కాలుష్యం ఎవరు ఎక్కువ చేశారో, వారే ఎక్కువ తగ్గించాలి' అనే సిద్ధాంతాన్ని గట్టిగా నిలబెట్టాలి. ఈ రికార్డు కాలుష్యం పెరుగుదల అనేది మనమందరం మారాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ●

# ప్రజా సౌకర్యాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

ఐ.పి.రావు

కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం. విమానాలు, స్కూల్ బస్సులు ప్రమాదానికి గురైనప్పుడు, ట్రావెల్స్ బస్సులు అగ్నికీలల్లో ఆహుతి అయినప్పుడు, ప్రమాదాల్లో పలువురి ప్రాణాలు కోల్పోయినప్పుడు మాత్రమే ప్రభుత్వాలు, సంబంధించిన శాఖలు ఆగమేఘాలపై విస్తృత తనిఖీలు నిర్వహించడం, పలు కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారిపోయింది. ఇది ఏమాత్రం శ్రేయోష్కరం కాదు అని గ్రహించాలి. ముఖ్యంగా ప్రైవేటు ట్రావెల్స్ పై నిఘా, తనిఖీలు నామమాత్రంగా జరగడం వల్లనే పలువురు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అసలు ట్రావెల్స్ బస్సులు అన్ని, సంబంధించిన శాఖ ఆడిటింగ్ చేస్తుందా!? ఎన్ని బస్సులు మంచి కండిషన్‌లో ఉన్నాయి. ఎన్ని బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్, కిట్, హేమర్, అగ్నిమాపక పరికరాలు, నిపుణులైన డ్రైవర్ తదితర రక్షణ పరికరాలు ఉన్నాయో తనిఖీ జరిగిందా? లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కేసులు నమోదు చేశారు. ఏమి చర్యలు తీసుకున్నారు? శ్వేత పత్రం విడుదల చేయాలి. నిబంధనలు పాటించని బస్సులు వివరాలు, ఏమి చర్యలు తీసుకున్నారు, ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు, స్టేటస్ వంటి అంశాలు ప్రతీ సంవత్సరం ప్రజలకు తెలిసేవిధంగా ప్రభుత్వం, సంబంధించిన శాఖలు 'డాక్యుమెంట్' రిలీజు చేయాలి. 'పబ్లిక్ డొమైన్'లో పెడితే, ప్రయాణికులు అవగాహన చేసుకొని, మంచి ప్రమాణాలు పాటిస్తున్న బస్సులు ఎక్కి తమ గమ్యాలను సురక్షితంగా చేరుకోవడానికి వీలు కలుగుతుంది. ముఖ్యంగా పండుగ సమయాల్లో, పండుగ రద్దీసమయాల్లో రకరకాల బస్సులు ఆ మాటకు వస్తే కండిషన్ లేని బస్సులను కూడా నామమాత్రంగా మరమ్మతులు చేసి రంగులు పూసి, స్లీపర్, సెమీస్లీపర్, లగ్జరీవంటి పేర్లతో నడుపుతూ, అధికారుల కళ్లు గప్పి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నడుపుతూ ప్రైవేటు యాజమాన్యాలు అధిక మొత్తంలో ఆదాయం సంపాదించడం జరుగుతుంది. దీనికి ప్రధాన కారణం ఎక్కువ శాతం ఈ ప్రైవేటు ట్రావెల్స్ రాజకీయ నాయకులకు, వారి



బంధువులకు, ధనికులు భూస్వాములు సంపన్నులు కార్పొరేట్ వర్గాలకు చెందినవారివే. దీంతో నిబంధనలు బేఖాతరు చేస్తూ సంవత్సరాలు తరబడి నడపడం జరుగుతుంది. అదే సమయంలో ప్రజలు, ప్రయాణికులు తమ తమ అవసరార్థం డబ్బులుచెల్లించి ప్రయాణాలు చేస్తున్న పరిస్థితి ప్రజల్లో కూడా అవగాహన పెరగాలి. సీజన్ బట్టి డబుల్ చార్జీలు వసూలు చేయడం జరుగుతుంది. ప్రభుత్వాలు కూడా ప్రజల అవసరతలు తీర్చాలి కదా? విద్యా, వైద్యం, రవాణా సౌకర్యాలు వంటివి ప్రజలకు నాణ్యమైన రీతిలోఅందించే ఏర్పాటు చేయాలి. దురదృష్టవశాత్తూ మన దేశంలో ఇటువంటి పబ్లిక్ ఫెసిలిటీస్ అన్నియు దాదాపు 70డెభై శాతం ప్రైవేటీకరణ జరిగింది. ఇక దీంతో ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు ట్రావెల్స్ పేద మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. దీనికి తోడు కనీసం నియంత్రించే వ్యవస్థ, తనిఖీ అధికారులు అవసరాలకు అనుగుణంగా లేకపోవడం జరుగుతుంది. ఏ శాఖలో చూసిన ఖాళీ పోస్టులే, సిబ్బంది కొరత, సౌకర్యాలు కొరత ఉన్న సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఇక ఏ రవాణా శాఖ కార్యాలయంలో చూసిన ప్రైవేటు సిబ్బందిదే హవా. ఆయా కార్యాలయాలకు వద్దకు వెళ్ళితే, ఆ చుట్టుపక్కల ఉండే ప్రైవేటు వ్యక్తులు, కార్యాలయాలు హడావుడి అంతా ఇంతా కాదు. దీనికి ప్రధాన కారణం, అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ సిబ్బంది, కార్యాలయాలు లేకపోవడమే. ఇకనైనా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. అవసరత మేరకు రవాణా కార్యాలయాలు, సిబ్బంది, తనిఖీ అధికారులు, ఫైర్ సేఫ్టీ అథారిటీ, నిఘా సంస్థలు, పోలీసు పెట్రోలింగ్ వాహనాలు సమకూర్చాలి. కనీసం ప్రజల కనీస సౌకర్యాలు అవసరతలు తీర్చే వ్యవస్థలపై దృష్టి సారించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.. ప్రభుత్వ నియమనిబంధనలు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. ప్రమాదాలు బారిన పడకుండా చూసుకోవాలి.. ముఖ్యంగా ప్రభుత్వాలు నియమనిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. మరణించిన సమయాల్లో క్షతగాత్రులకు నష్టపరిహారం చెల్లించడంతో చేతులు దులుపుకోరాదు. పోయిన ప్రాణాలను తిరిగి తేలేం. ప్రాణం విలువైనది అనే భావనతో అందరి శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వాలు, యంత్రాంగం పనిచేయాలని ఆశిద్దాం. ●

# ఆవిష్కరణ ఆధారిత పరిశోధనలకు గుర్తింపు

డాక్టర్ రామకృష్ణ బండారు

ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డులలో నోబెల్ బహుమతి మొదటిది. ఈ బహుమతిని స్వీడిష్ శాస్త్రవేత్త 'ఆల్ఫ్రెడ్ నోబెల్' జ్ఞాపకార్థం 1901 నుంచి ప్రతీ సంవత్సరం ఇస్తున్నారు. శాంతి, సాహిత్యం, వైద్యశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం వంటి ఆరు కేటగిరీల్లో ఈ బహుమతిని అందజేస్తారు. ఈ ఆరు రంగాలలో అత్యుత్తమ కృషి చేసిన వారికి నోబెల్ బహుమతిని అందచేస్తారు. నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న వ్యక్తికి బంగారు మెడల్, డిప్లొమాతో పాటు దాదాపు 11 మిలియన్ స్వీడిష్ క్రోనర్ అంటే భారత కరెన్సీలో సుమారురూ. 8.5 కోట్లు నగదును బహుమతిగా ఇస్తారు. ఈ బహుమతి ప్రదానం రెండు ప్రాంతాలలో జరుగుతుంది. నోబెల్ శాంతి బహుమతి నార్వే రాజధాని ఒస్లోలో ప్రదానం చేస్తారు. మిగిలిన నోబెల్ బహుమతులను స్వీడన్లోని స్టాక్‌మ్‌లో ప్రదానం చేస్తారు. నోబెల్ బహుమతి అవార్డులను ప్రకటించడం కోసం రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కమిటీ ఉంటుంది. వచ్చిన నామినేషన్లను పూర్తి స్థాయిలో పరిశీలించి విన్నర్స్‌ను ప్రకటిస్తారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సంవత్సరం జాన్‌క్లార్క్, మైఖేల్ డెవోరెట్, జాన్ ఎం.మార్టినిస్‌లకు భౌతికశాస్త్రంలో, సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్ ఒమర్ ఎం.యాఘీలజూ రసాయన శాస్త్రంలో, మేరీ ఇ.బ్రంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకాగుచిలకు వైద్య శాస్త్రంలో, సాహిత్యంలో విశేష కృషి చేసినందుకు హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నా హెర్కైకు, నోబెల్ శాంతి బహుమతికి మరియా కొరినా మచాదోకు, జోయెల్ మోకిర్, ఫిలిప్ అగియోన్, పీటర్ హొవిట్‌లకు ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతులు లభించాయి. ముఖ్యంగా, ఆర్థిక శాస్త్రంలో జోయెల్ మోకిర్, ఫిలిప్ అగియోన్, పీటర్ హొవిట్‌లకు నోబెల్ బహుమతి రావడం గర్వించదగ్గ విషయం. ఇన్నోవేషన్ ఆధారిత ఆర్థిక వృద్ధి సిద్ధాంతాలను వివరించినందుకు ఈ ముగ్గురు ఆర్థికవేత్తలకు 2025 సంవత్సరానికి గాను ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది. నూతన ఇన్నోవేషన్స్ 'ఆర్థిక వృద్ధి'నిఎలా ముందుకు తీసుకుపోతాయో అనే అంశం మీద వీరి పరిశోధనలు సాగాయి. జోయెల్ మోర్ అమెరికాఇజ్రాయెలీ ఆర్థికవేత్త. నార్వెస్టర్న్ యూనివర్సిటీలో డచ్‌ఇజ్రాయెలీఅమెరికన్ ఆర్థిక చరిత్రకారుడిగా పనిచేస్తున్నాడు. ప్రతిష్టంభన నుంచి స్వీయ సుస్థిర ఆర్థిక వృద్ధి వైపు సొసైటీ ఎలా పయనించిందో చారిత్రక ఆధారాలను తన పరిశోధనలో తెలియచేసాడు. సాంకేతిక ప్రగతి ద్వారా సుస్థిర అభివృద్ధికి కావాల్సిన అవసరాలను గుర్తించినందుకు మోకిర్‌ని ఈ బహుమతికి ఎంపికచేశారు. ఆయన పరిశోధన పారిశ్రామిక విప్లవం ఎలా ప్రారంభమైంది, అది ఎలా నిరంతర వృద్ధికి దారి తీసిందో వివరించింది. సాంకేతిక ఆవిష్కరణల వెనుక ఉన్న శాస్త్రీయ వివరణలే ఆర్థిక వృద్ధిని దీర్ఘకాలం కొనసాగించడానికి సహాయపడతాయి అని పేర్కొన్నాడు. అలాగే, సమాజం కొత్త ఆలోచనలను, మార్పులను స్వీకరించే సంస్కృతి అవసరమని తన పరిశోధనల ద్వారా తెలియ చేసాడు. ఇన్నోవేషన్ విజయానికి జ్ఞానం సామాజిక అంగీకారం రెండూ కీలకమని నిర్ధారించాడు. అదేవిధంగా, ఫిలిప్ అఘియాన్ ఫ్రాన్స్ దేశానికీ, పీటర్ హెవిట్ కెనడాకు చెందిన ఆర్థికవేత్తలు. ఫిలిప్ అగియోన్ పారిస్లోలోని ఇన్సెడ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్లో ప్రొఫెసర్గా పనిచేస్తున్నాడు. పీటర్ హెవిట్ యునైటెడ్ స్టేట్స్ లోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్గా ఉన్నారు. 'క్రియేటివ్ డిస్ట్రక్షన్' ద్వారా నిరంతర ప్రగతి పై వీరు చేసిన పరిశోధనలకుగాను నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. అఘియోన్, హెవిట్ ఇద్దరూ 1992లో ప్రచురించిన తమ ప్రసిద్ధ వ్యాసంలో 'సృజనాత్మక విధ్వంసం' అనే భావనను గణితపరంగా వివరించారు. ఈసిద్ధాంతం ప్రకారం, కొత్త ఆవిష్కరణల ద్వారా నూతన సాంకేతికత ఉద్భవిస్తుంది. ఫలితంగా కొత్త పరిశ్రమలు, కొత్త ఉత్పత్తులు పుట్టుకొస్తాయి. పాతపద్ధతులను కొత్త ఇన్నోవేషన్స్ భర్తీ చేసే ప్రక్రియద్వారా ఆర్థికవ్యవస్థ ఎప్పటికప్పుడు ముందుకు సాగుతుందని వీరి సిద్ధాంతం చెబుతుంది. ఈ ముగ్గురు ఆర్థికవేత్తలుతమ పరిశోధనలవలన నూతన ఆవిష్కరణలు ప్రపంచ పురోగతికి ఎలాదోహదం చేస్తాయో తెలియచేసారు. మానవచరిత్రలో ఎన్నడూలేనివిధంగా ప్రపంచం వృద్ధివైపు పయనిస్తుంది. తద్వారా కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటమే కాకుండా ప్రపంచ సంపద పెరుగుదలకు కారణమైనది. ఈప్రపంచ ప్రగతి కారణమైన ఇన్నోవేషన్స్‌ల పాత్ర ను అర్థమయ్యేలా చెప్పడమే వీరి పరిశోధనల సారాంశం. సాంకేతిక పురోగతి, ఇన్నోవేషన్స్ ద్వారా స్థిరమైన వృద్ధిఎలా ఏర్పడుతుందో శాస్త్రీయంగా వీరు నిరూపించారు. వాస్తవానికి, సాంకేతిక పోరోగతి పారిశ్రామికీకరణకే కాకుండా మానవాళి మనుగడకు కూడా దోహదం చేస్తుంది. అలాంటి సాం కేతిక అభివృద్ధితో కూడుకున్న సమాజాలను ఎలా నిర్మించాలో జోయెల్ మోకిర్ తన పరిశోధనతో తెలియ చేసాడు. అంతేకాదు చారిత్రక ఆధారాలతో సాంకేతిక పురోగతికి నిరంతర వృద్ధికి అవసరమైన పరిస్థితులను వివరించాడు. అంతేకాదు, పారిశ్రామిక విప్లవానికి ముందు తరు వాత పరిస్థితులను తన పరిశోధనలతో వివరించడం ద్వారా ప్రస్తుత తరానికి అలాంటి పరిస్థితులను ఎలా అనుకూలం గా మార్చుకోవాలో తెలిసివస్తుంది. మార్కెట్‌లో కొత్త టెక్నాలజీ వచ్చి నప్పుడు పాత టెక్నాలజీ ఉపయోగిస్తున్న కంపెనీలు ఎలా దెబ్బతింటాయో తెలియచేయడం ద్వారా పారిశ్రామిక వర్గా లకు ఎంతో మేలు చేకూరుతుంది. కొత్త ఇన్నోవేషన్స్‌ను సొసైటీ ముందుకు తీసుకెళితే, పాత పద్ధతులు కనుమరు గవడం వల్ల జరిగే నష్టాన్ని 'క్రియేటివ్ విధ్వంసం'గా తెలి యచేయడం ద్వారా పాత పద్ధతుల ప్రాముఖ్యతను తెలియచ్చేసారు. ఇన్నోవేషన్స్ వలన ఆర్థికవృద్ధి స్థిరత్వం ఎలా నియంత్రించవచ్చో ఈ ఆర్థికశాస్త్రవేత్తలు నిరూపించారు. ●

# మూడోసారి పోటీకి ఇష్టమే

## ట్రంప్ మన్‌కీ బాత్!



**వాషింగ్టన్, అక్టోబరు 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అంశంపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగపరంగా అవకాశం లేనప్పటికీ, 2028లో మళ్లీ పోటీ చేసే ఆలోచనను ఆయన తోసిపుచ్చలేదు. తన మాజీ వ్యూహకర్త స్టీవ్ బానన్ చేసిన సూచనపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తూ మీడియాతో మాట్లాడిన ట్రంప్, మూడోసారి పోటీ చేయడాన్ని నేను కచ్చితంగా ఇష్టపడతాను. నాకు మునుపెన్నడూ లేనంత మంచి ఆదరణ ఉందని అన్నారు. అయితే, వెంటనే మాట మార్చుతూ, దాని గురించి నేను నిజంగా ఇంకా ఆలోచించలేదని పేర్కొన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా పనిచేయడానికి వీల్లేదు. పొలిటికో కథనం ప్రకారం, ట్రంప్ సన్నిహితుడైన స్టీవ్ బానన్, ఆయన మూడోసారి పోటీ చేయాలని బలంగా వాదిస్తున్నారు. దీనికోసం ఒక ప్రణాళిక కూడా సిద్ధంగా ఉందని తన పాడ్‌కాస్ట్‌లో ఇటీవల బానన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో తన తర్వాత రిపబ్లికన్ పార్టీని నడిపించే నాయకులపై కూడా ట్రంప్ స్పష్టత ఇచ్చారు. 2028 అధ్యక్ష ఎన్నికల బరిలో విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధాన అభ్యర్థులుగా ఉంటారని సంకేతాలిచ్చారు. మన దగ్గర చాలా మంచి నాయకులు ఉన్నారు. వారిలో ఒకరు ఇక్కడే నిలబడి ఉన్నారంటూ రూబియోను ఉద్దేశించి అన్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా అద్భుతమైన వ్యక్తి. వీరిద్దరికీ వ్యతిరేకంగా ఎవరూ పోటీ చేయరని నేను భావిస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ట్రంప్ ఆసియా పర్యటనలో ఉన్నారు. మలేషియాలో ఆసియాన్ సదస్సులో పాల్గొన్న ఆయన, తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని జపాన్‌లోని టోక్యోకు చేరుకున్నారు. మలేషియా పర్యటన ముగింపు సందర్భంగా అక్కడి అధికారులు, ప్రజలకు ఆయన అభివాదం చేశారు. చాలా గొప్ప, శక్తివంతమైన దేశం మలేషియా నుంచి బయలుదేరుతున్నాను. కీలకమైన వాణిజ్య, రేర్ ఎర్త్ ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అంతకుమించి థాయ్‌లాండ్, కంబోడియా మధ్య శాంతి ఒప్పందం కుదిర్చాం. ఇక యుద్ధం లేదు లక్షలాది ప్రాణాలను కాపాడాం. ఇప్పుడు జపాన్‌కు బయలుదేరానని ఆయన ట్రూత్ సోషల్ వేదికగా పోస్ట్ చేశారు.

## రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు!



**చెన్నై, అక్టోబరు 28:** ప్రముఖ తమిళ నటుల ఇళ్లకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, వర్ధమాన నటుడు ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈమేరకు తైనాంపేట్ పోలీసులకు ఈమెయిళ్ల అందడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఏకంగా రాష్ట్ర డిజిపి కార్యాలయానికే ఈ మెయిళ్ల రావడం విశేషం. ఈ నటుల ఇద్దరి ఇళ్లు కూడా తైనాంపేట్‌పోలీసు పరిధిలో ఉండటంతో వెంటనే కేసులునమోదుచేసి గాలింపు ప్రారంభించారు. అయితే ఇళ్లకువెళ్లిన తర్వాత తమకు బాంబు స్క్వాడ్ అవసరం ఏమీ లేదని చెప్పారని తేలింది. రెండో హెచ్చరిక సాయంత్రం 6.30 గంటలకు వచ్చింది. రజనీకాంత్ టీమ్ మరోసారి సెక్యూరిటీ తనిఖీలను వ్యతిరేకించింది. అలాగే మరోనటుడు ధనుష్‌ఇంటిని పేల్చేస్తామని కూడా ఇదే తరహా మెయిల్ డిజిపికి వచ్చింది. ఆయన కూడా ఇలాంటి సెక్యూరిటీ తనిఖీలు వద్దని నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవలికాలంలోప్రముఖ వ్యక్తులు అనేకమందికి ఈ తరహా మెయిళ్ల వస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సైబర్‌క్రైమ్ పోలీసులు ఈ వచ్చిన ఈమెయిళ్లను పరిశీలిస్తున్నారు. ఎక్కడినుంచి వచ్చాయన్న వివరాలన ఐపి అడ్రసులను ట్రాకింగ్‌చేస్తున్నట్లు తెలిపారు.

## రాజస్థాన్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు దగ్ధం

### ఘటనలో ముగ్గురు మృతి, పలువురికి గాయాలు



**జైపూర్, అక్టోబర్ 28:** కర్నూలులో ఘోర బస్సు ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 19 మంది సజీవదహనమయ్యారు. ఈ ఘటన మరువకముందే దేశంలో మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. రాజస్థాన్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు దగ్ధమైంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. జైపూర్, ఢిల్లీ, జాతీయ రహదారిపై మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఉత్తరప్రదేశ్ నుంచి తోడిలోని ఇటుక బట్టీకి కార్మికులను తీసుకెళుతోంది. జైపూర్ గ్రామీణ జిల్లా షాపురా సబ్ డివిజన్‌లోని మనోహర్‌పూర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతం వద్దకు రాగానే ప్రమాదానికి గురైంది. బస్సు రన్నింగ్‌లో ఉండగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలాయి. వెంటనే భారీ శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందారు. సుమారు 12 మంది గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు మొత్తం దగ్ధమైంది. సమాచారం అందున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## ట్రంప్‌ను 'శాంతి'కి నామినేట్ చేస్తా

### - జపాన్ ప్రధాన మంత్రి సనాయి తకైచి - టోక్యోలో ట్రంప్‌తో చర్చలు



**టోక్యో, అక్టోబరు 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ చేస్తానని జపాన్ ప్రధానమంత్రి సనాయి తకైచి పేర్కొన్నారు. ఇదే విషయాన్ని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. మంగళవారం ఉదయం టోక్యోలోని అకసకా ప్యాలెస్‌లో ప్రధానమంత్రి తకైచితో ట్రంప్ భేటీ అయ్యారు. ఇరు దేశాల ఆర్థిక, భద్రతా, ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ఈ భేటీ సందర్భంగా, నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ నామినేషన్‌కు తాము మద్దతిస్తామని తకైచీ స్పష్టం చేసినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. అయితే, దీనిపై జపాన్ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ సమావేశంలో అంతర్జాతీయ శాంతి స్థాపన కోసం ట్రంప్ చేస్తున్న కృషిని తకైచీ కొనియాడారు. ముఖ్యంగా థాయ్‌లాండ్- కంబోడియా మధ్య శాంతి ఒప్పందం, గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించారని ఆమె ప్రశంసించారు. "అధ్యక్షా, మీరు థాయ్‌లాండ్, కంబోడియా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని సాధించడంలో విజయం సాధించారు.

అలాగే, మధ్యప్రాచ్యంలో మీరు ఇటీవల కుదిర్చిన ఒప్పందం అపూర్వమైనది, చారిత్రాత్మకమైనది" అని తకైచీ అన్నారు. ఆసియాలో అమెరికాకు జపాన్ అత్యంత విశ్వసనీయ మిత్రదేశంగా ఉంది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ మూలకాలపై ఒప్పందాలు జరిగాయి. ఆసియా పర్యటనలో భాగంగా ట్రంప్ తొలుత మలేషియాలో పర్యటించి ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు.

## అమెరికా, రష్యా మధ్య ఫ్లుటోనియం ఒప్పందం రద్దుచేసిన పుతిన్

**మాస్కో, అక్టోబర్ 28:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ గట్టి షాకిచ్చారు. ఉక్రెయిన్ తో యుద్ధాన్ని ఆపేయాలన్న తన సూచనను పెడచెవిన పెట్టాడని పుతిన్ పై ట్రంప్ ఇప్పటికే ఆగ్రహంగా ఉ న్నారు. ఈ క్రమంలోనే అమెరికాతో గతంలో రష్యా కుదుర్చుకున్న ఫ్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ రద్దు చేసుకున్నారు. దీనికి సంబంధించిన చట్టంపై తాజాగా పుతిన్ సంతకం చేశారు. ఈ పరిణామం మళ్లీ అణు ఉద్రిక్తతలకు దారి తీస్తుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒబామా హయాం లోనే2000 సంవత్సరంలో అమెరికా, రష్యాల మధ్య ఫ్లుటోనియం నిర్వహణపై ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2010లో ఈ ఒప్పందాన్ని సవరించారు. దీని ప్రకారం రష్యా తమ వద్ద నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ఫ్లుటోనియంను అణ్వాయుధాల తయా రీకి వాడ కూడదు. ఈ నిల్వలను పౌర అణు విద్యుత్ తయా రీ కోసం వినియోగించుకోవాలని ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. దీంతో దాదాపు 17 వేల అణ్వాయుధాల తయారీని అడ్డుకున్నట్లు అప్పట్లో అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే, ఒబామా హయాంలో 2016 సంవత్సరం అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. దీంతో ఫ్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ నిలిపివేశారు. తాజాగా ఈ అగ్రిమెంట్‌ను పూర్తిగా రద్దు చేసుకుంటూ చట్టంపై సంతకం చేశారు.

# సరిహద్దులు మళ్లీ ఉద్రిక్తం



### లీపా లోయలో కాల్పుల విరమణ ఉల్లంఘన మోర్టార్ షెల్లింగ్‌కు తెగబడిన పాక్ రేంజర్లు

**శ్రీనగర్,అ క్టోబరు 28:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య నియంత్రణ రేఖ వెంబడి దాదాపు 5 నెలలుగా నెలకొన్న ప్రశాంతతకు మరోసారి భంగం కలిగింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ ఏడాది మే 10వ తేదీ నుంచి నిశ్శబ్దంగా ఉన్న సరిహద్దు ప్రాంతం తాజాగా అక్టోబర్ 26,27 మధ్య అర్ధరాత్రి కాల్పుల మోతతో దద్దరిల్లింది. నియంత్రణ రేఖ వెంబడి జమ్మూ కాశ్మీర్‌లోని వ్యూహాత్మక ప్రాంతమైన లీపా లోయలో పాకిస్తాన్ సైన్యం ఈ కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడింది. సరిహద్దుల్లోని భారత స్థావరాలను లక్ష్యంగా చేసుకొని పాక్ సైనికులు చిన్న ఆయుధాలతో కాల్పులు జరపడంతో పాటు మోర్టార్ షెల్లింగ్‌కు కూడా తెగబడినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చాలా కాలంగా లీపా లోయ వద్ద పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి అక్రమంగా చొరబాట్లకు కీలకమైన స్థావరంగా ఉంది. పాకిస్తాన్ సైన్యం ప్రారంభించిన దుశ్చర్యకు భారత సైనికులు గట్టిగా బదులిచ్చారు. పాక్ రేంజర్ల రెచ్చగొట్టే కాల్పులను భారత సైనికులు బలంగా తిప్పికొట్టారు. భారత జవాన్ల దీటైన ప్రతిఘటనతో పాకిస్తాన్ సైనికులు తోక ముడిచి వెనక్కి తగ్గక తప్పలేదని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. భారత్ బ్రహ్మోస్ మిసైల్స్‌కు పాక్ సైన్యం అవాక్కైంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి నియంత్రణ రేఖ వెంట మే 10వ తేదీ నుంచి శాంతి యుత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు మరణించిన తర్వాత ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ మే 7వ తేదీన చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో పాకిస్తాన్ భూభాగంలో లోపల ఉన్న 9 ఉగ్రవాద శిబిరాలను భారత వైమానిక దళం ధ్వంసం చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఆపరేషన్ సిందూర్‌లో వందకు పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్ర సంస్థల స్థావరాలు పూర్తిగా నాశనం అయ్యాయి. కూలిన పాక్ ఫైటర్ జెట్లు ఆపరేషన్ సిందూర్ దెబ్బకు తట్టుకోలేకపోయిన పాకిస్తాన్ భారత్‌పై డ్రోన్, క్షిపణి దాడులకు దిగింది. అయినప్పటికీ భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లు ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఫలితంగా.. మే 8వ తేదీ నుంచి 10వ తేదీ మధ్య ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పాకిస్తాన్‌లోని 11 సైనిక విమాన స్థావరాలపై దాడులు చేయడంతో.. తీవ్రంగా వణికిపోయిన ఇస్లామాబాద్ చివరకు కాల్పుల విరమణ కోసం భారత్‌కు విజ్ఞప్తి చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ స్వయంగా శాంతి కోసం భారత్‌ను అభ్యర్థించిన తర్వాత కూడా తాజాగా లీపా వ్యాలీలో కాల్పుల విరమణను ఉల్లంఘించడం ఆ దేశం వక్రబుద్ధికి, సరిహద్దుల్లో శాంతిని చెదరగొట్టాలనే కుట్రకు నిదర్శనంగా నిలుస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఆగస్టులో పూంఛ్ ప్రాంతంలో కూడా ఇలాంటి ఉల్లంఘనలు జరిగాయని వార్తలు వచ్చినా అప్పట్లో భారత సైన్యం వాటిని ఖండించింది. అయితే తాజా లీపా వ్యాలీ ఘటనతో సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తత పెరిగింది.

# ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

### • 200 యూనిట్ల ఉచిత విద్యుత్ • మహిళలకు ప్రతినెలా రూ.2,500 • ప్రభుత్వం వచ్చిన 20రోజుల్లోనే అమలు • 25 హామీలతో మహాకూటమి మేనిఫెస్టో విడుదల



**పాట్నా, అక్టోబరు 28:** బీహార్‌లోని ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమి రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం మంగళవారం తన ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక సహాయం హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు నెలనెలా రూ.2,500 ఆర్థిక సహాయం ఇస్తామని పేర్కొంది. అలాగే పాత పెన్షన్ పథకాన్ని అమలు చేస్తామని కూడా మేనిఫెస్టోలో మహా కూటమి హామీ ఇచ్చింది. జీవికా దీదీస్‌కు ప్రభుత్వ ఉద్యోగులుగా శాశ్వత హోదా కల్పిస్తామని కూడా మేనిఫెస్టోలో పేర్కొంది. కాంట్రాక్టు, ఔట్ సోర్స్ కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులు మారుస్తామని హామీనిచ్చింది. దాదాపు 25 హామీలతో "బీహార్ కా తేజస్వి ప్రాణ్ పత్ర" పేరిట మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహాఘట్ బంధన్ సిఎం అభ్యర్థి, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్, డిప్యూటీ సిఎం అభ్యర్థి, వికాశీల్ ఇసాన్ పార్టీ (విఐపి) చీఫ్ ముకేష్ సాహని, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా, సిపిఐ(ఎంఎల్) అగ్రనేత దీపాంకర్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, తమ మేనిఫెస్టోలో ఆచరణాత్మక హామీలనే తాము పెట్టామని, ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి భారం కాదని పేర్కొన్నారు. అధికార ఎన్‌డిఏ కూటమిపై తేజస్వి విమర్శలు గుప్పించారు. సిఎం నితీశ్‌కుమార్ ఎన్‌డిఏ కూటమిలో బందీ అయిపోయారని, అందుకే సిఎం అభ్యర్థి ఎవరనేది ఇంకా తేల్చడం లేదని ఆర్‌జెడి నేత దుయ్యబట్టారు.

**చిక్కుల్లో ప్రశాంత్ కిశోర్ - బీహార్, బెంగాల్‌లో ఓటరుగా నమోదు - ఇసి నోటీసులు**

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ చిక్కుల్లో పడ్డారు. బీహార్‌తోపాటు పశ్చిమబెంగాల్ రెండు రాష్ట్రాల ఓటర్ల జాబితాలో ప్రశాంత్ కిశోర్ పేరు నమోదైంది. బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భభానీపూర్‌లో 121, కాళీఘాట్ రోడ్ చిరునామాతో ఓటరు జాబితాలో ప్రశాంత్ కుమార్ పేరుంది. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కిశోర్ టిఎంసికి రాజకీయ సలహాదారుగా పనిచేసిన విషయం తెలిసింది. బీహార్‌లో కర్గాహార్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ప్రశాంత్ కిశోర్‌కు ఓటుంది. పికెకు ఇసి నోటీసులు బీహార్‌తో పాటు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలోనూ ఆయన పేరు కనిపించడంతో ఎన్నికల కమిషన్ ఈ చర్యలకు దిగింది. బీహార్‌లో రోహటాస్ జిల్లా ససరాంలోని కర్గాహార్ అసెంబ్లీ నియోజవవర్గం రిటర్నింగ్ అధికారి ఈ నోటీసులు పంపారు. కర్గాహార్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 621లో ఎపిక్ (ఓటర్ ఐడి) నంబర్ 1013123718 కింద ఓటరుగా ఆయన పేరు నమోదైందని, ఇదే సమయంలో పశ్చిమబెంగాల్‌లోని భాబనిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సెయింట్ హెలెన్ స్కూలు పోలింగ్ బూత్‌లో కూడా ఆయన పేరు నమోదై ఉందని ఆ నోటీసులో రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.



## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బస్సుదగ్ధం!

**న్యూఢిల్లీ,అక్టోబరు 28:** ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ మధ్యాహ్నం పెను ప్రమాదం తప్పింది. టెర్మినల్ 3 వద్ద ఎయిరిండియా విమానానికి కొన్ని మీటర్ల దూరంలో ఆగి ఉన్న ఓ బస్సులో అగ్నిప్రమాదం సంభవించింది. బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. టెర్మినల్ 3 వద్ద బే 32 సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సు పలు విమానయాన సంస్థలకు గ్రౌండ్ సర్వీసులు అందించే సాట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే థర్డ్‌పార్టీ సంస్థకు చెందినది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరు. సమాచారం అందుకున్న వెంటనే విమానాశ్రయ అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి, నిమిషాల వ్యవధిలోనే మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ యాజమాన్యం స్పందించింది. ఇదొక సాధారణ ఘటనేనని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎక్స్ వేదికగా తెలిపింది. "ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే మా ప్రథమ ప్రాధాన్యత. విమాన సర్వీసులన్నీ యథాతథంగా కొనసాగుతున్నాయి" అని స్పష్టం చేసింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు గానీ, లగేజీ గానీ లేదని పోలీసులు తెలిపారు. అయితే, బస్సులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడని, అతనికి ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సాట్స్ సంస్థ దర్యాప్తు ప్రారంభించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రమాద కారణాలను తెలుసుకునేందుకు బస్సును క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.


## రీల్స్ చేయబోయి నదిలోపడిన బిజెపి ఎమ్మెల్యే



**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** దేశరాజధాని ఢిల్లీలో అధికార బీజేపీకి చెందిన ఓ ఎమ్మెల్యేకి ప్రమాదకర అనుభవం ఎదురైంది. యమునా నది శుభ్రతపై రీల్స్ చేస్తూ కాలుజారి నదిలో పడిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఛట్ పూజ వేడుకల నేపథ్యంలో యమునా నది శుభ్రతపై అధికార బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. తాము అధికారం చేపట్టిన తర్వాత యమునా శుభ్రమైందంటూ బీజేపీ ప్రచారం చేస్తోంది. అయితే, బీజేపీ ప్రచారాన్ని ఆప్ తిప్పికొడుతోంది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో యమునా నది శుభ్రతపై అవగాహన కల్పించేందుకు పత్పర్‌గంజ్ బీజేపీ ఎమ్మెల్యే రవీందర్ సింగ్ నేగి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగానే నది ఒడ్డున రీల్ చిత్రీకరిస్తుండగా.. అదుపుతప్పి నదిలోకి పడిపోయారు. 19 సెకన్ల నిడివి ఉన్న ఆ వీడియోలో, ఎమ్మెల్యే నేగి రెండు బాటిళ్లను చేతిలో పట్టుకుని యమునా నది ఒడ్డున మోకాళ్లపై కూర్చుని ఉంటారు. అక్కడి నుంచి లేవడానికి ప్రయత్నించగా అదుపుతప్పి ఒక్కసారిగా నీటిలో పడిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై ఆప్ నేత సంజీవ్ ఝా తీవ్రంగా స్పందిస్తూవ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీజేపీ నాయకులకు తప్పుడు వాగ్దానాలు చేయడం ఓ వృత్తిగా మారిందంటూ వ్యాఖ్యానించారు. బహుశా అబద్ధాలు, ప్రచార రాజకీయాలతో విసిగిపోయిన యమునా స్వయంగా వారిని పిలిపించుకున్నట్టుంది అన్నారు.

## సంక్షిప్తంగా..

### తుర్కియేలో తీవ్రస్థాయి భూకంపం



**అంకారా, అక్టోబరు 28:** తుర్కియేలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. నేటి వేకువజామున దేశంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గాఢ నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా భూమి కంపించడంతో ఉలిక్కిపడి లేచారు. ఏం జరుగుతోందో తెలియని ఆందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప కేంద్రం, ప్రభావితమైన ప్రాంతాల పూర్తి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం అందనప్పటికీ, కొన్ని భవనాలకు స్వల్ప నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. భూకంపం సంభవించిన వెంటనే అప్రమత్తమైన అధికార యంత్రాంగం సహాయక చర్యలను ప్రారంభించింది.

### ఆర్‌ఎస్‌ఎస్‌పై కర్ణాటక సర్కార్‌కు హైకోర్టు షాక్

**బెంగళూరు, అక్టోబరు 28:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాల వ్యవహారంలో కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆరెస్సెస్ తదితర సంస్థల కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ఆరెస్సెస్ ఏర్పడి వందేళ్లయిన నేపథ్యంలో భారీస్థాయిలో కవాతులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాల కోసం ప్రభుత్వ మైదానాలు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల ఆవరణలను వినియోగించుకోవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి చేసింది.

### దుబాయ్‌లో ఎన్‌ఆర్‌ఐల కోసం పాస్‌పోర్టు సేవా ప్రోగ్రామ్

**దుబాయ్, అక్టోబరు 28:** ఎన్‌ఆర్‌ఐల కోసం దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్.. పాస్‌పోర్టు సేవా ప్రోగ్రామ్ 2.0ను ఆవిష్కరించింది. ఆధునికీకరించిన ఈ ప్రోగ్రామ్ మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. పాస్‌పోర్టు సేవలను రిజిస్టర్ చేసుకోవడానికి, దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తుదారులు కొత్తగా లాంచ్ అయిన్ ఆన్‌లైన్ పోర్టల్‌ను వినియోగించాల్సి ఉంటుంది. అప్లికేషన్ ప్రాసెస్, సర్వీస్ సెంటర్లలో ఎదురుచూపులు తగ్గించేందుకు ఈ సేవను అందుబాటులోకి తీసుకువచ్చారు. పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ 2.0 కింద ఇ-పాస్‌పోర్టులను తీసుకువచ్చారు. ఈ సాంకేతికతతో ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌లు వేగవంతం కానున్నాయి. భారత్ అందించే సేవలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మారనున్నాయి. వీసా అవసరాలకు తగ్గట్టుగా ఫొటో, సంతకం, ఇతర పత్రాలను నేరుగా ఆ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేసుకోవచ్చు. దాంతో బిఎల్‌ఎస్ ఇంటర్నేషనల్ సెంటర్లలో ప్రాసెసింగ్ టైమ్ తగ్గే అవకాశం ఉంటుంది.

### కెనడాలో సిక్కునేత దారుణ హత్య

**టొరంటో, అక్టోబరు 28:** కెనడాలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కానమ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు దర్శన్ సింగ్ సాహ్సి (68) కాల్పుల్లో మరణించారు. బ్రిటిష్ కొలంబియాలోని అబాట్స్‌ఫోర్డ్‌లో ఆయన నివాసం వెలుపల ఈ ఘటన జరిగింది. కారులో కూర్చుంటున్న సమయంలో ఓ దుండగుడు ఆయనపై కాల్పులు జరిపి పారిపోయినట్లు తెలుస్తోంది. అబాట్స్‌ఫోర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 9:22 గంటలకు రిడ్జ్‌వ్యూ డ్రైవ్‌లో కాల్పులు జరిగినట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి, కారులో ఉన్న సాహ్సి తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ప్రథమ చికిత్స సిబ్బంది వెంటనే వైద్య సహాయం అందించినప్పటికీ ఫలితం లేకపోయింది.

### ఢిల్లీ బయట రిజిస్ట్రేషన్ వాహనాలకు ఇకపై నో ఎంట్రీ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** దేశ రాజధాని ఢిల్లీ లోకి నగరం బయట రిజిస్టర్ అయిన కమర్షియల్ వాహనాల ప్రవేశంపై నిషేధం విధించారు. నవంబర్ 1 నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుందని అధికారులు తెలిపారు. 'ది కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే బీఎస్6 నార్మ్స్ కు లోబడి ఉన్న వాహనాలను మాత్రం ఈ నిషేధం నుంచి మినహాయించారు. బీఎస్6 నార్మ్స్‌కు లోబడి వాహనాలు కాలుష్య కారకాలను తక్కువగా విడుదల చేస్తాయని, కాలుష్య నియంత్రణలో ఇవి తోడ్పడుతాయని అధికారులు చెప్పారు. ప్రమాణాలకు లోబడి బీఎస్6 వాహనాలకు 2026 అక్టోబర్ 31 వరకు మాత్రమే ఢిల్లీలోకి అనుమతి ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్6 కమర్షియల్ వాహనాలతోపాటు సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా తాజా నిషేధం నుంచి మినహాయింపు ఇచ్చారు.


పశ్చిమగోదావరి,ఏలూరు వార్త




- అర్ధరాత్రి వరకు ఆగని గాలులు వర్షం
- తీరం జిల్లాలను గజ గజలాడించిన తుఫాను
- తీరం గ్రామాల సముద్రపు కోతను పరిశీలించిన మంత్రులు అధికారులు
- హెూరుగాలిలో భారీ వర్షం లో ప్రాణాలను తెగించి తిరిగిన
- నాయకులు కలెక్టర్లు ఎస్పీలు


కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తుఫాను పరిస్థితి సమీక్ష

ప్రభాతవార్త నరసాపురం :నరసాపురం మండలం తీర ప్రాంతంలో, మంగళవారం : నరసాపురం నియోజకవర్గంలో మోంథా తుఫాను కారణంగా తీవ్రంగా ప్రభావితమైన నరసాపురం నియోజకవర్గంలోని బియ్యపుతిప్ప, వేములదివి ఈస్ట్, వేములదివి వెస్ట్, పి.ఎం.లంక, చినలంక, పేరుపాలెం మరియు పరిసర గ్రామాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మరియు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, టిడిపి ఇన్‌ఛార్జ్ పోత్తూరి రామరాజు లతో కలిసి సందర్శించారు.తుఫాను వల్ల ఏర్పడిన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఈ సందర్భంగా నాయకులు పునరావాస కేంద్రాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. వారికి ధైర్యం చెబుతూ ప్రభుత్వం ప్రజల పక్షాన


మొందా ప్రభంజనం


వశిష్ఠ ఉగ్రరూపం

పూర్తిగా ఉందని, ఎవరూ భయపడవలసిన అవసరం లేదని బొమ్మిడి నాయకర్ పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తుఫాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించడం, అవసరమైన సదుపాయాలు కల్పించడం వంటి చర్యలను అధికారులు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో వేగంగా చేపడుతున్నారని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్యసేవలు మరియు ఇతర అవసరమైన సౌకర్యాలను దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణ చర్యలకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, రాష్ట్ర మత్స్యశాఖ సహకార సంఘాల చైర్మన్ కొల్లు పెద్దిరాజు, జిల్లా మత్స్యశాఖ సహకార సంఘాల చైర్మన్ మైల వసంతరావు,


పరిస్థితిని మంత్రి వర్మకు వివరిస్తున్న ఆర్డీవో దాసిరాజు


సముద్రపు ప్రాంతంలో మాధవ నాయుడు


నరసాపురంలో కూలిన చెట్లు

జిల్లా టిడిపి ఇన్‌ఛార్జ్ కలిదిండి రామరాజు, పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, జక్కం శ్రీమన్నారాయణ, నిప్పులేటి తారక రామారావు, బందెల రవీంద్ర, వట్టిప్రోలు సతీష్ మరియు జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

**విద్యుత్కు అంతరాయం**

తీవ్రమైన గాలులు వర్షంతో విద్యుత్ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం మధ్యాహ్నం నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాగునీరు సరఫరా కాలేదు. తుఫాను కారణంగా వశిష్ఠ నది కూడా ఉగ్రరూపం దాల్చింది. రేవులో పంట రాకపోక లు రవాణా పడవలు నిలిపవేశారు. మార్కెట్లో 50% దుకాణాలను తెలవలేదు. ఆర్టీసీ బస్సులు ఆటోలు పాక్షికంగా నడిచాయి. నర్సాపూర్ ఎక్స్ప్రెస్ తో పాటు పలు రైళ్ల ను రద్దు పరిచారు. తుఫాను కారణంగా జనజీవనం చిన్నాభిన్నమయింది.


అయ్యో కొబ్బరి


పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యే నాయకర్




ఏర్పాటుపై మంత్రి చర్చ


సముద్రపు కోత పరిశీలన

## తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం, అధికారులు అప్రమత్తం

- ఉప్పుటేరు వద్ద ప్రమాదకరంగా లేదు.
- పునరావాస కేంద్రాల వద్ద ఆహారం, వైద్య సౌకర్యాలు.
-జోరువానలో తుఫాన్ ప్రాంతాల్లో ఎంపీ పర్యటన.

**ఏలూరు, అక్టోబర్ 28: ప్రభాతవార్త :** ఏలూరు జిల్లాలోన తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పర్యటించారు. ఉదయం జోరువానలోనే కొల్లేరు బయలుదేరిన ఎంపీ, కైకలూరు సమీపంలో మాదేపల్లి గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడారు. కొల్లేరు సమీపంలో చెరువుల వద్ద ఆక్వా రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కైకలూరు నుంచి ఉప్పుటేరు బ్రిడ్జి వద్దకు చేరుకున్న ఎంపీ ఉప్పుటేరు నీటి ఉధృతిని పరిశీలించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఉండి ఎమ్మెల్యే, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తో కలిసి ఉప్పుటేరు ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఎంపీ పుట్టా మహేష్ మీడియాతో మాట్లాడారు. తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం, అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, ఎటువంటి ప్రాణ నష్టం జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుగారు, నారా లోకేష్ గారు నిరంతరం పరిస్థితులను సమీక్షిస్తున్నారని, ప్రజా ప్రతినిధులంతా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఆహారం, అత్యవసర వైద్యం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతరం అక్కడినుంచి కైకలూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.హెూ పునరావాసం పొందుతున్న వ్యక్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సాయంత్రం ముదినేపల్లి మండలం




పెనుమల్లి గ్రామంలో కూటమి పార్టీల కార్యకర్తలతో భేటీలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తుఫాను సహాయ చర్యల్లో పాల్గొనాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు... అత్యవసరం అయితే ఏలూరు కలెక్టరేట్ వద్ద కంట్రోల్ రూమ్ నెంబర్ 1800-233-1077, 94910 41419 ఫోన్ నెంబర్ల లేదా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయ నంబర్స్ 091 96181 94377, 091 98855 19299 కు ఎవరైనా కాల్ చేయవచ్చని ఎంపీహెూ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు..

## గ్రామాల్లో భారీ వర్షం

### - బలమైన గాలులతో ప్రజలకు ఇబ్బందులు:

పెనుగొండ, అక్టోబర్ 28 (ప్రభాతవార్త): తుఫాను ప్రభావం పెనుగొండ మండలాన్ని పూర్తిగా చుట్టుముట్టింది. ఉదయం నుంచి విరామం లేకుండా కురుస్తున్న వర్షంతో మండల వ్యాప్తంగా ప్రజల జీవన విధానం స్తంభించిపోయింది. వడలి, సిద్ధాంతం, చిన్నమల్లం, ముళ్లపర్రు, ఇలపర్రు, దొంగరావిపాలెం, దేవా, మండలంలో పలు గ్రామాల్లో ఎడతెరిపిలేని వర్షపాతం కొనసాగుతోంది. బలమైన ఈదురుగాలులు వీచడంతో చెట్లు, కూలిపోయి అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది.మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులు నీటమునిగిపోయి వాహనాల రాకపోకలు దాదాపు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షనీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, వ్యవసాయ క్షేత్రాలు కూడా తడిసి ముద్దయ్యాయి. తుఫాను తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులకే ఇళ్ల బయటకు రావాలని అధికారులు హెచ్చరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే సమాచారమందించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ, గ్రామ పంచాయతీ



సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు మైదానంలోనే ఉన్నారు.ప్రస్తుత పరిస్థితిని జిల్లా అధికారులు సమీక్షిస్తూ, ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా సకాలంలో స్పందించాలని మంటూ తహశీల్దార్, ఎంఇఓ, విద్యుత్ విభాగ అధికారులకు సూచనలు ఇచ్చారు. వర్షం కొనసాగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేనప్పుడు బయటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.

## తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగించినపోలీసులు.

ఆగిరిపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త. మంగళవారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో, ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రాల గ్రామానికి చెందిన, రాయల నవదీప్ వయసు 12 సంవత్సరాలు, అను అతను తప్పిపోయి మండలంలోనిశోభనాపురం గ్రామం రావటం జరిగింది.ఆగిరిపల్లి పోలీసు వారు, సదరు బాలుడిని గమనించి పిఎస్ కు తీసుకువచ్చి భోజనం పెట్టి, సదరు బాలుడు ఫోటోను చుట్టుపక్క పోలీస్ స్టేషన్ లకు పంపించారు.బాలుడు తండ్రి తెలుసుకొని ఆగిరిపల్లి పిఎస్ కు రాగ బాలుడిని తుఫాను సమయంలో సురక్షితముగా తండ్రి కి అప్పగించటం జరిగింది. సకాలంలో స్పందించిన ఎస్సై శుభ శేఖరు సిబ్బందికి బాలుడు తండ్రి కృతజ్ఞతలు తెలుపగా పలువురు అభినందించారు.



## తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పార్థసారథి విస్తృత పర్యటన.

ఆగిరపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త :మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార మరియు పౌరసంబంధాలశాఖ మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్థసారథి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఆగిరిపల్లి మండలం,%శ్రీ%నెక్కలం గొల్లగూడెం, ఆగిరిపల్లి గ్రామాల్లో మంత్రి పార్థసారథి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆగిరపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంలో గండిపడి తెగిపోయిన చెరువును మంత్రి పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై మంత్రి అధికారులను అడిగి ఆరా తీశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు నష్టనివారణ చర్యలపై అధికారులు, స్థానిక ప్రజలతో చర్చించి.నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలన్నారు. ఆగిరపల్లి గ్రామంలో కల్వర్టు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిన ప్రాంతాన్ని నీటి వసతులను పరిశీలించి రూ. 1లక్ష మంజూరు చేసిన మంత్రి వర్యులు.మొంథా తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కట్ట తెగిపోయిన చెరువుల వద్ద తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజలకు తుఫాను ప్రభావం ఏ విధంగా ఉండబోతుంది ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించాలని అధికారులకు



ఆదేశించారు.ప్రజలంతా సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, అధికారులు చెప్పే సూచనలు తూచ తప్పకుండా పాటించాలని కోరారు. తుఫాను తీరం దాటి, వాతావరణం అనుకూలించే వరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోవడానికి సర్వం సిద్ధం

### తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాలు

తణుకు, అక్టోబర్ 28 ( ప్రభాత వార్త): ముంథ తుఫాను ప్రభావంతో తణుకు నియోజవర్గంలో భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపట్టాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న సహాయ చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ స్థాయిలో ఈదురు గాలులు, వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో తణుకు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తణుకు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు ఇరగవరం మండలంలో కాకిలేరు,ఐతంపూడి, కావలిపురం గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే తణుకు పునరావస కేంద్రంలో 80 మందిని తరలించినట్లు తెలిపారు. ఎక్కడైనా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిస్తే తక్షణమే వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తణుకు



నియోజకవర్గంలో విద్యుత్తు, నీటి సరఫరా, వీడియో కమ్యూనికేషన్ ఆటంకాలు లేకుండా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో జరుగుతున్న సహాయ చర్యలపై ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆరా తీశారు. ఆయా పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వారి యోగక్షేమాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. తుఫాను నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు, కూటమి నాయకులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇబ్బందులు ఏమైనా ఉంటే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ కోరారు.

## ప్రజలు ఆందోళన చెందవద్దు

### కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ

నరసాపురం, ప్రభాతవార్త : మొంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేసిందని, తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందవద్దని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ?మంగళవారం నరసాపురం నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో ఆయనతోపాటు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ గొట్టిపాటి రవికుమార్, నర్సాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాలలో పర్యటించి పునరావాస కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాల్లో వసతి సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న తుఫాన్ బాధితులతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుందని, ఆందోళన పడవద్దని మంత్రులు శ్రీనివాస వర్మ, గోట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. అనంతరం నర్సాపురం మండలం పెద్దమైనవానిలంకలోని పునరావాస కేంద్రాన్ని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, జిల్లా ఇన్చార్జి మంత్రి రవికుమార్, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సందర్శించారు. పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లపై తుఫాన్ బాధితులతో మాట్లాడి తెలుసుకున్నారు. జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని, ప్రజలు ధైర్యంగా ఉండాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ కోరారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన వారికి మంచి భోజనం, అల్పాహారం అందించాలని, ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అధికారులను ఆదేశించారు.

**సముద్రపు కోత నుండి పెద్దమైనవాని లంక గ్రామానికి పూర్తి రక్షణ కల్పిస్తాం**

సముద్రపు కోతకి గురవుతున్న పెద్దమైనవానిలంక తీర ప్రాంతాన్ని పరిశీలించారు. సముద్రపు కోత నివారణకు జరుగుతున్న అడ్డుకట్ట పనుల పురోగతిని నరసాపురం ఆర్డీవో దాసిరాజును అడిగి తెలుసుకున్నారు. ?ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని, జిల్లాలో మొగల్తూరు మండలంలో 8, నరసాపురం మండలంలో 8 చొప్పున మొత్తం 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్డీఆర్ఎఫ్ (%చీణ=ఖీ%) బృందం కూడా నరసాపురం ప్రాంతానికి



చేరుకుందని తెలిపారు. రాష్ట్రంలో తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోడీకి ఫోన్లో తెలిపారని, తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కావలసిన అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చారని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తెలిపారు. ?తుఫాను ప్రభావం తగ్గే వరకు తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లలో నుంచి బయటికి రావద్దని ఆయన సూచించారు. అనంతరం వేములదీవి వెస్ట్, ఈస్ట్ గ్రామాలలో పర్యటించి పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిలు కలిదిండి వినోద్ వర్మ, తోట గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తీవ్ర తుఫాన్ నేపథ్యంలో, మొగల్తూరు మండలంలో, తీర ప్రాంత గ్రామాలైన పేరుపాలెం, మొల్లపర్రు, కె పి పాలెం గ్రామాల్లో పర్యటిస్తూ, పునరావస కేంద్రాలను పరిశీలిస్తున్న వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద రాజు
ప్రభాతవార్త నరసాపురం





# లోతట్టు ప్రాంత ప్రజలను తరలించేందుకు
# 44 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం

భీమవరం: ప్రభాతవార్త : మంగళవారం అమరావతి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్ తో ఏర్పాటు చేసిన టెలి కాన్ఫరెన్స్ లో భీమవరం కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ప్రాణనష్టం లేకుండా... ఆస్తినష్టం ఎక్కువ జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి.
– ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాసం, నష్టం అంచనా అనే అంశాలపై ఫోకస్ అధికారులు ఫోకస్ పెట్టాలి.
– కాల్వలు, చెరువులకు గండిపడకుండా చూడండి.. నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండండి.
– లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయండి... రిలీఫ్ క్యాంపులకు తరలించండి.
– తుఫాను ప్రభావం వల్ల కరెంట్ కట్ చేయాల్సి రావచ్చు... ముందుగానే ప్రజలకు క్యాండిళ్లను సరఫరా జరిగేలా చూడండి.
– తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.. అలెర్టుగా ఉండండి.
– పునరావాస శిబిరాల్లో ఉండేవారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలి.
– అధికారులు–ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి.
– సమస్య ఉందనుకున్న ప్రాంతాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉండాలి... క్షేత్ర స్థాయిలో ప్రజా ప్రతినిధులు ఉంటే.. ప్రజలకు భరోసా ఇచ్చినట్టు అవుతుంది.
– భారీ వర్షాల వల్ల పడే నీరు నిల్వ ఉండకుండా.. కాల్వలు, డ్రైన్ల ద్వారా నీటిని బయటకు పంప్ చేయాలి.
– విజయవాడ, ఏలూరు, భీమవరం వంటి ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.
– ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం అనేది ఉండకూడదు.
– తుఫాన్ ప్రభావిత జిల్లా కలెక్టర్లు ప్రతి గంటకూ తుఫాన్ బులెటిన్ రిలీజ్ చేయాలి.. మీడియాకు వాస్తవ పరిస్థితిని వివరించాలి.
– తప్పుడు సమాచారం.. ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసే వార్తలు రాకుండా జాగ్రత్తలు తీసుకోండి.
– రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలి.
– రైతులకు తుఫాన్ అలెర్టులు ఎప్పటికప్పుడు చేరేలా చూడాలి.
– పంట నష్టంపై ప్రాథమిక, పూర్తి స్థాయి అంచనాలను రూపొందించుకునే దిశగా ఫోకస్ పెట్టాలి.
– మొంథా తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసుకుని జాతీయ రహదారులపై రాకపోకలను నిలపాలి.
– రహదారులపై రాకపోకలు నిలపాల్సిన పరిస్థితే వస్తే... సమాచారాన్ని ముందుగానే సమాచారం అందివ్వాలి.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పశ్చిమగోదావరి జిల్లాలో తుఫాను ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి కి వివరిస్తూ జిల్లాలో ప్రస్తుతం అంచనా వేసిన వర్షపాతం కంటే తక్కువగానే నమోదు అయిందని, కాకపోతే గాలులు వేగం పెరిగిందని తెలిపారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి మరియు గొట్టిపాటి రవికుమార్, జిల్లాలోని శాసనసభ్యులు, ఏపీఐఐసీ చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు, నాతో సహా అందరూ క్షేత్రస్థాయిలో తుఫాన్ పరిస్థితులను పర్యవేక్షించడం జరుగుచున్నదని వివరించారు. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం నియోజకవర్గాల్లోని మండలాల్లో 44 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, సుమారు 9 వేల మందిని పునరవాసి కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే నాలుగు వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని తెలిపారు. ప్రధానంగా తీర ప్రాంతంలోని 8 గ్రామాలలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఇప్పటికే 17 గ్రామాలు నీటి తాకిడికి గురయ్యాయని తెలిపారు. ఎన్ డి ఆర్ ఎఫ్ టీమ్ తో పాటు, జనరేటర్లు తదితర ఏర్పాట్లు అన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటికీ కాల్ సెంటర్ కు చెట్లు పడిపోవడం తదితర 16 ఫిర్యాదులు అందాయని వాటి అన్నింటిని పరిష్కరించడం జరిగిందన్నారు. అన్ని పునరావాస కేంద్రాల్లో జనరేటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, కాలవలు, స్లూయిస్ వద్ద చెత్త అడ్డం పడకుండా ఎప్పటికప్పుడు తొలగించేందుకు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు.

## కొల్లేరు ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ



మండవల్లి అక్టోబర్ 28(ప్రభాతవార్త): మొంథా తుపాను పట్ల కొల్లేరు ప్రజలు నిర్లక్ష్యం వహించవద్దని, అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కోరారు. మండవల్లి మండలం కొల్లేరు లంక గ్రామాలైన దెయ్యం పాడు, చింతపాడు, కొవ్వాడలంక, మణుగులూరు, నుచ్చుమిల్లి, ఇంగిలిపాకలంక, లోకుమూడి గ్రామాల్లో ఎమ్మెల్సీ జయమంగళ పర్యటించి తుఫాను వల్ల జరిగే నష్టాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను మైక్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తుఫాను 100 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని,భారీ వర్షం చోటు చేసుకుంటుందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండి విద్యుత్ స్తంభాలు, తీగలు, సెల్ టవర్లు, చెట్లు కింద ఉండవద్దని జాగ్రత్తలు చెప్పారు. ఆస్తి, ప్రాణ నష్టం ఎక్కడ జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి లోతట్టు ప్రాంతాల్లో ముంపు బారిన పడే చోట లేకుండా సురక్షిత భవనాల్లో ఉండాలని సూచించారు. ఈ రెండు రోజులు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళద్దని, ముఖ్యంగా మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని కోరారు. ప్రతి ఒక్కరు వాతావరణ శాఖ హెచ్చరికలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని పేర్కొన్నారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా... జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, చెందులూరు, పెదవేగి, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా... ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు సంప్రదించవలెను.
ఫోన్ : 9704502377

## రామకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముంతా తుఫాన్ ప్రభావం పై
# అవగాహన కార్యక్రమం

మొగల్తూరు అక్టోబర్ 28 (ప్రభాతవార్త)రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంల ట్రస్ట్ సభ్యులు మొగల్తూరు, నరసాపురం మండలములలోని తీర ప్రాంత ప్రజలకు ముం తా తుఫాన్ ప్రభావం పై అవగాహన కల్పించడం జరిగిందని తుఫాన్ సమయంలో ప్రభుత్వం అందించే తక్షణ సహాయక చర్యలు గురించి సహాయం కోసం సంప్రదించాల్సిన ప్రభుత్వ కంట్రోల్ రూమ్ నెంబర్స్ తో కూడిన బ్యానర్లు ముద్రించి పేరుపాలెం, తూర్పుతాళ్లు, పెదమైనవానిలంక, కె. పి.పాలెం, వేములదివి మొదలైన తీర మంగళవారం ప్రాంతాలలో అవగాహన కల్పించడం జరిగింది, ఏవిధమైన సహాయం కావాలన్నా రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అనుక్షణం తీర ప్రాంత ప్రజలకు అందుబాటులో వుంటారు అని తుఫాన్ రక్షణ చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం తో మా ట్రస్ట్ సభ్యులు కలసి పనిచేయడం జరుగుతుంది అని రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తణుకుల రామకృష్ణ తెలియజేయడం జరిగింది.

## తుఫాన్ జాగ్రత్త చర్యలు.



అత్తిలి– అక్టోబర్ 28 ( ప్రభాత వార్త): అత్తిలి మండలంలోని తిరుపతిపురం, అత్తిలి మంచిలి,వరిగేడు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి టి కే రాజేష్ పర్యటించి రైతులకు తుఫాను సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలోనూ రైతు సేవా కేంద్రం ఇన్చార్జిలు రైతులతో తుఫాను సమయంలో తీసుకోవలసిన చర్యలు గురించి వివరించారు.ప్రస్తుతం మండలంలోని పంట పొలాలు అన్ని పూత, గింజలు గట్టిపడే దశలో ఉన్నందున ముందుగా చేలలో మురుగు కాలువలు ఏర్పాటు చేసుకోవా లన్నారు.

## పునర్వశ కేంద్రాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్



మొగల్తూరు అక్టోబర్ 28 (ప్రభాతవార్త) బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ముంతా తుఫాన్ గా మారి ఈదురు గాలులతో భారీ వర్షం కొరవడంతో లోతట్టు ప్రాంతం ప్రజలందరినీ పునర్వశ కేంద్రాలకు తరలించడంతో మంగళవారం మొగల్తూరు మండలం మరియు నరసాపురం మండలాలలో పలు గ్రామాలలో ఉన్న పునర్వశ కేంద్రాలను మాజీ శాసనసభ్యులు కొత్తపల్లి జానకిరామ్ పరిశీలించి వారికి ఏర్పాటు చేసిన వసతులు గురించి తెలుసుకున్నారు, అనంతరం ప్రజలకు ఆయన స్వయంగా ఆహారాన్ని అందించారు.

## మొంథా తుఫాను ముందస్తు చర్యల పరిశీలన



వేలేరుపాడు, అక్టోబర్ 28,ప్రభాత వార్త : పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదేశాల ప్రకారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న అధికారులను "మొంథా "తుఫాను ప్రభావం పై తీసుకుంటున్న చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు వేలేరుపాడు జనసేన పార్టీ మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ. మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో ఎక్కడైనా స్తంభాలు ఒరిగినట్లు అనిపిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని మరమ్మత్తులు చేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు ఆదినారాయణ కు తెలిపారు.

## వర్షం వస్తే నరకయాతన మౌలిక సదుపాయాల్లేని పెనుగొండ అడ్డపుంత కాలనీ
## సిపిఎం మండల కార్యదర్శి పాదుషా ఆవేదన



పెనుగొండ, అక్టోబర్ 28 (ప్రభాతవార్త): పెనుగొండ మండలంలోని అడ్డపుంత కాలనీలో ప్రతి వర్షం వస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు లేక మట్టి లోతుల్లో మునిగి రోజువారీ జీవితం స్తంభిస్తున్నదని కాలనీ వాసులు వాపోతున్నారు.తుఫాను ప్రభావంతో ప్రజల పరిస్థితిని తెలుసుకునేందుకు కాలనీని సందర్శించిన సిపిఎం మండల కార్యదర్శి ఎస్కే పాదుషా మాట్లాడుతూ, గత ఆరు ఏళ్లుగా కాలనీలో మౌలిక సదుపాయాల కోసం ప్రజలు చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికార పక్ష ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహించారని తీవ్రంగా విమర్శించారు. 100 కుటుంబాలకు కాలనీ ఇచ్చి ఇళ్లు నిర్మించుకునే అవకాశమిచ్చినా రోడ్లు, త్రాగునీరు, విద్యుత్, బడి, ఆసుపత్రి వంటి ప్రాథమిక సదుపాయాలు లేక ప్రజలు నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. పిల్లలు, వృద్ధులు చెరువుల మట్టి దారుల్లో జారిపడుతూ ప్రమాదాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు కట్టుకుంటే సదుపాయాలు వస్తాయనే కలలు కన్న ప్రజలకు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నరకయాతన తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అడ్డపుంత కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలి," అని పాదుషా డిమాండ్ చేశారు. ఈ సందర్భనలో సిపిఎం నాయకులు కుడిపూడి ప్రసాద్‌రావు, జక్కంశెట్టి రవికుమార్, కర్రీ లోవరాజు, సానబోయిన శ్రీనివాసరావు, పలు మహిళలు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన అధికారులు.




అత్తిలి– అక్టోబర్ 28 ( ప్రభాత వార్త ): మొంథా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో అత్తిలి మండలం వరిగేడు గ్రామంలోఅధికారులు పర్యటించారు. మెడికల్ క్యాంప్స్, పునరావాస కేంద్రంను పరిశీలించి తగుసూచనలు ఇచ్చారు. గ్రామ పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉండి గ్రామంలో ఏ విధమైన సమస్యలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఉపాధి హామీ పనులు గ్రామ అభివృద్ధికి ఉపయోగపడాలి


చాట్రాయి, అక్టోబర్ 28, ప్రభాతవార్త : ఉపాధి హామీ పనులు గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా నివేదిక తయారు చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఇజ్జి గాని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆరుగొలను పేట గ్రామంలో ఉపాధి హామీ పనులు 2026– 27 ఏడాదికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను తయారు చేసేందుకు గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పని దొరకడంతో పాటు గ్రామానికి ఉపయోగపడే విధంగా పనులు ధ్రువీకరిస్తే మేలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామం అభివృద్ధి చెందుతూనే గ్రామాలు నందనవనంగా తయారవుతాయని ఆయన తెలియజేశారు.కూలీలందరికీ 100 రోజులపాటు పని కల్పించే విధంగా అవసరమైన పనులన్నింటినీ గుర్తించి గ్రామసభలో ఆమోదింపజేసుకోవాలని కోరారు.

## శ్రీ పార్వతి సమేత రామేశ్వర స్వామివారికి విశేష అలంకరణ,



పెనుమంట్ర ప్రభాతవార్త :మండలంలోని వెలగలేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ పార్వతి సమేత రామేశ్వర స్వామివారికి కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా విశేష అలంకరణ, ప్రత్యేక హారతులు ఘనంగా జరిగాయి. ఈ అలంకరణలు ఆలయ ప్రధాన అర్చకులు భైరవబొట్ల తిరుమల రామలింగ దుర్గాప్రసాద్ కుమారుడు అనీష్ నిర్వహించినారు. స్వామివారిని దర్శించుకోవడానికి గ్రామ ప్రజలు మరియు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## ఈదురు గాలులతో..., నేల కూలిన చెట్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం,



పెనుమంట్ర–ప్రభాతవార్త :మండలములో ఈదురు గాలులు, వర్షంతో అక్కడక్కడ చెట్లు నేలకూలాయి. ట్రాఫిక్ కు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండలంలోని బ్రాహ్మణ చెరువు మండల కార్యాలయ సముదాయంలో గల ఇరిగేషన్ కార్యాలయం పై కూకటి వేళ్లతో చెట్టు పడిపోవడంతో పాక్షికంగా గోడ దెబ్బతిన్నది. సిబ్బంది అంతా అత్యవసర విధులలో బయట ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. బ్రాహ్మణ చెరువు మార్టేరు ప్రధాన రహదారిపై ఎఫ్ సి ఐ గోడౌన్స్ సమీపంలో ప్రధాన రహదారిపై రోడ్డు అడ్డంగా చెట్టు పడిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. వెంటనే స్పందించిన మండల అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది జెసిబి తో చెట్టును తొలగించగా, తెగిన విద్యుత్ వైర్లను విద్యుత్ సిబ్బంది వెంటనే సరి చేశారు. నెగ్గిపూడి గ్రామపంచాయతీ వనంపల్లి గ్రామంలో కొబ్బరి చెట్టు నేల కొరగ్గా అది బ్రాహ్మణ రామాలయం షెడ్డు పైన పడడంతో విద్యుత్ తీగలు తెగిపడి, రెండు స్తంభాలు వంగి, ఒక సిమెంట్ స్తంభం పడిపోవడంతో యుద్ధ ప్రాతిపదికన చెట్టు తొలగించి విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించారు.

## తుఫాను ద్వారా వచ్చే నష్టాన్ని తగ్గించాలి
## మంత్రి పార్థసారది



నూజివీడు,అక్టోబర్ 28 ప్రభాతవార్త: తుఫాను సహాయక కార్యక్రమాలలో ప్రభుత్వ ప్రతిష్ట ఇనుమడింపచేసేలా అధికార యంత్రాంగం పనిచేయాలని , రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం లో మంగళవారం సాయంత్రం తుఫాన్ పరిస్థితి, సహాయక చర్యలపై అధికారులతో మంత్రి పార్థసారధి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ మొంథా తుఫాను మంగళవారం రాత్రికి తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 100 నుండి 110 కిలోమీటర్ల వేగంతో పెను గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా ముంపు ప్రమాదం ఉన్న ప్రతీ ప్రాంతంలోని ప్రజలను వెంటనే తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలించాలని, వారికి నాణ్యమైన భోజనం, వసతి అందించేలా చర్యలు తీసుకోవాని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## తుఫాను భారీ వర్షాలతో నాగమ్మ కాలనీ నీట మునిగింది




పెనుగొండ, అక్టోబర్ 28 (ప్రభాతవార్త): తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో సిద్ధాంతం గ్రామంలోని నాగమ్మ కాలనీ తీవ్రంగా ప్రభావితమైంది. వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని రోడ్లు చిత్తడిగా మారి, వర్షపు నీరు గుంతలుగా నిలిచిపోయింది.ఈ సందర్భంగా నాగమ్మ కాలనీని సందర్శించిన సిపిఎం పార్టీ సిద్ధాంతం గ్రామ కార్యదర్శి కప్పల రత్నరాజు మాట్లాడుతూ, గత ఆరేళ్లుగా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో కాలనీ ప్రజలు అనేక అగచాట్లు ఎదుర్కొంటున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. సుమారు 150 మందికి ప్రభుత్వం కేటాయించిన ఈ కాలనీలో రోడ్లు, తాగునీటి సదుపాయం, డ్రైన్లు వంటి ప్రాథమిక వసతులు లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంత వాసులకు భోజనాలు అందజేత




భీమవరం అక్టోబర్ 28 ప్రభాతవార్త : తుఫాన్ ప్రభావిత ప్రాంత వాసులను ఆదుకోవడం మానవత్వమని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి అన్నారు. భీమవరం ప్రకాష్ నగర్ లోని వర్ష ప్రభావిత వాసులు 300 మందికి దాతల సహకారంతో భోజనాలు అందించారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వర్షాలతో ఇబ్బందులు పడుతున్నవార్కి ప్రభుత్వంతోపాటు దాతలు కూడా బోజనాలను అందిస్తున్నారని, ఏదైనా ఇబ్బందులుసమాచారాలను అందించాలన్నారు. పట్టణానికి చెందిన నడింపల్లి బంగార్రాజు సహకారంతో భోజనాలు అందమ్చామన్నారు.

## శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు కృత్తికా దీపోత్సవం.



ఆగిరిపల్లి అక్టోబర్ 27 ప్రభాతవార్త : శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం నందు ఈనెల 31 నుండి వచ్చేనెల ఆరవ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవములు కృత్తికా దీపోత్సవం నిర్వహించబడునని ఆలయ కార్యనిర్వహణాధికారి సిహెచ్ సాయి తెలిపారు. 31వ తేదీ ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ నిత్య పూజా కార్యక్రమంలో అనంతరం విశ్వక్సేన పూజ పుణ్యాహ వచనము ఆదిత్యాది నవగ్రహ అష్టదిక్పాలక ఆరాధన అగ్ని ప్రతిష్టాపనము శ్రీవార్లకు విశేష అర్చన నవ కలిసా పంచామృతస్నపన కల్మష హోమం పూర్ణాహుతి సాయంత్రం అజేష్ట దీపారాధన దీక్షా చరణ మృత్సంగ్రహణ, అంకురారోపణ వాస్తు శుద్ధి ధ్వజపట ప్రతిష్ట ధాన్యాధివాసం ప్రధాన హోమము చతుర్వేద పారాయణలో నిర్వహించబడును ఆలయవంశ పారంపర్య ధర్మకర్తలు ఊహెదాతలుగా వ్యవహరిస్తారు. ఒకటో తేదీ శనివారం ఉదయం ధ్రువ మూర్తికి పంచామృత స్నపన, విశేష అలంకరణ అష్టోత్తర శత రజిత తులసి దళార్చన నిత్య హోమము భేరి పూజ భేరితాండవం, ధ్వజారోహణ సాయంత్రం నవ కుంభారోహణ సర్వదైవత్య హోమము లు నిర్వహించబడును.ఈ కార్యక్రమంలో ఆగమాచార్య వేదాంతం గోపాలకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో ఆగమ వాచెస్పతి వేదాంతం రాజగోపాల చక్రవర్తి వారి యా నిర్వహణలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు జి రామ అంత కృష్ణ వేదాంతం లీలా మనోహర ప్రసాద్ లచే నిర్వహించబడునని కార్య నిర్వహణ అధికారి సాయి తెలిపారు

## అధిక వర్షాల నుండి పత్తి పంటను కాపాడుకోండి
## - వ్యవసాయ అధికారి శివశంకర్



చాట్రాయి, అక్టోబరు 28, ప్రభాతవార్త : అధిక వర్షాల నుండి పత్తి పంటను కాపాడుకునేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ చెప్పారు. చాట్రాయి మండలం, నరసింహారావు పాలెం, చనుబండ, పర్వతాపురం గ్రామాలలో పత్తి పంటను ఆయన మంగళవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మండలంలో 270 ఎకరాలు పత్తి పంట సాగులో ఉందని రైతులు పొలాల్లో నీరు అధికంగా లేకుండా బయటకు పంపించే మార్గాన్ని చూసుకోవాలని చెప్పారు. తుఫాన్ వల్ల వర్షాలు అధికంగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున రైతులు పంటను కాపాడుకునేందుకు తగు సూచనలు పాటించాలని ఆయన వివరించారు. పత్తి పూత,కాయల దశలో ఉన్నప్పుడు యూరియా ఎకరానికి 30, మ్యూరేట్ ఆఫ్ ఫొటోష్ 15 కిలోలు భూమిలో వేయాలని చెప్పారు. ఆకు మచ్చ కాయ కుళ్ళు తెగులు నివారణకు మంకోజబ్ ఒక మిల్లి లీటరు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. హెూతా కాయలు రాలితే నాఫ్తాలిన్ ఆసిటిక్ యాసిడ్ ( ప్లోనోఫిక్స్ )0.25 ఎమ్.ఎల్ ఒక లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేరుపాలెం బీచ్ లోఎగసిపడుతున్న అలలు

మొగల్తూరు అక్టోబర్ 28 (ప్రభాతవార్త) బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ముంతా తుఫాన్ గా మారడంతో సముద్రపు అలలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్నాయి, తుఫాన్ కారణంగా బీచ్కు వచ్చు విహారయాత్రికులకు అనుమతి లేకపోవడంతో నిరుపయోగంగా మారిన పేరుపాలెం బీచ్

## తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
## జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

కాళ్ళ, అక్టోబర్ 28 (ప్రభాత వార్త) : తుఫాను నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నత అధికారులతో సమన్వయం చేసుకొని అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలం కల్వపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తుఫాన్ బాధితులుకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రమును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భోజన వసతి, త్రాగునీరు, టాయిలెట్స్, శానిటేషన్, జనరేటర్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మందులను సిద్ధ%శీ%గా ఉంచుకోవాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. మొగదిండి డ్రైన్ ఉధృతిని పరిశీలించారు. ఏటిగట్టు దిగువ పల్లపు ప్రాంతాల్లో నివాసలు ఉన్న గృహాలను పరిశీలించారు. మాలవాని తిప్ప గ్రామంలో విద్యుత్ ఉపకేంద్ర%శీ% పరిశీలించి బలమైన గాలులకు చెట్లు కూలి విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉన్నందున ముందుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. రహదారులకు అడ్డంగా పడే చెట్లను తొలగించేందుకు జెసిబిలు, కట్టర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి తుఫాన్ కారణంగా ఏర్పడే ఎటువంటి విపత్తునైన యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ సుందర్ సింగ్, ఎంపీడీవో స్వాతి, ఎలక్ట్రికల్ వైద్య, ఇరిగేషన్ డ్రైనేజ్ వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ నేపథ్యంలో రైతులు బయటకు రావద్దు,
## ఏవో దేవి స్వరూప,



పెనుమంట్ర–ప్రభాతవార్త :పెనుమంట్ర మండలంలోని రైతులందరూ తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప రైతులెవరు బయట ఉండరాదని మండల వ్యవసాయ అధికారి బి దేవీ స్వరూప మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని వరి విస్తీర్ణం మొత్తం 12207 ఎకరాలు అయితే ఇందులో ఎం టి యు 13 18 రకాన్ని రైతులు ఎక్కువగా ఊడ్చారని తెలిపారు.

## మొంథా తుఫాను దృష్ట్యా ప్రజలు
## అప్రమత్తంగా ఉండాలి, ఎమ్మెల్యే పితాని



పెనుమంట్ర–ప్రభాతవార్త,:మొంథా తుఫాను తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీమంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రజలకు సూచించారు. మంగళవారం మధ్యాహ్నం మీడియాతో ఆయన మాట్లాడారు బంగాళాఖాతంలో ఏర్పడినమొంథ తుఫాన్ మరింత బలపడి భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలకు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు.

## ఉధృతంగా పరవళ్ళు తొక్కుతున్న గొంతేరు డ్రైన్



మొగల్తూరు అక్టోబర్ 28 (ప్రభాతవార్త) ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ముంతా తుపాన్గా ఏర్పడి కురుస్తున్న భారీ వర్షములు శరవేగంతో ఇస్తున్న ఎదురుగాలులకు ఉధృతంగా పరవళ్ళు తొక్కుతున్న గొంతేరు డ్రైన్, దీనివలన లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారి వ్యవసాయ భూములు ఆక్వా చెరువులు మునిగి డ్రైన్లోనికి వస్తున్నాయి, డైన్ ను అనుసరించి ఉన్న మొగల్తూరు మండలంలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురయ్యాయి

# 'ది గ్రేట్ ప్రి వెడ్డింగ్ షో' అందరికీ నచ్చుతుంది

## ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తిరువీర్

వెర్సటైల్ యాక్టర్ తిరువీర్, టీనా శ్రావ్య జంటగా నటించిన చిత్రంది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' , పప్పెట్ షో ప్రొడక్షన్స్ బ్యానర్లపై సంయుక్తంగా సందీప్ అగరం, అశ్మితారెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కల్పనా రావు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. నవంబర్7న ఈ మూవీని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, గ్లింప్స్, టైటిల్ పోస్టర్లు సినిమాపై అంచనాలు పెంచేశాయి. ఈ క్రమంలో మంగళవారం నాడు చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌కి దర్శకులు కరుణ కుమార్, యదు వంశీ, ఆదిత్య హాసన్, రామ్ అబ్బరాజు, సన్నీ, దుశ్యంత్, ఉదయ్ గుర్రాల, రూపక్, తేజ, నంద కిషోర్ వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలోదర్శకుడు కరుణ కుమార్ మాట్లాడుతూ, తిరువీర్‌ను నేను ఓ నాటకంలో చూశాను. నేను మూవీ తీస్తే తిరువీర్‌కి పాత్ర ఇవ్వాలని ఫిక్స్ అయ్యాను..తల్లి చనిపోయినా కూడా తిరువీర్ ఆ విషయాన్ని మాకు చెప్పకుండా షూటింగ్‌లో సీన్ చేశాడు. అలా తిరువీర్ మాకు ఎంతో సహకరించారు. ఈ చిత్రం వంద శాతం బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందిఅని అన్నారు.

అంబాజీపేట దర్శకుడు దుశ్యంత్ మాట్లాడుతూ,ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో ట్రైలర్ నాకు చాలా నచ్చింది. ఎవరైనా ఏదైనా కొత్త కాన్సెప్ట్ పట్టుకొస్తుంటే వారికి ఫస్ట్ ఛాయిస్‌గా తిరువీర్ నిలుస్తున్నారు. దర్శక, నిర్మాతలకు మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను. నవంబర్ 7న ఈ సినిమాను అందరూ చూడండి అని అన్నారు.దర్శకుడు ఉదయ్ గుర్రాల మాట్లాడుతూ, తిరువీర్ కోసమే ఇంత మంది దర్శకులు ఈ రోజు ఇలా వచ్చారు. తిరు ఎప్పుడూ మంచి కథల్ని ఎంచుకుంటూ ఉంటారు. పరేషాన్ దర్శకుడు రూపక్ మాట్లాడుతూ,ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో



మూవీని నేను ఆల్రెడీ చూశాను. చాలా అద్భుతంగా ఉంటుంది. స్వీట్, సింపుల్, సెన్సిబుల్, ఫన్ రైడ్‌గా సినిమా ఉంటుంది.. ఫ్యామిలీ అంతా కలిసి చూసి హాయిగా నవ్వుకునేలా సినిమా ఉంటుంది. తిరువీర్‌కు ఈ మూవీతో మంచి సక్సెస్ వస్తుంద్ధి అని అన్నారు.జోహార్ దర్శకుడు తేజ మాట్లాడుతూ,ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో చిత్రంలో చాలా మంది కొత్త వాళ్లే కనిపిస్తున్నారు. కొత్త నిర్మాతలకు ఈ చిత్రంతో డబ్బులు బాగానే వస్తాయి.

నవంబర్ 7న ఈ చిత్రం రాబోతోంది. అందరూ తప్పకుండా సినిమా చూసి కొత్త వాళ్లని ఎంకరేజ్ చేయండి అని అన్నారు. దర్శకుడు నంద కిషోర్ మాట్లాడుతూ,జార్జి రెడ్డి టైంలోనే నాకు తిరువీర్ తెలుసు. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చారు. ఆయన ప్రతీ సినిమాలో, ప్రతీ పాత్రలో సహజత్వం ఉట్టి పడుతుంది.. హీరో తిరువీర్ మాట్లాడుతూ,మా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో కోసం ఇంత మంది దర్శకులు వచ్చారు. నేను ఇంత మంది మంచి ఫ్రెండ్స్‌ను దర్శకుల రూపంలో సంపాదించుకున్నందుకు ఆనందంగా ఉంది.హీరోయిన్ టీనా శ్రావ్య మాట్లాడుతూ ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో ట్రైలర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ఇంత మంచి దర్శకులంతా కూడా మా ఈవెంట్‌కు రావడం ఆనందంగా ఉంది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్ని ఆడియెన్స్ ఎప్పుడూ సపోర్ట్ చేస్తారు. మేం ఎంతో ఇష్టపడి, కష్టపడి ఈ మూవీని చేశాం. మా టీం అందరికీ థాంక్స్. నవంబర్ 7న థియేటర్లోకి రాబోతోంది. మంచి కంటెంట్‌తో మంచి ఎంటర్టైన్మెంట్ ఇచ్చేలా మా చిత్రం ఉంటుంది అని అన్నారు. .మాస్టర్ రోహన్ మాట్లాడుతూట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్క దర్శకుడికి థాంక్స్. అందరినీ హాయిగా నవ్వించేలా మా చిత్రం ఉంటుంది. నవంబర్ 7న మా సినిమాను అందరూ చూడండిఅని అన్నారు.సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ. ఈవెంట్‌కు వచ్చిన గెస్టులందరికీ థాంక్స్. నాకు ఈ అవకాశం ఇచ్చిన రాహుల్‌కి, సందీప్ కి, తిరువీర్‌కి థాంక్స్. సినిమా గురించి ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడతాన్ను అని అన్నారు .నటి యామిని మాట్లాడుతూ,ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో ట్రైలర్ నాకు చాలా నచ్చింది. ఇదే నాకు తొలి చిత్రం. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు రాహుల్ కి, నిర్మాతలకు థాంక్స్. నవంబర్ 7న మా చిత్రం రానుంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి అని అన్నారు.




## సంచలన ఫ్రాంచైజీలో .. ఆగ్రా బ్యూటీ సోనాల్ చౌహాన్



ఆగ్రాబ్యూటీసోనాల్ చౌహాన్ కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటి వరకూ ఒకేలా సాగుతోన్న సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, బెంగాలీ, తమిళ్ అంటూ నాలుగుభాషల్లోనూ నటించింది. కానీ ఏ భాషలోనూ నిల దొక్కు కోలేదు. ఎక్కడ అవకాశం వస్తే అక్కడకు వెళ్లి పని చేయడం త!ప్ప తనకంటూ ఓ భాష ఉందని నిరూపించుకోలేకపోయింది. అవకాశాలు వస్తున్నా? వాటితో పాటు చిన్నా చితకా విజయాలు అందుకుంటున్నా? స్థిరంగా మాత్రం పని చేయలేకపోతుంది. అయితే ఏడాది కాలంగా ఆ చిన్నపాటి అవకాశాలు కూడా లేవు. చివరిగా గతఏడాది రిలీజ్ అయిన డార్డ్ లో నటించింది. ఆ తర్వాత మళ్లీ మరో సినిమా చేయలేదు. ఈ నేపథ్యంలో అమ్మడుఏకంగాబంపర్ఆఫర్ అందుకుంది.సంచలన 'మీర్జాపూర్' ఫ్రాంజెజీలో భాగమవ ుతుంది. 'మీర్జాపూర్':దిఫిల్మ్ చిత్రంలో భాగమైనట్లు వెల్లడించింది.అద్భుతమైన ఆటను మార్చే ప్రయాణంలో భాగం కావడం సంతోషంగా ఉందంది. ఈ సినిమాలో నటించడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగాదర్శక,నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపింది. గుర్మీత్ సింగ్ దర్శకత్వంలో పర్హాన్ అక్తర్, రితేష్ సిద్వానీ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'మీర్జాపూర్' కు ప్రత్యేకమైన అభిమానులున్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా ఫాలోయింగ్ ఉన్న సిరీస్ ఇది. పంకజ్ త్రిపాఠీ, అలీ జాఫర్, దివ్యేందు, శ్వేతా త్రిపాఠీ నటించిన మీర్జాపూర్ ఫ్రాంచైజీ మూడు సీజన్లు పెద్ద విజయం సాధించాయి. ఇప్పుడిదే సిరీస్ ను గుర్మీత్ సింగ్ సినిమా గా తెరపైకి తేవడం విశేషం. మరి ఈ కథను ఒకే సినిమా గా రిలీజ్ చేస్తాడా? రెండు భాగాలుగా రిలీజ్ చేస్తారా? అన్నది చూడాలి. సినిమాలో వెబ్ సిరీస్ పాత తారగణంతో పాటు, కొత్త నటీనటులు నటిస్తున్నారు. దీనిలో భాగంగా వెబ్ సిరీస్ లో సోనాల్ చౌహాన్ లేకపోయినా? సినిమా లో అవకాశం అందుకో గలిగింది. మీర్జాపూర్ ప్రాంతంలో అధికార పోరాటాలు, నేరస్థుల అండర్ వరల్డ్ కథకు కొనసాగింపుగా ఈ కథ ఉంటుంది. ఇదొక క్రైమ్ థ్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అవి పూర్త యిన వెంటనే పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా మొదలయ్యే అవకాశాలున్నాయి.

## మాస్ మహారాజా రవితేజ 'మాస్ జాతర' ట్రైలర్ విడుదల



మాస్ మహారాజా రవితేజ అభిమానులతో పాటుఅందరూఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న మాస్ జతర సినిమా ట్రైలర్ ఎట్టకేలకు విడుదలైంది. రవితేజ నుండి అభిమానులు, ప్రేక్షకులు ఆశించే అసలుసిసలైన మాస్ వేడుకలా ఈ ట్రైలర్ ఉంది. రైల్వే పోలీస్ అధికారిగా రవితేజ తనదైన శైలిలో ఒదిగిపోయిన తీరు కట్టిపడేసింది.రవితేజ అంటేనే ఉత్సాహంతో తెర వెలిగిపోతుంది. ఆ ఉత్సాహం 'మాస్ జాతర' ట్రైలర్ లో అడుగడుగునా కనిపించింది. భారీ యాక్షన్ సన్నివేశాలు, అదిరిపోయే పంచ్ డైలాగ్‌లతో మాస్ మహారాజా అభిమానులు కోరుకునే మాస్ విందులా ఈ ట్రైలర్ ను మలిచారు.కథానాయకుడు, ప్రతినాయకుడు మధ్య ఉత్కంఠభరితమైన సంఘర్షణ నేపథ్యంలో ట్రైలర్ ను రూపొందిన తీరు ఆకట్టుకుంది. వాణిజ్య అంశాలతో నిండిన పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రానికి హామీ ఇచ్చేలా ఖిమాస్ జతరఖి ట్రైలర్ ఉంది. నవీన్ చంద్ర మరోసారి శక్తివంతమైన ప్రతినాయక పాత్రలో మెరిసి, రవితేజను ఢీకొట్టే పాత్రలో మెప్పించారు. ట్రైలర్ కు మరింత ఆకర్షణ మరియు తాజాదనాన్ని జోడిస్తూ, కథానాయిక శ్రీలీల తెరపై ఎంతో అందంగా కనిపించారు. ఆమె మొదటిసారి శ్రీకాకుళం యాసలో మాట్లాడినప్పటికీ, ఆ యాసను పూర్తిగా ఆస్వాదిస్తూ అద్భుతంగా పలికిన తీరు ఆశ్చర్యపరిచింది. రవితేజశ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, ఈ ట్రైలర్ కు మరింత అందాన్ని తీసుకొచ్చింది.

ఇప్పటికే పాటలతో ప్రేక్షకుల మనసు దోచుకున్న సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో, తన నేపథ్య సంగీతంతో ట్రైలర్ ను మరో స్థాయికి తీసుకెళ్లారు. రవితేజ వింటేజ్ మాస్ ఆరాకు సరిగ్గా సరిపోయేలా ఆయన సంగీతం ఉంది. భారీ పోరాట సన్నివేశాలు, కడుపుబ్బా నవ్వించే హాస్యం, అద్భుతమైన పాటలతో విందు భోజనం లాంటి చిత్రానికి ఖిమాస్ జాతరఖి హామీ ఇస్తోంది.

తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు, ఖిమాస్ జాతర చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రేక్షకులకు పూర్తి స్థాయి మాస్ విందుని అందించడానికి అక్టోబర్ 31న ఖిమాస్ జాతరఖి చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అడుగుపెట్టనుంది.

చిత్రం: మాస్ జాతరతారాగణం: రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్రదర్శకత్వం: భాను భోగవరపు నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య,సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

## ప్రణవ్ మోహన్ లాల్ 'డియాస్ ఇరాయ్' విడుదల



మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్ లాల్‌తనయుడిగా చిత్రసీమలో అడుగు పెట్టిన ప్రణవ్, అతి తక్కువ సమయంలో తనకంటూ ఒక స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. 'హృదయం'తో భాషలకు అతీతంగా ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించుకున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'డియాస్ ఇరాయ్'. మిస్టరీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేస్తోంది.

కమల్ హాసన్ 'పుష్పక విమానం', 'నాయకుడు' నుంచి ధనుష్ 'రఘువరన్ బీటెక్' వరకు తెలుగులో శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేసిన పరభాషా సినిమాలు భారీ విజయాలు సాధించడంతో పాటు విమర్శకుల ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. అందువల్ల, 'డియాస్ ఇరాయ్' మీద ప్రేక్షకులతో పాటు బిజినెస్ వర్గాల్లో అంచనాలు ఏర్పడ్డాయి. 'హృదయం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రణవ్ మోహన్ లాల్ వరుసగా సినిమాలు చేయలేదు. సెలక్టివ్‌గా కథలు ఎంపిక చేసుకుంటూ వస్తున్నారు. ఖిభూత కాలంఖి, మమ్ముట్టి 'భ్రమ యుగం' చిత్రాలకు దర్శకత్వం వహించిన రాహుల్ సదాశివన్, ఈ ఖిడియాస్ ఇరాయ్ఖిను తెరకెక్కించారు. మలయాళ, తమిళ భాషల్లో అక్టోబర్ 31న ఈ సినిమా విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ డియాస్ ఇరాయ్ఖి మలయాళ వెర్షన్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు శ్రీ స్రవంతి మూవీస్ అధినేత రవికిశోర్. సుష్మితా భట్, జిబిన్ గోపీనాథ్, జయ కురుప్, మనోహరి జాయ్, అరుణ్ అజికుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన 'డియాస్ ఇరాయ్' తెలుగు వెర్షన్‌ను నవంబర్ తొలి వారంలో థియేటర్లలో విడుదల చేయనున్నారు. విభిన్న కథలతో తెరకెక్కిన 'ప్రేమలు', 2018, 'మంజుమ్మేల్ బాయ్స్', 'కొత్త లోక'వంటి మలయాళ సినిమాలకు తెలుగులో చక్కటి ఆదరణ లభించింది. ఆయా సినిమాలు తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆ జాబితాలో 'డియాస్ ఇరాయ్' కూడా చేరుతుందని చిత్ర బృందం భావిస్తోంది. ప్రణవ్ మోహన్ లాల్ హీరోగా రాహుల్ సదాశివన్ రచన, దర్శకత్వంలో రూపొందిన 'డియాస్ ఇరాయ్' చిత్రాన్ని నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ సంస్థలపై చక్రవర్తి రామచంద్ర, ఎస్'శికాంత్ నిర్మించారు. ఈ చిత్రానికి క్రిస్టో జేవియర్ సంగీతం అందించారు

## జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మెలోడీ పాట విడుదల..



అందమైన ప్రేమ కథగా ఎస్‌ఆర్‌ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరా దేవీ ప్రొడక్షన్స్ బ్యానర్‌ల మీద రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్న చిత్రం 'ఓ.. చెలియా' నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని ఎం. నాగ రాజశేఖర్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఓ.. చెలియా పోస్టర్లు, గ్లింప్స్, సాంగ్స్, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా మరో అందమైన ప్రేమ గీతాన్ని చిత్రయూనిట్ రిలీజ్ చేసింది.విలక్షణ నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా నాకోసం ఆ వెన్నెలఅంటూ సాగే లవ్, మెలోడీ పాటను టీం విడుదల చేయించింది. ప్రస్తుతం ఈ పాట శ్రోతల్నిఇట్టే కట్టిపడేస్తోంది. ఎంఎం కుమార్ బాణీ వినడానికి ఎంతో హాయిగా ఉంది. శివ సాహిత్యం, మేఘన, మనోజ్ గాత్రం హృదయానికి హత్తుకునేలా ఉంది. ఇక ఈ లిరికల్ వీడియోని చూస్తుంటే హీరో హీరోయిన్ల మధ్య ఉన్న ప్రేమను చాటేలా కనిపిస్తోంది.ఈ పాటను రిలీజ్ చేసిన అనంతరం జేడీ చక్రవర్తి మాట్లాడుతూ, 'ఓ.. చెలియా'నుంచి నా కోసం ఆ వెన్నెలఅనే ఓ ప్రేమ గీతాన్ని విడుదల చేశాను. ఈపాటచాలా బాగుంది. హీరో హీరోయిన్ల కెమిస్ట్రీ బాగుంది. సినిమా కూడా బాగుంటుందని, పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ అని అన్నారు. ఈ చిత్రానికి సురేష్ బాలా కెమెరా వర్క్, ఉపేంద్ర ఎడిటింగ్ స్పెషల్ అట్రాక్షన్ కానుంది.త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.తారాగణం: నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి, అజయ్ గోష్, భోగిరెడ్డి శ్రీనివాస్, సారిపల్లి సతీష్, యశోద ఆర్ కొలిశెట్టి, సునీల్ రావినూతల, డార్లింగ్ దాస్ తదితరులు.సాంకేతిక బృందంబ్యానర్: ఎస్‌ఆర్‌ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరా దేవి ప్రొడక్షన్స్ నిర్మాత: రూపశ్రీ కోపూరుదర్శకుడు:నాగ రాజశేఖర్ రెడ్డి.

## పాన్‌ఇండియన్ థ్రిల్లర్ 'డకాయిట్'

### ఉగాది కానుకగా మార్చి 19న గ్రాండ్ గా రిలీజ్

అడివి శేష్ మోస్ట్ అవైటెడ్ మూవీ 'డకాయిట్' లీడ్ క్యారెక్టర్స్‌ని పరిచయం చేసిన ఫైర్ గ్లింప్స్ రిలీజ్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ప్రేమప్రతీకార కథనం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు.

మేకర్స్ తాజాగా డకాయిట్ రిలీజ్ డేట్ అప్డేట్ ఇచ్చారు. 2026 ఉగాది కానుకగా మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. ఇప్పటికే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంది. నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. విజువల్‌గా ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రం డకాయిట్ కావడం విశేషం.

అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ భారీ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాత. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు.



## 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిన్ని గుండెలో సాంగ్ 31న రిలీజ్



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్, యూనిక్ ఎంటర్‌టైనర్ ఆంధ్రాకింగ్‌తాలూక. మహేష్‌బాబు పి దర్శకత్వ ంలో, ప్రముఖ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 28న గ్రాండ్‌థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

ఇప్పటికేవిడుదలైన సాంగ్స్, టీజర్ కి ట్రెమండస్‌రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ నువ్వుం టే చాలే ద్వారా రామ్‌తన సింగింగ్ డెబ్యూ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ పాట ప్రేక్షకుల మనసులను దోచుకుని బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. రెండవ పాట పప్పీ షేమ్ డిఫరెంట్వైబ్‌తో అదిరిపోయింది. ఈ సాంగ్ కి రామ్ స్వయంగా వాయిస్ ఇచ్చారు.ఈ రోజు మేకర్స్ థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. చిన్నిగుండెలో సాంగ్‌ని అక్టోబర్ 31న రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ లో రామ్, భాగ్యశ్రీ క్లాసిక్ లవ్ మూమెంట్ అదిరిపోయింది.ఉపేంద్ర ఈ చిత్రంలో సూపర్ స్టార్‌గా కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్ ముఖ్యమైన పాత్రల్లో కనిపిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తున్నారు. సిద్ధార్థ నుని సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్,తారాగణం: రామ్ పోతినేని, ఉపేంద్ర, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ,విటివి గణేష్ సాంకేతిక సిబ్బంది:కథ,స్క్రీన్ ప్లే దర్శకత్వం: మహేష్‌బాబు పి.నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ప్రొడక్షన్ హౌస్: మైత్రీ మూవీ మేకర్స్,సమర్పణ: గుల్షన్‌కుమార్,భూషణ్ కుమార్ .సిరీస్ ఫిలిమ్స్,సిఇఓ: చెర్రీసంగీతం: వివేక్,మెర్విన్,సినిమాటోగ్రఫీ: సిద్ధార్థనుని,ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్,ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరితుమ్మల, పిఆర్ఓ: వంశీశేఖర్,మార్కెటింగ్: ఫస్ట్ షో.

# కార్పొరేట్ అగ్రపీఠాలపై అతివలు



ప్రకటన సంస్థల్లో ఉద్యోగినులుగానే కాదు, నాయకత్వ స్థానాల్లోనూ మహిళల సంఖ్య పెరుగుతోంది అంటోంది అవ్తార్. చెన్నైకి చెందిన ఈ సంస్థ 'బెస్ట్ కంపెనీస్ ఫర్ విమెన్ ఇన్' (బీసీడబ్ల్యూఐ) 10వ ఎడిషన్ నివేదికను తాజాగా ప్రకటించింది.
అందులో ఈ పరిశీలన. ఇందుకుగానూ 120 సంస్థలపై సర్వే చేసింది. వీటిలో 20 శాతం మంది మహిళలే నిర్వహిస్తున్నారు. ఐటీ, పరిశోధన, ఆర్థిక సేవలకు సేవలు అందించే జీసీసీ రంగాల్లో నాయకురాలు సంఖ్య 22 శాతమంటోంది. వివిధ స్థాయి ఉద్యోగాల్లో మహిళల శాతం 35.7గా ఉండగా... ప్రొఫెషనల్ రంగంలో 44.6 శాతం కనిపిస్తోంది అలాగే ఐటీఈఎస్‌లో 41.7, ఫార్మాలో 25, ఎఫ్ఎంజీజీ రంగంలో 23, తయారీ రంగంలో 12 శాతాల చొప్పున ఉద్యోగినులున్నారు.
అయితే 20 శాతం మహిళలు ఉద్యోగాలు వదులుకునే పరిస్థితులూ కనిపించాయట. వేరేచోట మెరుగైన అవకాశాలు దొరుకు తుండటం, అనారోగ్య సమస్యలు, త్యాగం చేయడం పిల్లల దీని కారణాలను చెబుతోంది. వారి కెరియర్‌పరంగా ముందుకు దూసుకెళ్తున్న వారే ఎక్కువ అంటోంది. అవ్తార్... మహిళలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్న టాప్ 10 సంస్థల జాబితా విడుదల చేసింది. వాటిల్లో యాక్సెంచర్, ఆకా ఎక్స్‌ప్రెల్ ఇండియా, వేదాంత, ఈవై, కేపీఎంజీ ఇండియా, మాస్టర్ కార్డ్, ఆప్టమ్, పీ అండ్ జీ, టెక్ మహీంద్రా, విప్రో వంటి సంస్థలున్నాయి. 2016లో మహిళలు నాయకత్వం వహిస్తున్న సంస్థలు 13 శాతమే: ప్రస్తుతం 20 శాతం పెరిగింది. 25 శాతంగా ఉంటే ఉద్యోగినుల సంఖ్య 35.7కి పెరిగింది. ఇది మహిళా సాధికారతకు నిదర్శనమే అంటారు అవ్తార్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సౌందర్య రాజేష్. ◻

# పఠనాసక్తితో రండి ..



బ్రాండ్లను నిలబెట్టడంలో దిట్ట ఆమె. ఓ ప్రముఖ బహుళజాతి సంస్థకి చీఫ్ బ్రాండ్ అంబాసిడర్. అలాంటామె తాజాగా హైదరాబాద్‌లో ఓ లైబ్రరీని కలిగి ఉంది. 'కాస్త ఆ ఫోన్, రీల్స్ ని పక్కన పెట్టండి. మా గ్రంథాలయానికి రండి' అంటూ ఆహ్వానిస్తున్నారు. అనురాధ సెహగల్ గూర్చి తెలుసుకుందాం..

వస్తువు లేదా బ్రాండ్‌కి విలువ పెంచేలా చేయడం నాకు ఇష్టమైన వ్యాపకం. కాబట్టే, మార్కెటింగ్ వైపు వెళ్లా. మాది అమృత్‌సర్, నాన్న ఆర్ఎన్ సెహగల్ ఆర్మీలో బ్రిగేడర్‌గా చేశారు. అమ్మ రాణి ఉపాధ్యాయురాలుగా చేశారు. ఆంత్రప్రెన్యూర్ కూడా. నాన్న వృత్తిరీత్యా దేశమంతా తిరిగా, కేంద్రీయ విద్యాలయాల్లోనే నా విద్యాభ్యాసం సాగింది. ఎకనామిక్స్‌లో బీఏ ఆనర్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ నుంచి ఇంటర్నేషనల్ బిజినెస్ మాస్టర్స్ పూర్తిచేశా. నా తొలి ఎయిర్‌టెల్, లెన్స్‌కార్ట్‌లోనే కాదు ఉద్యోగం హిందుస్థాన్ యూనిలీవర్‌లో, ఆపై వర్ల్‌పూల్, రెకిట్, కొన్ని మీడియా సంస్థలకీ పనిచేశా. 'ప్రతి ఫ్రెండూ అవసరమేరా ఎయిర్‌టెల్, క్యాంపెయిన్‌తోపాటు వీట్, వానిష్‌లను ముందంజలో నిలపడం వంటివెన్నో నాకు పేరు తెచ్చాయి. ప్రస్తుతం సమాచార సేవా సంస్థ... 'కోఫోర్జ్'కి చీఫ్ బ్రాండ్ అండ్ సస్టెయినబిలిటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

**అమెరికాలో చూసి... ..**
నా పనికీ లైబ్రరీలకీ పొంతన లేదు. అయినా ఎందుకు భాగస్వామ్యమయ్యానంటే మా సీఈఓ సుధీర్ సింగ్ పేరే చెబుతా. ఆయన గతంలో అమెరికాకు వెళ్లినప్పుడు ప్రతి 10-15 కి.మీ.కీ గ్రంథాలయం ఉండడాన్ని గమనించారట. మన దేశంలోనూ అలాంటి ఏర్పాటు చేయాలనుకున్నారు. అందులో భాగంగానే గత ఏడాది ఫిబ్రవరిలో నోయిడాలో 'పీపుల్స్ లైను ప్రారంభించాం. నిజానికి దీనికోసం చాలా పరిశోధన చేశాం. అమెరికాతోపాటు మన దేశంలో ప్రభుత్వాలు, స్థానిక సంస్థల గ్రంథాలయాలను పరిశీలించాం. ఆరు నుంచి అరవయ్యేళ్ల వారికి అందరికీ నచ్చేలా అన్ని జానర్ల పుస్తకాల్లోనూ పాఠశాలలు, ప్రాంతాలకు వెళ్లి మరీ 'మా గ్రంథాలయానికి రండి' అని ఆహ్వానించాం. పత్రికలు, ప్రసార మాధ్యమాల్లోనూ ప్రచారం చేశాం. దీంతో పాఠకుల సంఖ్య పెరిగింది. ఇదే రోజుకు వేలల్లో మా లైబ్రరీని సందర్శిస్తున్నారు. ఈ స్ఫూర్తితో గురుగ్రామ్‌తో పాటు తాజాగా హైదరాబాద్‌లోనూ అందుబాటులోకి వచ్చింది. భవిష్యత్తులో మరిన్ని పబ్లిక్ లైబ్రరీలు తీసుకొనే ఆలోచనలో ఉన్నాం.

**చదివేవాళ్లు పెరుగుతున్నారు... ....**
ఇప్పుడు వార్తలు, సాహిత్యం లాంటివి ఎవరు చదువుతున్నారు? కంప్యూటర్, ఫోన్ పట్టుకుంటే బోలెడు సమాచారం అనేవారికి మా సమాధానం ఒక్కటే ప్రజల్లో పఠనాసక్తి పెరుగుతోందనే. నోయిడాలో లైబ్రరీని ప్రారంభించినప్పుడు ఉచితంగా చదువుకోవచ్చు అని తెలిసిన వారే వచ్చేవారు. క్రమంగా యువత, వృద్ధులే కాదు టెకీలు, పిల్లలు కూడా అనుసరించారు. 'వారంతాల్లో మాల్స్, షికార్లకు పిల్లలను తీసుకెళ్లేవాళ్లం... ఇప్పుడు లైబ్రరీకి తీసుకొస్తున్నాం'అని చాలామంది తల్లిదండ్రులు మాతో చెప్పారు. నిజానికి చదవడమూ వ్యసనమే! కాకపోతే మంచిది. ఒకసారి పుస్తకం పట్టు కుంటే మళ్లీ మళ్లీ దానికేసి ఆకర్షితులవుతారు. దానికి ఉదాహరణ మా గురుగ్రామ్లోని లైబ్రరీనే, దాన్ని రోజుకు 20వేలమంది సందర్శిస్తున్నారు. హైదరాబాద్‌లో మాకు రెండు కార్యాలయాలు, ఒక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఉన్నాయి. వీటిని ప్రారంభించాక మా అభివృద్ధి పెరిగింది. అదీకాక ఢిల్లీ తరవాత ఇక్కడే మాకు ఎక్కువమంది ఉద్యోగులు ఉన్నారు. అలాంటి మావంతుగా ఏదైనా అందించాలని ఇక్కడ 'పీపుల్ లైబ్రరీ' ప్రారంభించాం. ఇక్కడివారికి నచ్చే చరిత్ర, చిన్నపిల్లల సాహిత్యం, జీవిత కథలు... ఇలా యువతకు సాయపడే 15 వేలకు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచాం. మా లక్ష్యం ఒక్కటే నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మారాలి. ఈ అంది పుచ్చుకుని సమాజం ఎదుగుతోంటే చూడాలంటే! ◻

# చర్మ సంరక్షణ కోసం..

అందాన్ని సంరక్షించడంలో అత్యవసర నూనెల పాత్ర కీలకం. పెప్పర్మెంట్ నూనె కూడా దీనికి మినహాయింపు కాదు. మొటిమలు, చర్మం నిర్జీవంగా మారడం, పొడిబారి పోవడం.. వంటి పలు సౌందర్య సమస్యలకు దీని పరిష్కారం లభిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ నూనెను ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం..!

**ఆలివ్ నూనెతో..** గిన్నెలో మూడు టేబుల్స్పూన్ల ఉప్పు, రెండు చెంచాల ఆలివ్ నూనె, నాలుగు చుక్కల పెప్పర్మెంట్ ఆయిల్ వేసి బాగా కలుపుకోవాలి. దీనితో ముఖం, మెడను మృదువుగా, గుండ్రంగా రుద్దుకొని శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం స్క్రబ్లా పనిచేసి చర్మంపై చేరిన మురికి, మృత కణాన్ని తొలగిస్తుంది.



ఫలితంగా చర్మం అందంగా, ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

**జోజోబా ఆయిల్...**విటమిన్ 'ఇ' నూనె, జోజోబా ఆయిల్‌ను సమపాళ్లలో కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. దీనికి కొన్ని చుక్కల పెప్పర్మెంట్ నూనెను కూడా కలపాలి. ముఖానికి మొటిమలు ఎక్కువగా ఉన్న వారు ఈ మిశ్రమాన్ని రోజూ రాత్రి నిద్రపోయే ముందు నేరుగా మొటిమలపై రాయడం.. కొన్ని రోజుల్లోనే మొటిమలు తగ్గడం గమనించవచ్చు.

**కీరాదోసతో..** రెండు చెంచాల కీరాదోస తురుము, టీస్పూన్ పెప్పర్మెంట్ ఆయిల్ తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి.



రెండు టీస్పూన్ల గ్రీన్ క్లే (ఇది సూపర్ మార్కెట్లలో, ఆన్‌లైన్ స్టోర్స్‌లో లభిస్తుంది కూడా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్ వేసుకొని పూర్తిగా ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే చర్మం తాజాగా మారుతుంది. అలా ఇది చర్మం జిడ్డుగా మారకుండా కూడా కాపాడుతుంది.

**పంచదారతో..** గిన్నెలో రెండు కప్పుల పంచదార, పావుకప్పు బాదం నూనె, టీ స్పూన్ పెప్పర్మెంట్ నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఒకవేళ ఈ మిశ్రమం మరీ జారుడుగా కనిపిస్తే ఇంకాస్త పంచదార వేసి కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో భద్రపరచుకొని నెల రోజుల పాటు ఉపయోగించుకోవచ్చు. రోజూ స్నానం చేయడానికి ముందు ఈ మిశ్రమంతో శరీరాన్ని మర్దన చేసుకున్నప్పుడు చర్మం కోల్పోయిన తేమను తిరిగి పొందడంతో పాటు మృదువుగా తయారవుతుంది. ఇక్కడ చేర్చవన్నీ సహజమైన పదార్థాలే అయినా.. వాడే ముందు చర్మ తత్వానికి సరిపడుతుందో లేదో నిపుణులను సంప్రదించి తెలుసుకోవాలి. అలాగే ఒకసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిది. ◻

# మీపై అజమాయిషీ చేస్తున్నారా?

భార్యాభర్తల్లో ఇద్దరూ సమానమే! కానీ కొంతమంది భర్తలు తమ భార్యలపై అజమాయిషీ చెలాయించాలని చూస్తారు. అలాంటి వారిని 'ఆల్ఫా హస్బెండ్' అంటారు. అయితే ఇలాంటి వాళ్లతో గొడవకు దిగకుండా, అదే సమయంలో ఆత్మ గౌరవాన్ని కోల్పోకుండా సమస్యను పరిష్కరించుకోవాలంటున్నారు నిపుణులు.

**నచ్చజెప్పండి!**
భార్యాభర్తల మధ్య ఏ గొడవ ఉన్నా కలిసి కూర్చొని మాట్లాడుకుంటే



పరిష్కారమవుతుందంటారు. ఈ నియమం పెత్తనం చెలాయించే భర్త విషయంలోనూ వర్తిస్తుంది. అయితే ఎదుటివ్యక్తి కోపంలో ఉన్నప్పుడు ఏం చెప్పినా వారికి అర్థం కాదు. తను కాస్త ప్రశాంతంగా ఒకచోట కూర్చున్నప్పుడు.. తన ప్రవర్తన వల్ల మీరు ఎంత ఇబ్బంది పడుతున్నారో విడమరిచి చెప్పండి. ఇద్దరి మధ్య జరిగే ఈ వాదనల వల్ల ఇటు మీరు, అటు మీ పిల్లలు ఎంతలా సతమతమవుతున్నారో వాళ్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేయండి. అలాగే వారు ప్రవర్తించడానికి గల కారణాలేంటో కూడా నేరుగా అడగచ్చు. ఇలా మధ్య జరిగే సానుకూల చర్చనైనా మీ ఇద్దరిలో మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

**ఆత్మన్యూనత వద్దు....**
అకారణంగా ఎదుటి వ్యక్తి మనపై పెత్తనం చెలాయిస్తున్నారంటే ఆత్మన్యూనతకు గురవడం సహజం. ఇలాంటప్పుడే ఇతరులతో పోల్చుకోవడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం.. జరుగుతుంటాయి. ఇలాంటి ప్రతికూల భావనలు శారీరకంగా, మానసికంగా కుంగదీయడంతో అనుబంధానికి అవరోధాలుగా మారుతుంటాయి. ఈ ఆఫర్ మీపై మీరు నమ్మకం, గౌరవం డోల్పోకుండా ఉండేందుకు స్వీయ ప్రేమను పెంచుకోవడం ముఖ్యం, నచ్చిన పనులు చేయడం ఇష్టమైన వ్యాపకాలపై దృష్టి పెట్టడం వల్ల కొంతవరకు ఫలితం ఉంటుంది.



**ఆధారపడద్దు! ..** ఆర్థిక స్వేచ్ఛ ఉన్న మహిళల కంటే, వ్యక్తిగతంగా, ఆర్థికంగా తమపై ఆధారపడే భార్యల విషయంలోనే చాలామంది భర్తలు పెత్తనం చెలాయించాలని చూస్తారు. ఈ కావలసిన పూచిక పుల్లలా తీసిపడేస్తుంటారు. వాళ్ల నిర్ణయాలను, అభిప్రాయాలను ఏమాత్రం గౌరవించరు. భర్తలతో వేగలేక, తాము పడుతోన్న బాధ ఎవరితో చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతుంటారు ఇలాంటి చాలామంది భార్యలు. నిజంగా మీలో ప్రతిభ ఉంటే, మిమ్మల్ని మీరు నిరూపించుకోగలరన్న నమ్మకం ఉంటే ఎవరికీ తలవంచాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు ఈ మీ చదువు, ట్యాలెంట్‌కి తగ్గ ఉద్యోగం వెతుక్కునే ప్రయత్నం చేయండి. ఒకవేళ వాళ్లు అడ్డుపడకుండా.. ఇద్దరి సంపాదన ఉంటే అది కుటుంబానికే మంచిదని సానుకూలంగా మాట్లాడే ప్రయత్నం చేయండి. ఇలా మీ కాళ్ల మీద మీరు నిలబడగలిగితే ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం రెట్టింపవుతాయి. ఇది పరోక్షంగా అనుబంధానికీ మేలు చేస్తుందంటున్నారు నిపుణులు.

**ఆఖరీ ప్రయత్నంగా..!** ఎదుటివారు తమని తక్కువ చేసి చూస్తున్నారంటేనే కోపం కట్టలు తెంచుకోవడం సహజం. అలాగని ఎంత ప్రయత్నించినా వాళ్లు మారట్లేదని.. మీరూ వాళ్లలాగే గట్టిగా అరవడం, గొడవలు చేస్తే సమస్య పరిష్కారమవకపోగా.. మరింత జటిలమవుతుంది. కాబట్టి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోతే.. ఆఖరి ప్రయత్నంగా ఇద్దరూ కలిసి మానసిక నిపుణుల దగ్గరికి కౌన్సెలింగ్‌కి వెళ్లడం మంచిది. మీవారి ప్రవర్తనకు గల కారణాలేంటో తెలుసుకొని వాళ్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వడం, ఇద్దరితో మరోసారి మాట్లాడడం.. దీనివల్ల కొంతవరకు ఫలితం ఉంటుంది. ◻

# మనసు బాలేదా .. టిఫిన్ చేయండి !

ఇంటిపనిలో పడి గృహిణులు, ట్రైంకి బస్ అందుకోవాలని ఉద్యోగినులు టిఫిన్ చేయటం మానేస్తుంటారు. ఒకటి రెండు రోజులు ఏ తేడా కనిపించలేదు. కానీ, రోజూ ఇలానే చేస్తే మానసిక సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. అల్పాహారానికీ, మనసుకీ సంబంధం ఏంటి? అనుకుంటున్నారా? ఉంది... రోజులో ఉదయపు ఆహారం కీలకమైందని. అయితే, అది శరీరానికి శక్తినివ్వటం ఒక్కటేకాదు, మనసుపైనా ప్రభావం చూపుతుంది. బ్రేక్ ఫాస్ట్ ఆలస్యంగా తిన్నా, అసలు తినక పోయినా చికాకు, ఆందోళన, కుంగుబాటు... వంటి వాటికి కారణం. కార్టిసాల్ స్థాయులను పెంచి జీవగడియారంపైనా ప్రభావం చూపుతుంది రాత్రిపూట తగ్గిన గ్లూకోజ్ స్థాయులను పునరుద్ధరించండి, తక్షణ శక్తిని అందిస్తుంది అల్పాహారమే వ మానసికంగా, భావోద్వేగాలపరంగా స్థిరంగా ఉండటానికీ దోహదపడుతుంది. అందుకే, ఆల్పాహారాన్ని తీసుకునేలా చూడండి. అది కూడా ఉదయం తొమ్మిదిలో చేస్తే పూర్తి మేలు. ◻



# పెరుగు జుట్టుకీ మంచిదే !

పెరుగు.. పొట్టకే కాదు.. జుట్టుకీ మంచిదే అంటున్నారు. పెరుగుతో కలిపి వేసుకునే కొన్ని హెయిర్ ప్యాక్స్ సమస్యలను పోగొట్టి వెంట్రుకలకు బలాన్ని మెరుపునూ ఇస్తాయి. ఇదిగో ఈ ప్యాక్స్ ఇలాంటివే.

పెరుగు, మినుములతో..
జుట్టు మృదువుగా, బలంగా కావాలంటే ఈ ప్యాక్ ప్రయత్నించండి.
**కావాల్సినవి :** మినుములు అర కప్పు, పెరుగు-అర కప్పు.
**ప్యాక్ ఇలా!** మినుముల్ని రాత్రంతా నానబెట్టుకొని ఉయాన్నే మెత్తటి పేస్ట్‌లాగా చేసుకోవాలి. ఈ పేస్ట్‌ని పెరుగులో వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు, జుట్టు మొత్తానికీ పట్టించాలి. అరగంట తర్వాత సాంపూతో తల స్నానం చేయాలి. ఈ ప్యాక్ వల్ల జుట్టు దృఢంగా మృదువుగా అందంగా తయారవుతుంది.
◆ ఈ ప్యాక్ వారానికి రెండుసార్లు వేసుకుంటే మెరుగైన ఫలితం ఉంటుంది. మీ జుట్టు చివర్లు చిట్లిపోయి ఎక్కువగా జుట్టు రాలి పోతోందా? అయితే ఈ ప్యాక్ ట్రై చేసి చూడండి.



**కావాల్సినవి :** ◆ గడ్డ పెరుగు-ఒక కప్పు, మెంతులు-పావు కప్పు.
ప్యాక్ ఇలా ! మెందుగా మెంతుల్ని మిక్సీ పట్టుకోవాలి. ఇలా తయారైన పొడిని పెరుగులో వేసి పేస్ట్‌లా అయ్యేంత వరకు కలుపుతూనే ఉండాలి. ఈ పేస్ట్‌ని జుట్టు మొదళ్ల నుంచి చివర్ల వరకు, మాడుకూ పట్టించి గంట పాటు అలాగే ఉంచుకోవాలి. తర్వాత షాంపూతో తలస్నానం చేసి కండిషనర్ రాసుకోవాలి.
ఈ ప్యాక్‌లో ఉపయోగించిన మెంతుల వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉండడంతో పాటు చివర్లు చిట్లిపోవడాన్ని తగ్గిస్తుంది. అలాగే జుట్టు ఎక్కువగా రాలిపోవడాన్ని అరికడుతుంది.
గుర్తుంచుకోండి..◆ ఈ ప్యాక్‌ను పొడిగా ఉన్న జుట్టు పైనే అప్లై చేసుకోవాలి. ◆ వారానికోసారి ఈ ప్యాక్ ట్రై చేయచ్చు. ◆ వేసుకోవడానికి కనీసం రెండు గంటల ముందే ఈ ప్యాక్ తయారు చేసి పెట్టుకోవాలి. చూశారుగా.. పెరుగు జుట్టు సమస్యలను ఎలా పోగొడుతుందో.. కాబట్టి ఇలాంటి సహజసిద్ధమైన, సులభంగా తయారు చేసుకునే హెయిర్ ప్యాక్స్ ప్రయత్నించి ఎలాంటిదుష్ప్రభావాల బారిన పడకుండా మీకురులను కాపాడుకోండి. అయితే ఈ క్రమంలో తలస్నానానికి ఉపయోగించే షాంపై గాఢత తక్కువగా ఉండేలా జాగ్రత్తపడండి. ◻

# బోళా శంకరుడు

శివాయ విష్ణు రూప.ఆయ శివరూపాయ విష్ణవే శివశ్య హృదయం విష్ణో విష్ణో శ్చం హృదయం శివః రూపాలు వేరైనా శివకేశవులు ఒక్కరే అనుకుంటే అలంకరా ప్రియహో విష్ణు! అభిషేక ప్రియ! శివహః అన్నట్లుగా పాలకడలిలో శేషతల్పంపై లక్ష్మీ సమేతుడై పవళించే శ్రీమహా విష్ణువు పర్వాలంకరణ భూషితుడై కన్నులపండుగగా దర్శనం ఇస్తే సదాశివుడు మాత్రం కైలాసంలో మంచు కొండల మధ్య జటా జూటధారిగా మెడలో సర్ప పరంతో గరళకంఠుడిగా పులితోలు ఆసనంగా శూల పాణిగా నిరాడంబరంగా భక్త జనపాలుడై లయకారుడై వరాలిచ్చేవాడే, శంకరుడుగా పూజలందుకుంటాడు. కానీ ముక్కంటి అయిన ఈశ్వరుడు ఆగ్రహం కలిగితే మూడో కన్ను విప్పి ప్రపంచాన్నే దహించగల రుద్రుడు. దయాహృదయం కలిగి. భక్త సులభుడిగా అభయం ఇచ్చి కాపాడే కరునామయుడు. అందుకే మన పురానాల ప్రకారం దానవులు శివతత్వం తెలిసిన వారై, ఆయనను ఆశ్రయించి జపాలు చేసి, తాము కోరిన వరాలు పొంది, ఆ తరువాత శివ సాయుధ్యం పొందారు. యుగయుగాలు తపమాచరించినా శ్రీ మహా విష్ణువు ప్రత్యక్షం కావడం కష్టం అయితే బోళాశంకరుడు మాత్రం తన చెంతకు చేరే వారిని త్వరిత గతిని తన దర్శన భాగ్యం కలుగజేసి తరింపచేసే, శివుడు లేని ప్రదేశం ఉండదు అనేలా ఆయన అన్ని వేళలా అభిషేక ప్రియుడుగా ఆరాధనలు అందుకుంటాడు. సాధు స్వభావులను, రాక్షసులను కూడా శివుడు సమానంగా కటాక్షిస్తూ ఉన్న ఫలితంగా హిరణ్య కశిపుడు భస్మాసురుడు మొదలుగా అసురులెందరో వారు కోరిన వరాలను గ్రహించారు ముక్తిపొందారు. ద్వాదశ జ్యోతిర్లింగాలుగా, సౌ రాష్ట్ర సోమనాథుడు శ్రీశైల మల్లికార్జునుడు ఉజ్జయిని మహాకాళుడు. ఓంకారుడుగా అమరేశ్వరం వైద్యనాథుడిగా, భీమశంకరుడై రామేశ్వరుడై దారుకావన నాగేశ్వరుడుగా వారనాశి విశ్వేశ్వరుడు గౌతమీతట త్రయంబకేశ్వరుడు. కేదార హిమవత్ వృష్ఠి, విష్వేశ్వరుడుగా, శివ క్షేత్రాలు పవిత్ర కార్తీకంలో పలు భక్తులు శివాభిషేకాలు, పూజలు గావించి పునీతులై ఆయా ఆలయాల దర్శనంతో పారవశ్యం పొందుతారు. పంచారామాలైన, ద్రాక్షా రామం, అమరారామం, క్షీరారామం, సోమారామం, భీమారామం, శివనిలయాలైన ఆ రామాలు, నందివాహనుడు శివుడి ఎందుటనే ఎప్పుడూ, కనపడే స్వామి నందిమదనకాంకారి అయిన పరమేశ్వరుడు పార్వతీ సమేతంగా నాట్య ప్రియుడై, ప్రమథ గణాలతో తాండివించేన నటరాజు. బాలుడైన ధృవుడికి దీర్ఘాయుషు ప్రసాదించి, నక్షత్రంగా నిలిపిన హరుడి మహత్యాలు వర్ణింప సాధ్యంకావు 'ఓం నమశ్శివాయ' పంచాక్షరీ మంత్రం జపిస్తే చాలు పత్రం, పుష్పం ఫలంతోయం అన్నట్లుగా కేవలం నీటితో అనుగ్రహించే గంగాధరుడు కార్తీక మాసం శివలయాలు శక్తి సందోహంతో కళకళలాడుతూ పుణ్యం ప్రసాదించేపవిత్ర స్థలాలు దర్శనీయ క్షేత్రాలు.

- యం.వి రమణకుమారి.

ఆధ్యాత్మికం

# ఎగ్‌ప్లాంట్ పిజ్జా

**తయారీకి కావలసిన పదార్థాలు :**
ఎగ్‌ప్లాంట్ (పెద్ద వంకాయ): ఒకటి, టమాట: ఒకటి, పిజ్జా సాస్: అర కప్పు, తురిమిన చీజ్: అర కప్పు, పార్సిమెన్: పావు కప్పు, ఆలివ్స్: పావు కప్పు, ఆలివ్ ఆయిల్: అర కప్పు, కొత్తిమీర తురుము: కొద్దిగా.
**తయారీ విధానం:** ఎగ్‌ప్లాంట్‌ను కాస్త మందంగా గుండ్రటి ముక్కల్లా కోయాలి. కోసిన ముక్కల్ని ఒక ప్లేట్‌పై పరిచి పైనుంచి ఆలివ్ ఆయిల్ వేసి పదిహేను నిమిషాల పాటు 180 డిగ్రీల వద్ద ఒవెన్‌లో బేక్ చేయాలి. బేక్ అయిన ముక్కలపై పిజ్జా సాస్, చీజ్ తురుము, పార్సిమెన్ వేసి పైనుంచి ముక్కలు చేసిన ఆలివ్స్, సన్నగా, గుండ్రంగా కోసిన టమాట ముక్కలు పెట్టి మరో పదినిమిషాలు బేక్ చేయాలి. చివరగా పైనుంచి కొత్తిమీర చల్లుకుంటే వేడివేడిగా నోరూరించే ఎగ్‌ప్లాంట్ పిజ్జా సిద్ధం. ◻



## చెలి చిట్కా

సున్నము లేదా బెల్లముగాని కోడిగుడ్ల సోనను అందులో కలిపి చాతీపై పట్టువేయవలెను. ఊపిరిగొట్టు నొప్పి తగ్గును. ◻

# దక్షిణాఫ్రికా సిరీస్‌కు టీమిండియాలో నంబర్ 4?

## శ్రేయస్ ప్లేస్‌కై ముగ్గురు పోటీ


సంజు సామ్సన్


రియాన్ పరాగ్


తిలక్ వర్మ

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా టీం ఇండియా బ్యాట్స్ మన్ శ్రేయాస్ అయ్యర్ గాయపడ్డాడు. ఆయన కోలుకోవడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. దీంతో దక్షిణాఫ్రికా సిరీస్‌కు అతని స్థానంలో ఎవరు వస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పలువురు ప్లేయర్లు ఈప్లేస్‌కోసం పోటీ పడుతున్నారు. దక్షిణాఫ్రికాతో భారత్ తదుపరి వన్డే సిరీస్ నవంబర్ 30న స్వదేశంలో ప్రారంభమవుతుంది. అయ్యర్ స్థానంలో ఎవరు వస్తారనే దానిపై సెలక్షన్ కమిటీ ఇప్పటికే కసరత్తు చేస్తోంది. ఈ ప్లేస్‌కు ప్రధానంగా ముగ్గురు పోటీ పడుతున్నారు. వీరిలో సంజు సామ్సన్ ఉన్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో సంజు ఆఫార్మాట్‌లో పైవరుసలో బ్యాటింగ్ చేస్తాడని ప్రకటించడంతో అతనికి ఆ సిరీస్‌లో అవకాశం రాలేదు. ఇప్పుడు నంబర్ 4 ప్లేస్ ఖాళీగాఉంది కాబట్టి, సంజుకు అవకాశం ఇవ్వాలి. ముఖ్యంగా గత వన్డే సిరీస్‌లో అతను ప్రదర్శించిన ఫామ్‌ను పరిశీలిస్తే, ఇప్పటివరకు 16 వన్డేలు ఆడి 56.66 సగటుతో 510 పరుగులు చేశాడు. అతని పేరులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలుకూడా ఉన్నాయి. అయ్యర్ ప్లేస్‌లో సుల భంగా నాలుగో స్థానంలోకి వచ్చి ఎక్కువ పరుగులు చేయగలడు. మరొకరు తిలక్ వర్మ. గత నెలలో ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ తో తిలక్ వర్మ ఓవర్‌నైట్ స్టార్ అయ్యాడు. 2023లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డేలో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 4 మ్యాచ్‌ల్లో కేవలం 68 పరుగులు మాత్రమే చేశాడు. కానీ ఆసియా కప్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, అతను మంచి ఫామ్‌లో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లో తిలక్ 4వ స్థానంలో బ్యాటింగ్‌ను బలోపేతం చేయగలడు. ఇక రియాన్ పరాగ్ గత ఏడాది శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. అయితే, గాయం కారణంగా అతను జట్టుకు దూరంగా ఉన్నాడు. కేవలం ఒక మ్యాచ్ మాత్రమే ఆడి తొమ్మిది ఓవర్లలో 15 పరుగులు చేసి 3 వికెట్లు తీసుకున్నాడు. అతను భారత్ తరపున తొమ్మిది టి20లు కూడా ఆడగా, ఆరు ఇన్నింగ్స్ లలో 106 పరుగులు చేసి 4 వికెట్లు తీసుకున్నాడు. పరాగ్ నాల్గవ స్థానంలో బ్యాటింగ్ చేయగలగడంతో పాటు, అదనపు బౌలింగ్ కాకుండా జట్టుకు సమతుల్యతను అందిస్తాడు.

# పారా క్లైంబింగ్ ప్రపంచ కప్‌లో.. మణికందన్‌కు స్వర్ణం



**న్యూఢిల్లీ:** పారా క్లైంబింగ్ ప్రపంచ కప్-2025లో మణికందన్ కుమార్ స్వర్ణం సాధించాడు. ఫ్రాన్స్‌లోని లావల్‌లో జరిగిన పురుషుల ఆర్పీ2 విభాగంలో ఈ భారత ఆటగాడు అత్యున్నత స్థానాన్ని సంపాదించాడు. అక్టోబర్ 24-26 వరకు ఫ్రాన్స్‌లోని లావల్‌లో జరిగిన ఐఎఫ్ఎస్‌సి పారా క్లైంబింగ్ వరల్డ్ కప్ చివరి రోజున భారతదేశానికి చెందిన మణికందన్ కుమార్ 2025 సీజన్‌లో తన తొలి ప్రపంచ కప్ స్వర్ణాన్ని సాధించాడు. పురుషుల ఆర్పీ2 పోటీ పడుతున్న మణికందన్ అసాధారణ ప్రదర్శనతో జర్మనీకి చెందిన ఫిలిప్ ఫ్రోజెక్‌ను 44+ నుండి 44 తేడాతో ఓడించాడు. ఆస్ట్రియాకు చెందిన డేనియల్ వీనర్ 40 కాంస్య పతకాలతో రెండో స్థానంలో నిలిచాడు. కాగా మణికందన్ ఈ ఈవెంట్‌లో పలుసార్లు పతకం గెలుచుకున్నాడు. వాటిలో ఇటలీలోని ఆర్కోలో జరిగిన 2024 ఎడిషన్‌లో స్వర్ణం కూడా ఉంది. ఈ ఈవెంట్ యొక్క చివరి పతకాల పట్టికలో రికార్డు స్థాయిలో 18 దేశాలు చోటు దక్కించుకున్నాయి. ఫ్రాన్స్ ఐదు స్వర్ణాలు, రెండు కాంస్యాలతో అగ్రస్థానంలో నిలిచింది, జర్మనీ ఎనిమిది పతకాలతో అత్యధికంగా ఒక స్వర్ణం, ఐదు రజతాలు, రెండు కాంస్యాలు సాధించింది.

# ఆసియా యూత్ గేమ్స్.. రికార్డు బద్దలు కొట్టిన ధీనిధి



**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్ 2025లో భారత స్విమ్మర్ ధీనిధి దేశింగు 400 మీటర్ల ఫ్రీస్టైల్ రికార్డును బద్దలు కొట్టింది. ఫైనల్‌లో ఐదవ స్థానంలో నిలిచి తన రికార్డును మూడు సెకన్ల తేడాతో మెరుగుపరుచుకుంది. బహ్రెయిన్‌లో జరిగిన ఆసియా యూత్ గేమ్స్ లో ధినిధి కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. ధీనిధి 4:21.86 సెకన్లలో పూర్తి చేసి ఫైనల్‌లో ఐదవ స్థానంలో నిలిచింది. ఆమె 4:24.60 సెకన్ల రికార్డును మెరుగుపరుచుకుంది. ఇదే ఈవెంట్‌లో, దేశానికే చెందిన అదితి సతీష్ హెగ్డే 4:32.00 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచింది. భారత బాలికల 4+100 మీటర్ల ఫ్రీస్టైల్ రిలే 4:05.73 సెకన్ల సమయంతో ఫైనల్‌లో చివరి స్థానంలో నిలిచింది. ఇక బాలురలో నితీశ్‌సాయి హరినాథ్ 50 మీటర్ల ఫ్రీస్టైల్ ఫైనల్‌లో 23.72 సెకన్లతో ఐదవ స్థానంలో నిలిచాడు. 400 మీటర్ల ఫ్రీస్టైల్ ఫైనల్‌లో ఈత కొట్టిన ధక్షన్ శశికుమార్ 4:00.87 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచాడు. 100 మీటర్ల బటర్‌ఫ్లైలో, వేదాంత్ టాండలే 56.31 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచాడు.

### ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్.. నవంబర్ 14 నుంచి

# గ్రేటర్ నోయిడాలో పోరు

**హైదరాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ 2025కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. నవంబర్ 14 నుంచి 21 వరకు గ్రేటర్ నోయిడాలోని షహీద్ విజయ్ సింగ్ పథిక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. మొత్తం 18 దేశాల నుంచి 140 మందికి పైగా అగ్రశ్రేణి బాక్సర్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. వీరిలో ముగ్గురు ఒలింపిక్ పతక విజేతలు కూడా ఉండటం విశేషం. ఈ టోర్నమెంట్‌లో 20 మంది (10 మంది పురుషులు, 10 మంది మహిళలు)తో కూడిన బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. ఈ జట్టుకు మాజీ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ (51 కిలోలు), ప్రస్తుత ప్రపంచ చాంపియన్లు జాస్మిన్ లంబోరియా (57 కిలోలు), మీనాక్షి (48 కిలోలు), రెండుసార్లు ఆసియా చాంపియన్ పూజా రాణి (80 కిలోలు) వంటి స్టార్ మహిళా బాక్సర్లు నాయకత్వం వహిస్తున్నారు.

పురుషుల విభాగంలో ఈ సీజన్ ప్రపంచ కప్ టోర్నీల్లో పతకాలు సాధించిన హితేష్ (70 కిలోలు), అభినాష్ జమ్వాల్ (65 కిలోలు) వంటి బాక్సర్లు ఉన్నారు. జాదుమణి సింగ్ (50 కిలోలు), పవన్ బర్త్వాల్ (55 కిలోలు), సచిన్ (60 కిలోలు), సుమిత్ (75 కిలోలు), లక్ష ్య చాహర్ (80 కిలోలు), జుగ్నూ (85కిలోలు), నవీన్ కుమార్ (90కిలోలు), నరేందర్ (90+ కిలోలు) వంటి ఇతర భారత బాక్సర్లు కూడా తమ సత్తా చాటడానికి సిద్ధంగా ఉన్నారు. మహిళల్లో ప్రీతి (54కిలోలు), పర్వీన్ (60కిలోలు), నీరజ్ ఫోగట్ (65కిలోలు), అరుంధతి చౌధరి (70కిలోలు) పోటీ పడుతున్నారు.

ఈ ఫైనల్స్‌లో మూడు పారిస్ ఒలింపిక్ పతక విజేతలైన దక్షి ణ కొరియాకు చెందిన ఏజి ఇమ్, చైనీస్ తైపీకి బాక్సర్లు వూ షిహ్‌యి, చెన్ నీన్‌చిన్ బరిలో నిలిచారు. వీరితో పాటు వివిధ ప్రపంచ చాంపియన్‌షిప్స్ లో స్వర్ణాలు సాధించిన పలువురు కూడా బరిలో నిలవడంతో పోటీ స్థాయి మరింత పెరగనుంది. ప్రపంచంలోని అత్యుత్తమ బాక్సర్లు స్వదేశంలో పోటీ పడటం మన దేశ బాక్సర్లకు తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశమని బీఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ పేర్కొన్నారు.

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ కు ఆతిథ్యం ఇవ్వడం భారత బాక్సింగ్‌కు గర్వకారణం. ప్రపంచ స్థాయిలో మేము ఎంత ఎదిగామో ఇది ప్రతిబింబిస్తుంది. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలను, ఒలింపిక్ పతకవిజేతలను ఇక్కడ పోటీకి తీసుకురావడం కేవలం గౌరవం మాత్రమే కాదు, బాక్సింగ్ పవర్‌హౌస్‌గా భారత్ పెరుగుతున్న స్థాయికి నిదర్శనం అని అన్నారు. ఈ వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్ సీజన్ మొత్తంలో జరిగిన గ్లోబల్ సిరీస్‌కు ముగింపు పలకనుంది. సీజన్‌లో అత్యధిక ర్యాంకు సాధించిన అథ్లెట్లు పది వెయిట్ కేటగిరీల్లో ట్రోఫీ కోసం పోటీపడతారు.

# వరల్డ్ టేబుల్ టెన్నిస్-2025 ఫైనల్స్‌కు మనుష్-దియా అర్హత

## తొలి భారతీయ జంటగా రికార్డు



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్-2025 ఫైనల్స్‌కు అర్హత సాధించిన తొలి భారతీయ జంటగా మనుష్ షా-దియా చిటాలే నిలిచారు. ఇది భారత టేబుల్ టెన్నిస్‌కు చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. మంగళవారం తాజా వరల్డ్ టేబుల్ టెన్నిస్ సిరీస్ ఫైనల్స్ రేస్ ర్యాంకింగ్స్ ప్రకారం, మనుష్-దియా జంట డిసెంబర్ 10 నుండి 14 వరకు చైనాలోని హాంకాంగ్‌లో జరిగే సంవత్సరాంతపు ఈవెంట్‌లో స్థానం నిర్ధారించిన ఐదవ మిక్స్‌డ్ డబుల్స్ జట్టుగా నిలిచింది. అలాగే స్టార్ కంటెండర్ మస్కట్ (నవంబర్ 17-22) ముగింపులో డబ్ల్యూటీటీ సిరీస్ ఫైనల్స్ రేస్ ర్యాంకింగ్‌లు డబ్ల్యూటీటీ ఫైనల్స్‌కు స్వయంచాలకంగా అర్హత సాధించే ఏడు జతలను నిర్ణయిస్తాయి. ఎనిమిదవ స్థానాన్ని హోస్ట్ వైల్డ్‌కార్డ్ జత తీసుకుంటుంది. ఈ సీజన్‌లో, షా మరియు చిటాలే ట్యూనిస్‌లో డబ్ల్యూటీటీ కాంటెండర్ టైటిల్‌ను గెలుచుకున్నారు. అలాగే బ్రెజిల్‌లోని ఫోజ్ డో ఇగువాకులో జరిగిన డబ్ల్యూటీటీ స్టార్ కాంటెండర్ ఈవెంట్‌లో రన్నరప్‌గా నిలిచారు. తాజా ఐటిటిఎఫ్ ర్యాంకింగ్స్ లో ఈ భారత జంట ఎనిమిదో స్థానంలో ఉంది. డబ్ల్యూటీటీ ఫైనల్స్ మొదటిసారి 2021లో జరిగాయి. మొదటి నాలుగు ఎడిషన్ల మాదిరిగానే, ఈ సంవత్సరం ఈవెంట్‌లో కూడా సింగిల్స్ విభాగాలలో టాప్ 16 మంది పురుషులు, మహిళలు పోటీపడతారు. అయితే, 2023, 2024 ఎడిషన్లలో భాగమైన పురుషులు, మహిళల డబుల్స్ విభాగాలను హాంకాంగ్‌లో మిక్స్‌డ్ డబుల్స్ ద్వారా భర్తీ చేయనున్నారు.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.